www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★






గాజాలో మారణహోమం నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు 06
మహారాష్ట్ర ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు 05
ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి 05



సంపుటి 08, సంచిక: 314 | బుధవారం | 15-10-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# బనకచర్లను ఒప్పుకోం

- సిడబ్ల్యుసికి ఖరాకండిగా తేల్చి చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం
- ఏపి ప్రభుత్వం ప్రాజెక్టు సర్వే కోసం విడుదల చేసిన కొత్త టెండర్ నోటిఫికేషన్ రద్దుచేయాలని లేఖ
- కృష్ణా జలాల విషయంలో రాజీపడబోమని స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

కృష్ణానదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదని తెలంగాణ ప్రభుత్వం ఖరాకండిగా చెప్పింది. తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి, సర్వేకు కొత్త టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌పై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. తాజాగా వెలువడిన టెండర్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి (సిడబ్ల్యుసి) మంగళవారం లేఖ రాసింది. ఈ విషయంలో రాజీపడబోమని ప్రభుత్వం లేఖలో ప్రభుత్వం పేర్కొంది. పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేస్తోన్న విషయం తెలిసిందేనని, గతంలో కూడా ఈ విషయాన్ని పేర్కొన్నామని లేఖలో రాశారు. అయితే ఈ ప్రాజెక్టు విషయంలో ఎపి ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోందని, బనకచర్ల టెండర్, సర్వే నిలిపివేయాలని లేఖలో విజ్ఞప్తి చేసింది. ఎట్టి పరిస్థితుల్లో పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును ఆమోదించవద్దని తెలంగాణ ప్రభుత్వం సిడబ్ల్యుసిని కోరింది. పోలవరం డిపిఆర్‌కు విరుద్ధంగా ఈ టెండర్ ఉందని తెలంగాణ ఆరోపించింది. 'బనకచర్లపై కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌ను తెలంగాణ మంత్రులు స్వయంగా కలిసి లిఖితపూర్వకంగా గతంలోనే తెలంగాణ అభ్యంతరాలు తెలిపాం' అని లేఖలో పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై తాము ట్రిబ్యునల్ ఎదుట సమర్థంగా వాదనలు కూడా వినిపించామన్నారు. అయినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా బచనచర్ల ప్రాజెక్ట్‌పై టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయడం విడ్డూరంగా ఉందని లేఖలో పేర్కొన్నారు.

## నీటిపారుదల శాఖలో 106 మంది ఇంజనీర్లు బదిలీ

హైదరాబాద్ సర్కిల్ పరిధిలోనే 60 మందికి స్థానచలనం

నీటి పారుదల శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా 106 మంది ఇంజినీర్లను బదిలీ చేశారు. ఇందులో హైదరాబాద్ సర్కిల్ పరిధిలో 60 మందికి పైగా ఇంజినీర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చెరువులు, కుంటల్లో నిర్మాణ సంస్థలకు ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల కోసం ఎన్‌ఒసిల జారీ విషయంలో వస్తున్న ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ ఆరోపణల ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కాగా బదిలీ అయిన ఇంజినీర్లలో ఇఇలు, డిఇఇలు, ఎఇఇలు ఉన్నారు.

# అజ్ఞాతానికి తెర

## మల్లోజుల వేణుగోపాల్ లొంగుబాటు

- 60 మంది సహచరులతో జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టు నేత
- భద్రాచలంలోనూ ఆయుధాలు వీడిన ఆరుగురు నక్సల్స్




ప్రజాపక్షం/ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం

దశాబ్దాల అజ్ఞాత చరిత్రకు తెర పడింది. 40 సంవత్సరాల క్రితం ఎత్తిన తుపాకీ పోలీసుల ఎదుట దించక తప్పలేదు. మావోయిస్టు పార్టీ పక్షాన వివిధ బాధ్యతలు నిర్వహించిన మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ @ సోను, @ భూపతి మంగళవారం మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. సోమవారం అర్ధరాత్రే ఆయన పోలీసులకు లొంగిపోయినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో లొంగుబాటు సభ ఏర్పాటు చేసి అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ అజ్ఞాత జీవితంలో పార్టీలో వివిధ బాధ్యతలను నిర్వర్తించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఇప్పటి పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మల్లోజుల మధురమ్మ, వెంకటయ్యలకు జన్మించాడు. పెద్దన్న అంజన్న పౌరోహిత్యం నిర్వహిస్తుండగా రెండవ వాడైన మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ మావోయిస్టు అగ్రనేతగా పనిచేశాడు. 2011 నవంబర్ 24న పశ్చిమ బెంగాల్‌లో జరిగిన పోలీసుల ఎన్‌కౌంటర్‌లో కిషన్‌జీ మృతిచెందగా ఆయన భార్య ఇటీవల లొంగిపోయినట్లు తెలుస్తుంది. వేణుగోపాల్ మావోయిస్టు పార్టీలో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర కమిటీలో అత్యున్నత స్థానంలో పనిచేసిన ఆయన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర బోర్డర్‌లో పలు కీలక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు సాయుధ బలగాల శిక్షణ, పార్టీ సాహిత్యం, వ్యూహాత్మక దాడులకు రూపకల్పన చేయడంలో సిద్ధ హస్తుడిగా పేరుంది. 10 ఏప్రిల్ 2010న దంతెవాడ జిల్లాలో 70 మంది పోలీసులను హతమార్చిన ఘటనకు మల్లోజుల నేతృత్వంవహించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. వేణుగోపాల్ సతీమణి తారా 2018లో పోలీసుల ఎదుట లొంగిపోయారు. మావోయిస్టు పార్టీ ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటున్న సమయంలో తరువాయి 2లో





## బిసి కోటాపై సుప్రీంలో న్యాయం జరుగుతుంది

- హైకోర్టు ఇచ్చిన స్టేను సవాల్ చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశాం
- రేపు విచారణకు వచ్చే అవకాశం
- వెనుకబడిన తరగతులకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది
- పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని, ఈ అంశంపై సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి) దాఖలు చేసిందని ఆయన తెలిపారు. బిసి రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఒ9ని యదాతథంగా అమలు చేయాలనేది ఆలోచన అని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం 40 పేజీలతో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను వేసిందని, అది గురువారం సుప్రీంకోర్టులో తరువాయి 12లో

# పోలీసులకు.. కోరిన సమాచారమివ్వండి

- 'ఐ క్లౌడ్' అకౌంట్ పాస్‌వర్డ్ అందజేయాలి
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు 'సుప్రీం' ఆదేశం
- దర్యాప్తుకు సహకరించేందుకు బలవంతపు చర్యల నుంచి రావుకు 'మధ్యంతర రక్షణ'ను పొడిగింపు
- నవంబర్ 18కు విచారణ వాయిదా



**న్యూఢిల్లీ :** తెలంగాణ రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడైన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) పూర్వ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో రాష్ట్ర పోలీసులకు తన 'ఐ క్లౌడ్' అకౌంట్ పాస్‌వర్డ్‌ను సమర్పించాలని మంగళవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ప్రభాకర్‌రావు ఆయన దర్యాప్తు అధికారి ముందు హాజరుకావడానికి, దర్యాప్తులో సహకరించడానికి బలవంతపు చర్యల నుండి రక్షణను కూడా పొడిగించింది. విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ ప్రభాకర్‌రావు సహాయనిరాకరణ కారణంగా దర్యాప్తు ముందుకు సాగడం లేదని, కోర్టు రక్షణ ఉత్తర్వుల కింద కీలకమైన ఎలక్ట్రానిక్ పరికరాలను ఫార్మేట్ చేశాడని, కీలకమైన అనేక ఆధారాలను నాశనం చేశాడని ధర్మాసనం ముందు ఆరోపించారు. 'అతడు కేవలం రాజకీయ నాయకుల ఫోన్లనే కాకుండా, ముఖ్యమైన ఫోన్లను కూడా ట్యాప్ చేస్తున్నాడు. ముందస్తు బెయిల్ దాఖలు చేసిన తర్వాత అతడు ఆ పరికరాన్ని తరువాయి 2లో

# సిపిఐ వందేళ్ల చరిత్ర విస్తృతంగా ప్రచారం

- శతవసంతాల ఉత్సవాల ముగింపు సభకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపు
- ఖమ్మం బహిరంగసభ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో మైలురాయిగా నిలిచిపోనున్నదని వ్యాఖ్య



ప్రజాపక్షం/ ఖమ్మం

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంత ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న జరిగే చారిత్రక సభకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఖమ్మం బహిరంగ సభ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఒక మైలు రాయిగా నిలిచిపోనున్నదని ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. కర్నాటి భానుప్రసాద్ అధ్యక్షవహించిన ఈ సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో కమ్యూనిస్టు పార్టీకి ఒక ప్రత్యేక స్థానం ఉందని స్వాతంత్ర్య ఉద్యమ సందర్భంగా సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనన్నారు. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశపు నడిబొడ్డున స్వతంత్ర రాజుగా ప్రకటించుకున్న నిజాం రాజరికాన్ని కూలదోసి రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు మహత్తర తెలంగాణ తరువాయి 2లో

## అఖిలపక్ష పార్టీలను ప్రభుత్వం ఢిల్లీకి తీసుకెళ్లాలి

కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఆమోదించాలి

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని, ఇప్పటికైనా బిసిల రిజర్వేషన్ కోసం రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్ కోసం కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చేందుకు రాష్ట్రంలోని అఖిలపక్ష పార్టీలను రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి తీసుకెళ్లాలని ఆయన కోరారు. శాసనసభ సాక్షిగా బిజెపి శాసనసభ్యులు తరువాయి 12లో



## పసిడి ధరలు పైపైకి

ఒక్కరోజే తులానికి రూ.3 వేలు జంప్

రూ.1.30 లక్షలు దాటిన 10 గ్రాముల ధర

**ముంబయి :** సామాన్యులను ఊరిస్తున్న బంగారం.. సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. మంగళవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3,000 ఎగబాకింది. ఫలితంగా తులం బంగారం రూ.1.30 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. మార్కెట్ వర్గాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం తులం బంగారం ధర రూ.2,720 పెరిగి మునుపెన్నడూ లేనివిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం తరువాయి 12లో

## గ్రూప్-2 అభ్యర్థులకు 18న నియామక పత్రాలు

783 మందికి శిల్పకళావేదికలో అందజేయనున్న సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్–2 అభ్యర్థులకు ఈనెల 18 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. శిల్పకళా వేదికలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రూప్ 2 ద్వారా ఎంపికైన 783 మంది అభ్యర్థులకు ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందిస్తారని తెలిపారు. వీరిలో దాదాపు 16 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నారని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులందరినీ ఆహ్వానిస్తున్నట్లు సిఎస్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నియామకాల్లో సాధారణ పరిపాలన, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అభ్యర్థులే అధికంగా ఉన్నందున, రెవెన్యూ, హోమ్, జిఎడి కార్యదర్శులు కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సిఎస్ ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రానున్న 30 ఏళ్ల పాటు సర్వీస్‌లో ఉంటారు కాబట్టి వీరికి ప్రభుత్వ సర్వీస్ పట్ల ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిజిపి శివధర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, తరువాయి 2లో



## ప్రైవేటు బ్యాంకులన్నింటినీ జాతీయీకరణ చేయాలి

- ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు డిమాండ్
- కరూర్ వైశ్యాబ్యాంక్ డివిజినల్ కార్యాలయం వద్ద బ్యాంకు ఉద్యోగుల సామూహిక ప్రదర్శన

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశ ఆర్థికాభివృద్ధికి, జాతీయ సంపద, ప్రజాధనం పరిరక్షణ కోసం ప్రైవేటు బ్యాంకులన్నింటినీ జాతీయాకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ) జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు డిమాండ్ చేశారు. దేశ ప్రయోజనాలను కాపాడేందుకు తరువాయి 2లో

## బాధ్యులైన అధికారులపై వెంటనే చర్యలు

- ప్రధాని మోదీ, హర్యానా సిఎంలకు రాహుల్‌గాంధీ డిమాండ్
- పూరణ్‌కుమార్ ఆత్మహత్య దళితుల గౌరవానికి సంబంధించినదని వ్యాఖ్య
- కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రతిపక్షనేత



**చండీగఢ్ :** హర్యానా పోలీసు అధికారి వై. పూరణ్ కుమార్ ఆత్మహత్యకు బాధ్యులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పూరణ్ ఆత్మహత్యకు దళితుల గౌరవానికి సంబంధించినదని, బాధ్యులైన వారిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైని వెంటనే చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత వారం చండీగఢ్‌లోని తన ఇంట్లో తుపాకీ కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డ సీనియర్ పోలీసు అధికారి కుటుంబాన్ని మంగళవారం రాహుల్ గాంధీ పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పూరణ్ కుమార్‌ను తరువాయి 2లో


పూరణ్ కుమార్ కేసు దర్యాప్తు అధికారి ఆత్మహత్య 05



# ప్రపంచం
WORLD NEWS

## వ్యక్తికి జపాన్ కోర్టు ఉరిశిక్ష

**టోక్యో:** రెండేళ్ళక్రితం జపాన్‌లో కలకలం సృష్టించిన కాల్పులు, కత్తిపోట్ల కేసులో మసనోరి అయోకి (34) అనే వ్యక్తికి న్యాయస్థానం ఉరిశిక్ష విధించింది. జపాన్‌లో ఇలాంటి తీర్పులు అసాధారణం. నకోనాలో 2023లో ఒక వ్యక్తి ఇద్దరు పోలీసులను కాల్చి చంపాడు. మరో ఇద్దరిని కత్తితో పొడిచి చంపాడు. ఐతే సదరు వ్యక్తి స్కిజోఫ్రోనియాతో బాధపడుతున్నాడని అతడి తరపున న్యాయవాదులు కోర్టులో వాదించినప్పటికీ ఫలితం లేకపోయింది. చాలా పగడ్బందీగా నేరస్థుడు కాల్పులకు పాల్పడ్డాడని న్యాయస్థానం విశ్వసించింది. రోడ్డుమీద వెళుతున్న మహిళలను కత్తితో పొడవడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు.

కానీ అతగాడు తుపాకీతో ఇద్దరు పోలీసులను కూడా కాల్చి చంపాడు. జపాన్‌లో 30 ఏళ్ళక్రితం ఎప్పుడో ఇలాంటి ఘటన జరిగింది తప్ప ఆ దేశంలో గన్ కల్చర్ లేదు.



## బంగ్లాదేశ్‌లో 238కి పెరిగిన డెంగీ మృతులు

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో కొద్ది నెలలుగా విజృంభించిన డెంగీ వ్యాధి మరింతగా విస్తరిస్తోంది. తాజాగా గడచిన 24 గంటల్లో డెంగీ వల్ల మరో ఐదుగురు మరణించారు. 841 మంది కొత్తగా ఆసుపత్రులలో చేరారు. ఈ కొత్త మరణాలతో దేశంలో ఈ ఏడాది ఇప్పటివరకూ డెంగ్యూ వల్ల మరణించినవారి సంఖ్య 238కి పెరిగింది. మొత్తం కేసుల సంఖ్య 56,257 కు పెరిగింది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ కార్యాలయం మంగళవారం ఈ విషయం వెల్లడించింది. మరోవైపు డెంగీ బారిన పడి చికిత్స తీసుకున్న 53,354 మందిని ఆసుపత్రుల నుండి తిరిగి ఇళ్ళకు పంపినట్లు కూడా తెలియజేసింది. దేశవ్యాప్తంగా 2,665 మంది ఆసుపత్రుల్లో చేరి ఇంకా చికిత్సలు పొందుతున్నారు.

## పేలుడులో 9 మంది కార్మికులు మృతి

ఇదిలా ఉండగా, ఢాకా రూపానగర్ ఏరియాలో ఉన్న కెమికల్ గోదాములో మంగళవారం పెద్ద పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో తొమ్మిదిమంది కార్మికులు మరణించారు. 12 అగ్నిమాపక దళ బృందాలు మంటలను అదుపు చేసేందుకు కృషి చేస్తున్నాయి. షియాబెరీ ఫార్మస్యూటికల్ కంపెనీలో ఉదయం మంటలు చెలరేగాయని అగ్నిమాపకదళాధికారి తల్హిబిన్ జాసిమ్ చెప్పారు. ఆలస్యంగా తమకు సమాచారం అందిందని ఆయన అన్నారు.



# రఫా సరిహద్దు తెరిచేదే లేదు

- ఇజ్రాయెల్ మంకుపట్టు
- గాజాలో శాంతి నిలబడుతుందా?
- భయాలమధ్య శిథిలాల తొలగింపు ప్రారంభం

**గాజా:** ట్రంప్ కుదిర్చిన శాంతి ఒప్పందంలో భాగంగా రఫా క్రాసింగ్‌ను తెరిచేది లేదని ఇజ్రాయెల్ మంకుపట్టు పట్టింది. సహాయ బృందాలు, మానవతా సహాయం, ఆహార సరఫరా లారీల రాకపోకలకు వీలుగా రఫా క్రాసింగ్‌ను నిర్ణీత ప్రకారం బుధవారం తెరవాల్సి ఉంది. 28 మంది బందీల మృతదేహాలను హమా స్ స్వాధీనం చేయాల్సి ఉండగా, కేవలం నాలుగు మృతదేహాలను మాత్రమే స్వాధీనం చేయడంతో బాధిత కు టుంబాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీంతో ఇజ్రాయెల్ ప్రభుత్వం పైవిధంగా స్పందించింది. గాజాలోకి సహాయాన్ని పరిమితంగానే వదులుతామని ప్రకటించింది. గాజాలో తాజాగా నెలకున్న ఈ శాంతి స్థిరమైనదేనా? ఇది శాశ్వతమేనా? అని పాలస్తినా ప్రజలు ఇంకా భ యాందోళనల్లోనే ఉన్నారు. ఐతే లక్షలమంది ప్రజలు గా జా స్ట్రిప్‌కు తిరిగి చేరుకుంటున్నారు. రెండేళ్ళ యుద్ధం కారణంగా 20 లక్షలమంది జనాభాగల గాజాలో 90 శాతం మంది నిరాశ్రయులయ్యారు. లక్షల భవనాలు, ఇళ్ళు నేలమట్టమయ్యాయ. యూరోపియన్ యూనియ న్ స్పేస్ ఏజన్సీ ఈనెల రెండో తేదీన విడుదల చేసిన చి త్రాల ప్రకారం గాజాలో 1.99 లక్షల భవనాలు,ఇళ్ళు నేలమట్టమయ్యాయి. ఇంతభారీస్థాయిలో జరిగిన ఈ నష్టాన్నిబట్టి పునర్నిర్మాణానికి 50 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని నగర నిపుణుడు ఫిలిప్ బౌవెరాట్ చెప్పారు. ఐదురోజులక్రితం శాంతి ఒప్పందం ప్రకటన వెలువడిన



తర్వాత గాజాలో కేరింతలు, ఆనందోత్సాహా లు వెల్లివిరిసినప్పటికీ, ఇప్పుడు అస్థిరత, అధికార శూ న్యత ఆవరించుకుంది. ట్రంప్ ప్రకటించిన 20 అంశాల ప్రణాళిక ప్రకారం హమాస్ ఆయుధాలను వదిలిపెట్టా ల్సి ఉంది. పాలస్తినా అథారిటీకి అధికారాన్ని స్వాధీనం చేసేవరకూ తాత్కాలికంగా ''బోర్డ్ ఆఫ్ పీస్'ను ట్రంప్ ప్రకటించారు. ఈ బోర్డు తాత్కాలికంగా పర్యవేక్షణ మా త్రమే చేస్తుంది. ఇప్పటికే ఈ ఐదురోజుల్లో హమాస్ దళా లు స్థానికంగా ఉన్న శక్తిమంతమైన డాగ్మష్ తెగ కుటుంబాలపై కాల్పులదాడిచేసి 19 మందిని హతమార్చాయి. గాజాలో తిరిగి గిరిజన తెగలమధ్య ఘర్షణలు, ఆధిపత్యపోరు ప్రారంభం అవుతుందని భయపడుతున్నారు. 20 మంది బందీలు విడులయ్యారు. ఇజ్రాయెల్ జైళ్ళనుండి దాదాపు 2000 మంది ఖైదీలు విడుదలయ్యారు. 60 ఏళ్ళు పైబడిన వృద్ధులు 30 మంది, టీనేజర్లు ఆరుగురు, మహిళలు ఇద్దరు ఇజ్రాయెల్ జైళ్ళనుండి బయటపడిన వారిలో ఉన్నారు. 28 మంది బందీల మృతదేహాలను స్వాధీనం చేయాల్సి ఉండగా, కేవలం నాలుగు మృతదేహాలను మాత్రమే హమాస్ స్వాధీనం చేయడంతో బాధిత కుటుంబాల్లో ఆగ్రహం వ్యక్తమవుతుండగా యుద్ధ లక్ష్యాలను సాధించామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. కానీ సంక్లిష్టమైన ప్రశ్నలు ఇంకా మిగిలిపోయాయి. తదుపరి ఏం జరుగుతుంది? అనే అనిశ్చితి సర్వత్రా వ్యాప్తిచెందింది. తదుపరి ట్రంప్ సారథ్యంలో పరిపాలన జరుగుతుందన్నది ఒప్పందంలోని అంశం. కానీ హమాస్ ఆయుధాలు వదిలిపెడుతుందా? హమాస్ ప్రమేయం లేని గాజా పరిపాలన సాధ్యమేనా? అనే విషయాలు ఇంకా తేలలేదు. వీటిపై తదుపరి ఇంకా చర్చలు జరగాల్సి ఉందని ట్రంప్ స్వయంగా చెప్పారు. పాలస్తినానాను ఒక దేశంగా గుర్తించేదిలేదని మరోవైపు నెతన్యాహూ చెబుతున్నారు. ఆయుధాలను హమాస్ వదిలిపెట్టకపోతే మళ్ళీ దాడులు ప్రారంభిస్తామని కూడా ఆయన అన్నారు. ఇవన్నీ ప్రజల్లో ఇంకా భయాలు రేకెత్తిస్తున్నాయి. ఈ పరిస్థితులమధ్య తవ్వోడ యంత్రాలు గాజా సిటీలో శిథిలాలను తొలగించే ప్రక్రియ ప్రారంభించాయి. దాదాపు 80 శాతం నివాసాలు నేలమట్టం అయ్యాయని ఐక్యరాజ్యసమితి అంచనావేసింది. ధ్వంసమైన గాజాను పునర్నిర్మించుకోవడానికి గాజా పాలస్తీనియన్లకు అంతర్జాతీయ సహాయం అవసరం అని, లేకపోతే పునర్నిర్మాణం ఇప్పట్లో అసాధ్యమని నిపుణులు మరోవైపు చెబుతున్నారు.

# గాజా పునర్నిర్మాణం ప్రారంభం : ట్రంప్

### ట్రంప్‌కు ఈజిప్టు 'నైల్' పురస్కారం

**షర్మ్–ఎల్–షేక్:** గాజాలో పునర్నిర్మాణం ప్రా రంభం అవుతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. అబ్రహాం ఒప్పందాల కు అందరూ సమ్మతి తెలియజేయాలని, అంద రూ కలిసి రావాలని ప్రపంచదేశాలను కోరా రు. కానీ ఇరాన్ ఇప్పటికే ఇందుకు తిరస్కరించింది. ఇజ్రాయెల్ పార్లమెంటును ఉద్దేశించి సోమవారం సాయంత్రం ప్రసంగించిన తర్వాత ఆయన నేరుగా ఈజిప్టు వెళ్ళి 20 దేశాల నాయకులు పాల్గొన్న ''గాజా శాంతి ఒప్పంద శిఖరాగ్ర సదస్సు''కు హాజరయ్యారు. శాంతి ఒప్పందం పై నాయకులందరితో కలిసి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ, గాజాలో పునర్నిర్మాణం ప్రారంభం అవుతుందన్నారు. ఒక అందమైన, సరికొత్త ఉషోదయం ఈనాడు (సోమవారం) సంభవించింది, పశ్చిమ ఆసియాలో ప్రాంతీయ నాయకులు అందరూ ఎంతగానో సహకరించారు, అం దరికీ నా కృతజ్ఞతలు అని ట్రంప్ అన్నారు. ఇప్పుడు అందరూ చాలా సంతోషంగా ఉన్నారనీ, ఇది చాలా పెద్ద ఒప్పందమనీ, ఈ ఒప్పందం ఒక రాకెట్ వేగంతో శరవేగంగా ప్రయాణించి పరిణామాలను తీసుకువచ్చిందన్నారు. ఈ సదస్సుకు ట్రంప్‌తోపాటు ఈజిప్టు దేశాధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్–సిసి కూడా అధ్యక్షత వహించారు. పాలస్తినా అథారిటీ అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తోపా టు ఇరవై అరబ్, ముస్లిం దేశాల నాయకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అల్–సిసి ఈజిప్టులో అత్యున్నతమైన ''నైల్' పురస్కారాన్ని ట్రంప్‌కు ఇచ్చి ఘనంగా సత్కరించారు. అదే విధంగా స్వచ్ఛమైన మేలిమి బంగారంతో తయారు చేసిన ఒక నెక్లెస్‌ను కూడా ట్రంప్‌కు అలకరించి సత్కరించారు. ఇది ఈజిప్టులో ఇచ్చే అత్యున్నతమైన పురస్కారం. అత్యంత బాధాకరమై న, విషాదకరమైన అధ్యాయానికి అక్టోబరు 13వ తేదీన తెరపడిందని ఈ సందర్భంగా అల్–సిసి అన్నారు. ఇది చరిత్రలో ఒక మైలురాయి ఘట్టమన్నారు. ట్రంప్ రూపొందించిన 20 అంశాల ప్రణాళిక పశ్చిమాసియాలో శాంతి సాధనకు చివరి అవకాశమని కూడా ఆయన అన్నారు. పాలస్తినా–ఇజ్రాయెల్ రెం డూ ఇరుగు పొరుగు



దేశాలుగా సహజీవనం చేయడం ఒక్కటే శాశ్వత పరిష్కారమని ఆయన పునరుద్ఘాటించారు. ఇదిలా ఉండగా,బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్ కూడా పార్లమెంటులో మాట్లాడుతూ, గాజా శాంతిని కాపాడటం కష్టమైన విషయం కాదని, కానీ ఇదంతా చిన్న సవాలు కూడా కాదన్నారు. అనేక నెలలుగా ఈ సమస్య పరిష్కారం కోసం బ్రిటన్ ప్రభుత్వం తెరవెనుక కృషి చేస్తోందని, ఈ ఒప్పందం కుదిరినందుకు గర్వకారణంగా ఉందని స్టార్‌మర్ అన్నారు.

## వెంటనే చర్యలు
(మొదటి పేజీ తరువాయి)

నిరాశపరిచేందుకు, ఆయన కెరీర్‌ను దెబ్బతీసేందుకు క్రమబద్ధమైన వివక్ష చూపారని రాహుల్ గాంధీ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి డిజిపి శత్రుజీత్ కపూర్‌ను సెలవుపై పంపిన కొన్ని గంటల తర్వాత రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకు మందు ప్రభుత్వం రోహ్‌తక్ మాజీ పోలీసు సూపరింటెండెంట్ నరేంద్ర బిజర్నియాను బదిలీ చేసింది. పూరణ్ కుమార్ వదిలిపెట్టినట్లు చెప్పబడుతున్న సూసైడ్ నోట్‌లో పేర్కొన్న ఎనిమిది మంది సీనియర్ అధికారులలో ఈ ఇద్దరూ ఉన్నారు. ఈ ఇద్దరు అధికారులు స్పష్టమైన కుల ఆధారిత వివక్ష, లక్ష్యంగా చేసుకున్న మానసిక వేధింపులు, బహిరంగ అవమానం, దౌర్జన్యాలు చేశారని పూరణ్ కుమార్ ఆరోపించారు. కుమార్ భార్య, హర్యానా సీనియర్ అధికారి అమ్నీత్ పి కుమార్, ఆయన ఇద్దరు కుమార్తెలు, కుటుంబ సభ్యులను కలవడానికి ఉదయం చండీగఢ్‌కు చేరుకున్న రాహుల్ గాంధీ, అంత్యక్రియలు నిర్వహించాలని ఒత్తిడి చేశారు. 'ప్రధానమంత్రికి, హర్యానా ముఖ్యమంత్రికి ప్రతిపక్ష నాయకుడుగా నా సందేశం ఏమిటంటే... మీరు ఈ ఇద్దరు కుమార్తెలకు ఇచ్చిన హామీని నెరవేర్చండి, వారి తండ్రి అంత్యక్రియలు జరగనివ్వండి, ఈ 'తమాషా'ను ఆపండి' అని హితవు పలికారు. పూరుణ్ కుటుంబం ఇంకా ఆయన శవపరీక్షకు అనుమతించని విషయం తెలసిందే. నోట్‌లో పేర్కొన్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. పూరణ్ కేసుపై స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా విచారణ జరుపుతామని హామీనిచ్చారని, ఆ హామీని కూడా సైనీ నెరవేర్చలేదని కూడా ఆయన ఆరోపించారు. పూరుణ్ కుటుంబంతో దాదాపు గంటసేపు గడిపిన మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఈ సమస్య 10 రోజులు లేదా 15 రోజులకు సంబంధించినది కాదని స్పష్టం చేశారు. చాలా సంవత్సరాలుగా, ఈ అధికారిని నిరాశపరిచేందుకు, అతని కెరీర్‌ను, ప్రతిష్టను దెబ్బ తీసేందుకు క్రమబద్ధమైన వివక్ష జరుగుతోందన్నారు. ఇది ఒక కుటుంబానికి సంబంధించిన విషయం కాదని, ప్రతి దళిత సోదరుడు, సోదరి గౌరవానికి సంబంధించినదని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'దేశంలోని కోట్లాది మంది దళిత సోదరులు, సోదరీమణులకు తప్పుడు సందేశం వెళుతోంది... మీరు ఎంత విజయవంతమైనవారైనా, తెలివైనవారైనా లేదా సమర్థులైనా, మీరు దళితుడైతే, మిమ్మల్ని అణచివేయవచ్చు, నలిపివేయవచ్చు, విసిరివేయవచ్చు. ఇది మాకు ఆమోదయోగ్యం కాదు' అని గాంధీ అన్నారు. పూరణ్ కుమార్ కెరీర్‌ను అంతం చేయడానికి ప్రయత్నాలు జరిగాయని, తద్వారా అతను తన జీవితాన్ని ముగించాల్సి వచ్చిందని ఆయన అన్నారు. కుమార్ ఆత్మహత్య సమాజం, వ్యవస్థ మనస్సాక్షిని కదిలించే విషాదమని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'వై పూరణ్ కుమార్ జీ భార్య తన భర్త అంత్యక్రియలు గౌరవంగా నిర్వహించడానికి వారం రోజులుగా వేచి ఉండటం కంటే బాధాకరమైన విషయం ఏముంటుందని ప్రశ్నించారు. ఆమె, వారి పిల్లలు, వారి బాధను అనుభవించగల మొత్తం దళిత సమాజం మానసిక వేదనను అనుభవిస్తోందని, దాని గురించి ఆలోచించడం బాధాకరమన్నారు. ఢిల్లీ నుండి హర్యానా ప్రభుత్వాన్ని నడుపుతున్న నరేంద్ర మోదీ రాతి హృదయుడని, అతని పాలనలో ఈ క్రూరమైన అణచివేత జరుగుతున్నందున అతని హృదయం కరగదని మండిపడ్డారు. రోజులు గడుస్తున్నా, నిందితులను ఇప్పటికీ అరెస్టు లేదని, ఇది స్పష్టంగా అన్యాయమేనని రాహుల్‌గాంధీ అన్నారు.

## అజ్ఞాతానికి తెర
(మొదటి పేజీ తరువాయి)

మల్లోజుల లొంగిపోవడం దేశ వ్యాప్తంగా చర్చకు దారితీసింది. గత కొంత కాలంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఒక్కొక్కరిగా ప్రాణాలు కోల్పోతున్న మావోయిస్టు అగ్ర నాయకత్వం 2026 మార్చి చివరి నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామన్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ప్రకటనల నేపథ్యంలో ఇటీవల వేణుగోపాల్ అభయ్ పేరుతో సంచలనాత్మక లేఖలను విడుదల చేశారు. ఇటీవల కేంద్ర కార్యదర్శిగా పనిచేసి ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు సైతం మావోయిస్టు ఉద్యమం నడపడం కష్టమని ఆయుధాలు వదిలి లొంగిపోవాలని కోరుకున్నారని లేఖలో పేర్కొన్న మల్లోజుల మావోయిస్టు ఉద్యమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆయుధాలను వదిలి ఉద్యమ విరమణ చేయాలని బహిరంగ లేఖను విడుదల చేశారు. దీనికి ప్రతిగ మావోయిస్టు పార్టీ అది మల్లోజుల వేణుగోపాల్ వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని ఇందులో పార్టీ అభిప్రాయం లేదని జగన్ పేరిట పార్టీ ఒక లేఖను విడుదల చేసింది. ఈ పరిస్థితిలో మావోయిస్టు పార్టీలో మరోక చీలిక తప్పదా అన్న చర్చ కూడా సాగింది. అయితే మల్లోజుల దగ్గర ఉన్న ఆయుధాలను అప్పగించాలని లేదంటే దాడి చేసి తీసుకుంటామని కూడా పార్టీ పక్షాన ఆ లేఖలో హెచ్చరించారు. మల్లోజుల తన 60 మంది అనుచరులతో లొంగిపోగా అందులో కేంద్ర కమిటీ సభ్యుడు వాసుదేవరావు, 10 డివిజన్ల కార్యదర్శులు ఉన్నట్లు తెలుస్తుంది. మొత్తంగా మల్లోజుల వేణుగోపాల్ లొంగుబాటు సాయుధ ఉద్యమంలో మరో కీలక ఘట్టంగా చెబుతున్నారు. లొంగుబాటు తర్వాత పరిణామాలు ఏమిటి వేణుగోపాల్ బాటను ఎంత మంది అనుసరించనున్నారు. పోలీస్ చర్యలు తదితర విషయాలపై మావోయిస్టు ఉద్యమ భవితవ్యం ఆధారపడి ఉంది.

**భద్రాచలంలోనూ మావోయిస్టుల లొంగుబాటు**

పోలీస్ శాఖ నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూతలో భాగంగా మంగళవారం ఎస్పీ రోహిత్ రాజ్ ఎదుటు నిషేదిత మావోయిస్టు పార్టీకి చెందిన ఓ మహిళా సభ్యురాలితో పాటు ఆరుగులు మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన కుంజామ్ పాపారావు అలియాస్ దినేష్, లఖ్మం బండి అలియాస్ శాంతి, మడివి కోసా అలియాస్ భీమా, పద్దం లక్మ అలియాస్ గుడ్డి, మడివి లక్మ అలియాస్ భీమా, దొడ్డి భద్రు అలియాస్ నందు లు ఉన్నారు. వీరిలో ఒక్కక్కరికి తక్షణ సహాయం క్రింద రూ.25 వేలు చొప్పున మొత్తం రూ.1.50 లక్షల చెక్కులను అందజేశారు. వారి వారి క్యాడర్లను బట్టి వారి తలలపై ఉన్న రివార్డులను అందించనున్నారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ మావోయిస్టుల సిద్ధాంతాలపై నమ్మకం లేక అనేక మంది జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ హోదాల్లో ఉన్న 326 మంది అజ్ఞాతాన్ని వీడారని చెప్పారు. మిగతా వారు కూడా ప్రభుత్వం అందిస్తున్న చేయూతను అందుకుని జనజీవన స్రవంతిలో కలవాలని ఎస్పీ సూచించారు.

## నిషేధిత జాబితాలో కాళేశ్వరం ఇంజనీర్ల ఆస్తులు

### ముగ్గురి ఆస్తుల విలువ సుమారు రూ.400 కోట్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం లిఫ్ట్ ఇగిరేషన్ నిర్మాణంలో భాగస్వాములైన ప్రభుత్వ ఇంజినీర్లకు మరో బిగ్ షాక్ తగిలింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఇటీవలే ఎసిబి తనిఖీల్లో పట్టుబడిన మాజీ ఇఎన్‌సి హరిరాం, ఇఇ నూనె శ్రీధర్, మాజీ ఇఎన్‌సి మురళీధర్ ఆస్తులను విజిలెన్స్ వింగ్ నిషేధిత జాబితాలో చేర్చారు. ఈ ముగ్గురి ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ.400 కోట్ల పైచిలుకే ఉటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, ప్రస్తుతం వారు బెయ్పు ఉండటంతో కోర్టులో కేసు తేలే వరకు ఆస్తుల విషయంలో ఎలాంటి క్రయవిక్రయాలు జరపకుండా వారి ఆస్తులను విజిలెన్స్ వింగ్ నిషేధిత జాబితాలో చేర్చడం హాట్ టాపిక్గా మారింది. కాగా, ఈ ఏడాది కాళేశ్వరం కార్యనిర్వాహక ఇంజినీరు నూనె శ్రీధర్ ఇళ్లు, బంధువుల ఇళ్లపై ఎసిబి దాడులు నిర్వహించగా కళ్లు చెదిరే అక్రమాస్తులు స్వాధీనమైన విషయం తెలిసిందే. నీటి పారుదల శాఖలో ఏఈఈగా చేరిన నూనె శ్రీధర్ జూన్లో అరెస్టయ్యే నాటికి ఈఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఎక్కువ కాలం కాళేశ్వరం ప్రాజెక్టులోనే పని చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన ఎసిబి.. శ్రీధర్, ఆయన భార్య, కుమారుడు, కుమార్తె, బినామీల పేరు మీద మొత్తం రూ.110 కోట్లకుపైగా ఆస్తులను కూడబెట్టినట్లుగా గుర్తించారు. ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ఎత్తిపోతల పథకంతో పాటు రీడిజైనింగ్ అనంతరం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో చీఫ్ ఇంజినీరుగా కీలక పాత్ర పోషించిన భూక్యా హరిరాంను ఈ ఏడాది మేలో ఎసిబి అరెస్టు చేసింది. ఆ సమయంలో ఆయన గజ్వేల్ ఈఎన్సీగా, కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి నిధులు సమకూర్చిన కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్కు ఎండీగా ఉన్నారు. హరిరాం అరెస్టు అనంతరం నీటిపారుదల శాఖ ఆయనను సస్పెండ్ చేసింది. ఇక నీటి పారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా పనిచేసి రిటైర్ అయిన చీటి మురళీధర్‌పై ఈ ఏడాది జులైలో ఎసిబి దాడులు చేసిన విషయం తెలిసిందే. ఆదాయానికి మించి ఆస్తులను గుర్తించి అరెస్టు చేసింది. పట్టుబడిన ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్ ధర ప్రకారం రూ.100 కోట్లకుపైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

## సమాచారమివ్వండి
(మొదటి పేజీ తరువాయి)

రూపొందించాడు. ఇది అత్యంత మంచిదైన కొత్త పరికరం. అది నా అభిప్రాయం కాదు. సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ ఈ విషయాన్ని చెబుతోంది. అతను 15హార్డ్ డిస్కులు కొనుగోలు చేసినందున బ్యాకప్ ఉన్నది మా కేసు. కానీ అతడు తనవద్ద ఏమీలేదని చెబుతున్నాడు. ఈ కోర్టు తాత్కాలిక రక్షణ యొక్క రక్షణ గొడుగు వల్లే మాకు అతడు ఏమీ సహకరించడం లేదు' అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు చెప్పారు. టి.ప్రభాకర్‌రావు తరపున హాజరైన సీనియర్ న్యాయవాది డి.ఎస్.నాయుడు ఈ ఆరోపణలను అన్నింటినీ తీవ్రంగా ఖండించారు. ప్రభాకర్‌రావు దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నాడని తెలియజేశారు. ఈ విచారణ పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనదని ఆరోపిస్తూ బయటి వారు, రాజకీయనాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు' విచారణ సమయంలో ప్రశ్నించేందుకు వారికి అనుమతిస్తున్నారని కోర్టుకు విన్నవించారు. దీనిపై జస్టిస్ నాగరత్నమ్మ స్పందిస్తూ , అది 'తమాషా' కాకూడదు'. పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు లోపలకు వచ్చి ఎలా ఇంటరాగేట్ చేయగలరు?. వారు ఏమీ ప్రేక్షకులుగా లేదా దర్యాప్తులో భాగంగా ఉండలేరు' అని వ్యాఖ్యానించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రభాకర్‌రావు తరపు న్యాయవాది డి.ఎస్.నాయుడు ఆరోపణలను కొట్టిపారేశారు. వాదనలు విన్న ధర్మాసనం విచారణను నవంబర్ 18కు వాయిదా వేసింది. మే 29న అత్యున్నత న్యాయస్థానం బలవంతపు చర్య నుంచి రావుకు మధ్యంతర రక్షణ కల్పించింది. పాస్‌పోర్ట్ అందిన మూడు రోజుల్లో భారతదేశానికి తిరిగి వస్తానని హామీ ఇవ్వాలని ప్రభాకర్‌రావును ఆదేశించింది. ముందస్తు బెయిల్ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ప్రభాకర్‌రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైదరాబాద్ కోర్టు మే 22న ప్రభాకర్‌రావుపై ప్రకటన ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వు ప్రకారం ప్రభాకర్ రావు జూన్ 20లోపు ప్రభాకర్‌రావు కోర్టు ముందు హాజరుకాలేకపోతే ఆయనను 'ప్రకటిత నేరస్థుడిగా' ప్రకటించవచ్చు. ఒక వ్యక్తిని 'పకటిత నేరస్థుడిగా' ప్రకటించినట్లయితే ఆ నిందితుడి ఆస్తులను జప్తు చేయాలని కోర్టు ఆదేశించగలిగే అధికారాన్ని కలిగి ఉంటుంది. గత భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) పాలనలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. వివిధ ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల నుండి నిఘా సమాచారాన్ని సేకరించారనే ఆరోపణలపై మార్చి 2024 నుండి హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన నలుగురు పోలీస్ అధికారులలో ఒకరు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) నుండి సస్పెండ్ అయిన డిఎస్‌పి ఉన్నారు. తర్వాత వారికి బెయిల్ మంజూరు చేయబడింది. వివిధ రంగాలకు చెందిన వ్యక్తులను నిఘాలో ఉంచడం ద్వారా రాజకీయ ప్రయోజనాల కోసం స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) వనరులను దుర్వినియోగం చేసిన కుట్రలో ఈ నిందితులు భాగస్వాములని పోలీసులు తెలిపారు. ఈ కేసులో నిందితులుగా పేర్కొనబడిన వారు ఇతరులతో పాటు అనధికారికంగా నిందితులుగా ఉన్న అనేకమంది వ్యక్తుల ప్రొఫైల్‌లను అభివృద్ధి చేశారని, ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించడానికి వారి ఆదేశాల మేరకు ఎస్ఐబిలో రహస్యంగా, చట్టవిరుద్ధంగా వారిని పర్యవేక్షించారని గతంలో పోలీసులు తెలిపారు. వారినేరాలకు సంబంధించిన ఆధారాలు అదృశ్యం కావడానికి రికార్డులను నాశనం చేయడానికి కుట్ర పన్నారని కూడా పోలీసులు వెల్లడించిన విషయం తెలిసిందే.

## జాతీయీకరణ చేయాలి
(మొదటి పేజీ తరువాయి)

స్వాతంత్ర్యం అనంతరం నాటి పాలకులు బ్యాంకులను జాతీయకరణ చేయగా, నేటి పాలకులు జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరిస్తూ వారి బినామీలైన కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయల ప్రజా సంపదను దోచి పెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్ యూనియన్స్ సెల్ (ఎఐబిఈఎ) ఇచ్చిన పిలుపు మేరకు ప్రైవేటు బ్యాంకుల ఉద్యోగులు హైదరాబాద్ గన్‌ఫౌండ్రీ, చిరాగ్ అలీలేన్ లోని కరూర్ వైశ్యా బ్యాంక్ డివిజినల్ కార్యాలయం వద్ద బ్యాం కుల ఉద్యోగులు సామూహిక ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగుల ప్రదర్శనను ఉద్దేశించి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ధ్వంసం చేస్తున్నదని విమర్శించారు. మరోవైపు బ్యాంకులను ప్రైవేటీకరిస్తూ కొంత మంది కార్పొరేట్ శక్తులు, వ్యక్తుల చేతులకు అప్పగిస్తూ వేల కోట్ల రూపాయలను కొల్లగొడుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ప్రైవేటు బ్యాంకులను జాతీయం చేయాలని, ఆ బ్యాంకులలో అవసరమైన మేరకు రెగ్యులర్ క్లరికల్, సబ్ స్టాఫ్ కేడర్‌ను నియమించాలని రాంబాబు డిమాండ్ చేశారు. ఫెడరల్ బ్యాంకు లో ఉద్యోగులపై వేధింపులను ఆపాలని, సిఎస్‌బి బ్యాంక్‌లో సాధ్యమైనంత తొందరగా వేతన సవరణ చేయాలని, అన్ని ప్రైవేటు బ్యాంకులలోని పెన్షనర్లకు ఎక్స్‌గ్రేషియా వర్తింపజేయాలని, నైనిటాల్ బ్యాంక్ విక్రయాన్ని వెంటనే నిలుపుదల చేసి దానిని బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ)ను కోరారు. ప్రైవేటు బ్యాంకులలో పనిచేస్తున్న సిటు సి ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా క్రమబబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో ఎపి, టిఎస్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు టి.రవీంద్రనాథ్, ఉప ప్రధాన కార్యదర్శి సమద్ ఖాన్, కార్యదర్శులు శైలేంద్ర, వినోద్, నల్లపు రెడ్డి, ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్స్ యూనియన్ సెల్ ప్రధాన కార్యదర్శి మధుసుదన్, కరూర్ వైశ్యా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాయి శంకర్, ఫెడరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కర్ణాటక బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతంగా ప్రచారం
(మొదటి పేజీ తరువాయి)

పోరాటాన్ని నిర్వహించింది కూడా కమ్యూనిస్టులేనని సాంబశివరావు తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రజల హక్కుల కోసం, సంక్షేమం కోసం బహుముఖ పోరాటాలు నిర్వహించి పోరాట విజయాలను సాధించిందని, భూమి విలువలు గుర్తించిదున్నే వానికి భూమి దక్కాలని చారిత్రక పోరాటాలు నిర్వహించిందన్నారు. 100 పోరాట చరిత్రను, త్యాగాలను నేటి తరానికి తెలియజేసేందుకు శత వసంత సంబరాల ముగింపు వేడుకలను ఖమ్మంలో అత్యంత ఘనంగా నిర్వహించాలని సిపిఐ నిర్ణయించిందన్నారు. లక్షలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని ఈ సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరు కానున్నారని సాంబశివరావు తెలిపారు. బహిరంగ సభ, ప్రదర్శనకు సంబంధించి గ్రామ గ్రామాన ఇంటింటికి ప్రచారం నిర్వహించాలని ఆయన కోరారు. బహిరంగ సభను పురస్కరించుకుని సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించడంతో పాటు ప్రత్యేక కళారూపాలను రూపొందించాలని ఆయన కోరారు. పార్టీ వందేళ్ల చరిత్ర సమకాలీన రాజకీయాలు, ఆర్థిక సామాజిక పరిస్థితులను వివరిస్తూ ప్రచారం నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లపై కొన్ని రాజకీయ పార్టీలు దొంగాట ఆడుతున్నాయని సాంబశివరావు ఆరోపించారు. మద్దతు ప్రకటిస్తూనే మరో పక్క రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తెలిపారు. బిసి రిజర్వేషన్ల అమలుకు సిపిఐ కట్టుబడి ఉన్నదని బిసిలకు 42 శాతం అమలు కోసం జరిగే పోరాటాలకు సిపిఐ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని ఆయన తెలిపారు. బిజెపి బిసి వ్యతిరేకిగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. 18 మాసాలుగా ఉద్యోగ విరమణ చేసిన వారికి రావాల్సిన ఆర్థిక మొత్తాలను ప్రభుత్వం అందించడం లేదని తక్షణం అందించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెన్షనర్లు చేపట్టే ఆందోళనకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 18న నియామక పత్రాలు
(మొదటి పేజీ తరువాయి)

ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, రిజ్వి, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టికె.శ్రీదేవి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌ల తనిఖీ



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : జిల్లాలోని 108 అంబులెన్సులను మంగళవారం నల్లగొండలో జీవీకే,ఈఎంఆర్ఐ అధికారులు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అంబులెన్స్‌లో ఉన్నటువంటి అన్ని రకాల పరికరాల పనితీరును మందులను పరిశీలించి అన్ని రకాల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఈఎంఆర్ఐ అధికారులు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అన్ని రకాల మందులను పర్యవేక్షించుకుంటూ అన్ని రకాల పరికరాలను నిత్యం పని చేసే విధంగా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట నల్లగొండ 108 జిల్లా ప్రోగ్రాం మేనేజర్ మధు, 108 సిబ్బంది ఉన్నారు.

## పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆరోగ్య కేంద్రంలో రిజిష్టర్‌ను పరిశీలించి వైద్యులు సమయ పాలన పాటించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలోని వాటర్ సంప్ రిపేర్ గురించి తెలుసుకొని సంబంధిత అధికారులకు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. విధులలో ఉన్న ఫిల్డ్ స్టాఫ్ గురించి అడిగి తెలుసుకొని ఫీల్డ్ స్టాఫ్ గ్రామాల్లో సమయపాలన పాటిస్తూ యూనిఫాంలో ఉండాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మసాన్‌పల్లి గ్రామంలోని ఉప కేంద్రంలో ఏఎన్ఎం లేనందున డిఎంహెచ్‌వోతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డా. ప్రవీణ్‌కుమార్, ఎంపిడివో చండీ రాణి, ఎంపివో సలీం, సిహెచ్‌వో వెంకటేశం ఉన్నారు.

## నకిలీ విత్తనాలు... వరిసాగు రైతుల్లో కలవరం



ప్రజాపక్షం/కోదాడ రూరల్ : నకిలీ విత్తనాలతో వరిసాగు చేసిన రైతుల్లో కలవరం మొదలైంది. మండలంలోని కూచిపూడి గ్రామంలో రైతులు సాగు చేసిన సన్నరకం వరి విత్తనాలను కోదాడ పట్టణంలోని పలు దుకాణాల్లో కొనుగోలు చేసి సాగు చేశారు. దాదాపు 150 మంది రైతులు 300 ఎకరాలలో వరిసాగు చేయగా పొట్టదశకు రావడంతో ముందుగా ఈనడంతో అవన్నీ దొడ్డురకంగా రైతులు గుర్తించారు. ఇదే విషయాన్ని వారు విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ల దుకాణాల వద్దకు వెళ్ళి మోసం చేయడంపై వారిని నిలదీశారు. దీంతో ఆయా కంపెనీల డీలర్లు పంటలను పరిశీలించేందుకు గ్రామానికి వచ్చారు. దీనిపై వారు ఏ విషయం సమాధానం చెప్పకపోవడంతో రైతులు వారితో వాగ్వివాదానికి దిగారు. నకిలీ విత్తనాలను అంటగట్టి తమను మోసం చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎకరాకు 5 బస్తాల వరకు బెరుకులు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

**నకిలీలు కాదు బెరుకులు : వ్యవసాయాధికారిణిని రజిని**

ఇదే విషయమై మండల వ్యవసాయాధికారిణి రజినిని వివరణ కోరగా సన్న రకంలో నకిలీ లేవని కేవలం బెరుకులు మాత్రమేనని చెప్పారు. కూచిపూడి గ్రామంలో నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోయే పరిస్థితి వచ్చిందని తెలిసిన వెంటనే ఆమె అక్కడికి వెళ్ళి పరిశీలించారు. 74 ఎకరాల వరి పంట కొంత మేరకు నష్టం వాటిళ్ళవచ్చని శాస్త్రవేత్తలను తీసుకొని అవగాహన కల్పిస్తామంటే రైతులు ఒప్పుకునే అవకాశం లేదన్నారు. నష్టపోయిన రైతులకు తగు న్యాయం చేస్తామని చెప్పారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



ప్రజాపక్షం/చిట్యాల: రాష్ట్రంలోని రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం చిన్నకాపర్తి, ఆరెగూడెం గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల అభివృద్ధి చెందడానికి అనేక రకాలైన ఆలోచనలతో ముందుకెలుతున్నారని అన్నారు. రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ పక్షాన నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కళ్ళాలలో అధికారులతో కలిసి పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఈ సందర్భంగా వీరేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో జయలక్ష్మి, వెలిమినేడు పిఎసిఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, నాయకులు కందిమళ్ళ శిశుపాల్‌రెడ్డి, గుడిపాటి లక్ష్మినర్సింహ్మా, పిశాటి భీష్మారెడ్డి, బొంతల అంజిరెడ్డి, జనగాం రవిందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు చురుకుదనాన్ని పెంపొందిస్తాయి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : క్రీడలు నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో చురుకుదనంతో పాటు శారీరక ఆరోగ్యం తద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ అన్నారు.మంగళవారం నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఏర్పాటుచేసిన ఎస్ జి ఎఫ్ క్రీడ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోవడము సహజమన్నారు.ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి దగ్గుబాటి విమల మాట్లాడుతూ అండర్ 14, 17 విభాగాలలో ఖో ఖో టోర్నమెంట్ కం సెలక్షన్ జరుగుతుందని దీంట్లో సెలెక్ట్ కాబడినటువంటి విద్యార్థులు ఉమ్మడి జిల్లా స్థాయిలో ఆడవలసి ఉంటుందని అక్కడినుండి రాష్ట్ర జాతీయస్థాయిలో ప్రతి ఒక్కరూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్లు శోభారాణి, జయ రాజు, రాజశేఖర్ రెడ్డి, జంగయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు జ్యోతి, శ్రీదేవి యుగంధర్ రెడ్డి కవిత,రాజశేఖర్ రెడ్డి, ఆశ్రఫ్ గఫార్ మురళి పాల్గొన్నారు.

## ఏకకాలంలో 23 ప్రాంతాల్లో పోలీస్ నాఖాబంది : ఎస్‌పి

ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ : ఏకకాలంలో జిల్లా వ్యాప్తంగా 23 ప్రాంతాల్లో పోలీస్ నాఖాబంది నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. మంగళవారం మండలంలోని గ్రామ సమీపంలోని ఖమ్మం జాతీయ రహదారిపై పోలీసులు నిర్వహిస్తున్న నాఖాబంది కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన భద్రత, రక్షణ కల్పించడమే లక్ష్యంగా ఎఫిక్టీవ్ పోలీస్, విజువల్ పోలీసింగ్ ఉద్దేశ్యంలో భాగంగా సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు జిల్లాలోని అన్ని మార్గాలు, సరిహద్దులను అష్టదిగ్భందనం చేసి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ నాఖాబంధి ద్వారా అక్రమ రవాణా, అనుమానితుల, రౌడీషీటర్స్ కదలికలు, గంజాయి, పశు, నిషేద్ధిత పదార్థాల అక్రమ రవాణా, అంతర్‌రాష్ట్ర, జిల్లా నేరస్తుల కదలికలను గుర్తించి నేరాలను అదుపు చేయడం జరుగుతుందని వివరించారు. జిల్లా అంతర్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన రామాపురం ఎక్స్ రోడ్డు, దొండపాడు, పులిచింతల ప్రాజెక్ట్, అంతర్ జిల్లా సరిహద్దు ప్రాంతాలైన తిరుమలగిరి, వెలిశాల, మద్దిరాల, నూతనకల్, బిక్కుమళ్ళ, జిల్లెపల్లి, జాన్‌పహాడ్, మట్టపల్లి బ్రిడ్జిలలో ఇలా అన్ని ప్రాంతాలలో ఒకే కాలంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పెన్‌పహాడ్, సూర్యాపేట రూరల్ ఎస్ఐలు శ్రీకాంత్, బాలు నాయక్, ఆర్ఐ అశోక్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రతి విద్యార్థికీ 70శాతంపైగా మార్కులు

మార్కులు సాధించేలా సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ అధికారులకు ఆదేశం




ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ప్రభుత్వ రెసిడెన్సియల్, కెజిబివి పాఠశాల, కళాశాలల్లో చదివే ప్రతి విద్యార్థి 70 శాతానికి పైగా ప్రతి సబ్జెక్ట్‌లో మార్కులు సాధించేలా సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ విసి హాల్‌లో సంక్షేమ అధికారులు, విద్యాశాఖ, కెజిబివి ప్రత్యేక అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రెసిడెన్షియల్, కెజిబివి పాఠశాల, కళాశాలలకు ఇక నుండి ఆకస్మిక తనిఖీ చేపట్టినప్పుడు ఎవరైనా విధుల్లో లేకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సిబ్బంది సమయపాలన పాటించాలని, సిబ్బంది హాజరు వివరాలు, విద్యార్థుల హాజరు వివరాలు ప్రతిరోజు నివేదిక ఇవ్వాలని సూచించారు. అధికారులు పాఠశాలలకు వచ్చే గుడ్లు, పాలు, చికెన్, వంట సామాగ్రి సమయానికి చేరిందా లేదా తెలుసుకోవాలన్నారు. అలాగే కాంట్రాక్టర్ నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి ఆర్‌బిఎస్‌కె వైద్యులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ కార్డు తయారు చేసేలా చూడాలని స్పష్టం చేశారు. కెజిబివిలలో ఎక్కడైనా అవసరం ఉంటే త్రాగునీరు, టాయిలెట్స్, ట్యాప్స్, సీలింగ్ ఫ్యాన్స్, లైట్స్ లాంటి వాటికి మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకి మెరుగైన సౌకర్యాలు కల్పించి, ఆరోగ్యం బాగుండేలా చూసి, నాణ్యమైన భోజనం అందించి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌టి, ఎస్‌సి, బిసి, మైనార్టీ సంక్షేమ అధికారులు శంకర్, దయానందరాణి, నరసింహారావు, శ్రీనివాస్ నాయక్, డిఈఓ అశోక్, జిసిడిఓ పూలన్, టిజిఈ డబ్ల్యుఐ సిడిఈ రమేష్, డిసిఓలు, కెజిబివి ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

**బెస్ట్ అవైలబుల్ విద్యార్థుల సంక్షేమంపై నిరంతరం పర్యవేక్షించాలి**

బెస్ట్ అవైలబుల్ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, వృద్ధులు వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత సంక్షేమ శాఖల అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న విద్య, భోజనం, వారి సంక్షేమం పట్ల సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని చెప్పారు. అంతకుముందు రాష్ట్ర మంత్రులు బెస్ట్ అవైలబుల్ పాఠశాలలపై జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేస్తూ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు

ధాన్యం కొనుగోలులో మిల్లర్లు సహకారం అందించాలి

నల్లగొండజిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వానాకాలం ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో మిల్లర్లు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.మంగళవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 2025/26 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పై సంబంధిత శాఖల అధికారులు, జిల్లా రైస్ మిల్లర్ల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ వానాకలం ధాన్యం కొనుగోలులో రైతులు నాణ్యతా ప్రమాణాలతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మిల్లులకు పంపించే విధంగా జిల్లా యంత్రాంగం తరపున అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాణ్యత ప్రమాణాల విషయంలో వ్యవసాయ విస్తరణ అధికారులు అన్ని మండలాలలో అందుబాటులో ఉండి రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తే తక్షణమే మిల్లులకు పంపించే విధంగా చూడాలని, మిల్లర్లు తక్షణమే మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని కోరారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో ట్రాన్స్పోర్టర్లు ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హమాలీల సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. వానాకాలం ధాన్యం కొనుగోలు లో భాగంగా రైస్ మిల్లర్లు 5 రోజుల్లో బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలని కోరారు. మిల్లర్లకు సంబంధించిన సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధాన్యం మద్దతు ధరపై రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. జిల్లా రైస్ మిల్లర్ల సంఘం తరపున ప్రజల ఆరోగ్య సంక్షేమానికై ఎక్స్ రే యంత్రాన్ని అందించడం పట్ల జిల్లా కలెక్టర్ రైస్ మిల్లర్లను అభినందించారు.ఈసమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,రైస్ జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, మార్కెటింగ్ ఏడి ఛాయాదేవి, మిల్లర్ల అధ్యక్ష, కార్యదర్శులు,ప్రతినిధులు శ్రీనివాస్, నారాయణ, భద్రాద్రి, యాదగిరి,తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# బౌద్ధం మతం కాదు...జీవన విధానాన్ని తెలిపే ధర్మమార్గం



పుణె యూనివర్సిటీ ప్రొఫసర్ డాక్టర్ మహేష్

ప్రజాపక్షం/నందికొండ: బౌద్ధం ఒక మతం కాదని అది జీవన విధానం తెలిపే ఒక దర్మ మార్గమని పుణె యూనివర్సిటీ ప్రొఫసర్ డాక్టర్ మహేష్ దియోకర్ అన్నారు.మంగళవారం నాగార్జునసాగర్ లోని బుద్ధ వనములో దమ్మ విజయ వేడుకలను బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట బుద్ధ వనములోని బుద్ధ పాదాల వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొఫసర్ మహేష్ దియోకర్ మాట్లాడుతూ బుద్ధుని దమ్మచక్ర ప్రవర్తన సారాంశాన్ని విస్తరిస్తూ అశోకుడు బౌద్ధాన్ని స్వీకరించిన రోజుని దమ్మ విజయముగా చెప్పబడుతుందన్నారు. ఇదే రోజున డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ బుద్ధుని బోధనలకు అమితంగా ఆకర్షకులై బౌద్ధాన్ని స్వీకరించారు అన్నారు. బుద్ధ వనంలో బుద్ధుని బోధనలు తెలియజేసేలా ఒక విద్యా కేంద్రం ఏర్పాటు చేయాలని బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య కు సూచించారు.అనంతరం మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ బుద్ధవనం తెలంగాణకు ల్యాండ్ మార్కుగా నిలుస్తుంది అనడంలో అతిశయోక్తి లేదన్నారు. బుద్ధిష్ట స్టడీస్ లో సర్టిఫికేషన్ విద్యను అందించే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం హైదరాబాద్ రెడ్డి మహిళా కళాశాల కార్యదర్శి ముత్యం రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో బుద్ధ వనంలో బౌద్ధ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.అనంతరం బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ బుద్ధ ధమ్మం తెలంగాణలో ఎలా ప్రవేశించింది వివరించారు. బుద్ధవనాన్ని మరింతగా అభివృద్ధి పరిచేందుకు కృషి జరుగుతుందని ఇప్పటికే డిజిటల్ మ్యూజియాన్ని ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి లత, బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, నల్గొండ జిల్లా టూరిజం అధికారి శివాజీ, బుద్ధవనం ఆర్ట్స్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు, బౌద్ధ అభిమానులు, బీసీ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బాలాజీ నాయక్ బాధితులకు న్యాయం చేస్తాం : ఎస్‌పి



ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి: అధిక వడ్డీ పేరుతో బాలాజీ నాయక్ చేతిలో మోసపోయిన బాదితుల కొరకు అడిషనల్ ఎస్‌పి ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాలాజీ నాయక్ పైన,అతని బినామీల పైన ఉన్న ఆస్తులను కోర్ట్ ద్వారా జప్తు చేసి బాధితులను న్యాయం జరిగే విధంగా కృషి చేస్తాం అని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలో గుడిపల్లి పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్‌పి ఆకస్మిత తనిఖీ చేసి స్టేషన్ లో సిబ్బంది పని తీరు,పోలీసు స్టేషన్ పరిధిలోని భౌగోళిక పరిసరాలు, స్థితిగతులు, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు, స్టేషన్ క్రైమ్ రికార్డ్,జనరల్ రికార్డ్స్‌లు తనిఖీ చేసి మాట్లాడుతూ కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని అన్నారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చే బాధిత ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుం డా వారి పట్ల తక్షణమే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలాజీ నాయక్ పైన పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్ పంపడం జరిగిందన్నారు. మోసపోయిన బాదితుల కొరకు సిఐ ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని బాధితులు ఎవరైన ఉంటే తమ యొక్క ఫిర్యాదులు నేరుగా పోలీస్ స్టేషన్ కి వచ్చి పిర్యాదు చేస్తే పూర్తి విచారణ చేపట్టి కోర్టులో నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఏఎస్‌పి మౌనిక ఐపీఎస్, అడిషనల్ ఎస్‌పిరమేష్, కొండమల్లపల్లి సిఐ నవీన్ కుమార్,గుడిపల్లి ఎస్ఐ నరసింహులు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# ఎన్‌జి కళాశాల గ్రౌండ్‌కు ఒక మంచి గుర్తింపు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: పట్టణంలోని ఎన్‌జి కళాశాల మైదానంలో సింథటిక్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ప్రయత్నిస్తామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.మంగళవారం ఆమె ఎన్‌జి కళాశాల మైదానంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు విషయమై ఉదయపు నడక ద్వారా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఎన్‌జి కళాశాల మైదానం కు ఒక మంచి గుర్తింపు అని అన్నారు. ఎన్ జి కళాశాల మైదానంలో మంచి క్రీడా సౌకర్యాలను కల్పించే విషయంలో మున్సిపల్ లేదా జిల్లా యంత్రాంగం నిధులతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా సింథటిక్ వాకింగ్ ట్రాక్, హైమాస్ లైట్లు , ప్రస్తుతం ఉన్న ఓపెన్ జిమ్ కు మరమ్మతులు, అదనంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు వంటి అత్యవసర సౌకర్యాలన్నిటిని కల్పించే విషయంపై దృష్టి సారిస్తామని ,ఇందుకుగాను సంబంధిత అధికారులు అంచనాలు రూపొందించి సమర్పిస్తే త్వరితగతిన వాటిని చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ఎన్ జి కళాశాల మైదానం స్థలాన్ని ఎవరు ఆక్రమించుకోకుండా కాపాడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ,వాకర్స్ అసోసియేషన్ నుండి బండారు ప్రకాష్, రేపాల మదన్మోహన్, డాక్టర్ పుల్లారావు , ఎంవి గోన రెడ్డి ,శౌరయ్య, కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్, లింగయ్య, మాజీ కౌన్సిలర్ మిర్యాల యాదగిరి, రాచకొండ గిరి, వెంకన్న, యాస వెంకట్ రెడ్డి ,సరళ తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు జిల్లా కలెక్టర్ ను శాలువా, మొమెంటులతో సత్కరించారు.




## రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలి

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

ప్రజాపక్షం/బీబీనగర్ : భూభారతి రెవిన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను, క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం బీబీనగర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖి నిర్వహించారు. జనన, మరణాల, ధృవీకరణ పత్రాలు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలని అన్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వేగంగా క్లియర్ చేయాలి అన్నారు. సాదాబైనామ పరిష్కరానికి నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూముల విషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించలన్నారు. మండలంలో సర్వే కోసం దరఖాస్తులు ఎక్కువగా ఉండటం, సర్వే చేయడానికి, ఎక్కువ సమయం తీసుకోవడం, సర్వే చేసిన వాటిలో ఎక్కువ రిజెక్ట్ చేయడం వంటివి తన దృష్టికి రావడంతో మెమో జారీ చేయమని అధికారులు ఆదేశించిన జిల్లా కలెక్టర్ మాట్లాడారు. అనంతరం పోషన్ అభియాన్‌లో భాగంగా బీబీనగర్ మండల ఎంపీడీఓ కార్యాలయంలో పోషణమాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరంఏం ఎల్‌ఎచ్‌పికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. బీబీనగర్ మండలం గూడూరు పల్లె దవాఖానని ఆకస్మిక తనిఖీ చేయడంతో తాళం వేసి ఉండటంతో ఎంఎల్‌ఎచ్‌పికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

## టెక్స్‌టైల్ పార్కు సందర్శించిన అధికారులు



ప్రజాపక్షం/చౌటుప్పల్ : మండలంలోని దండు మల్కాపురంలోని టెక్స్ టైల్ పార్కును చేనేత జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్వి రావు మంగళవారం సందర్శించారు. ఈ పార్కులో ఉత్పత్తి చేసిన వస్తువులను అమ్మకానికి ఏర్పాటుచేసిన ప్రదర్శనశాలను ఆయన పరిశీలించారు. ప్రఖ్యాత చిత్రకారిణి రిజిమ కళాఖండాలను తిలకించి ప్రశంసించారు. కళాకారుడు శ్రవణ్ వెదురుతో తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలించారు. ప్రాచీన బాతిక్, బ్లాక్, స్కీన్, టై అండ్ డై పద్ధతులను నవీకరించి ప్రముఖ అష్ట కళాకారుడు కే. కృష్ణ మూర్తి తయారుచేసిన వస్త్రాలను పరిశీలించి అభినందించారు. ఈ పార్కులోని మరమగాలపై దేవాలయాలకు సరఫరా చేయడానికి కండువాలను tgsco ద్వారా తయారు చేయిస్తున్నట్టు తెలిపారు. మరమగాలపై నేస్తున్న కండువాలను పరిశీలించారు. టెక్టైల్ పార్కులో సౌకర్యాలు కల్పించాలని, నిర్వహణ బాధ్యతలను టీజీ ఐఐసికి అప్పగించాలని ఐలా సర్వీస్ కమిటీ అధ్యక్షుడు ఎంకెడి ప్రసాద్ వినతి పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, ఐఐహెచ్‌టి సహాయ ప్రిన్సిపల్ కుమార్, సలహాదారు కోప్రసాచారి, చేనేత జౌళి శాఖ ఏడి శ్రీనివాసరావు, అభివృద్ధి అధికారి బాల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వారం రోజులుగా నీళ్ల కష్టాలు

ప్రజాపక్షం/నందికొండ: మున్సిపాలిటీ పైలాన్ కాలనీ లోని వార్డులలో గత ఏడు రోజులుగా నీటి మోటార్లు చెడిపోవడంతో కాలనిలో నీటి సరఫరాలేక కాలనీవాసులు విలవిలలాడుతున్నారు. దీనితో సహనం నశించిన కాలనీవాసులు బిందెలు, నీళ్ల డ్రమ్ములు, బకెట్లతో రోడ్డెక్కి రాస్తారోకోకు దిగారు. వీరికి మద్దతుగా మాజీ కౌన్సిలర్ హీరే కార్ రమేష్ జి నిలవడంతో రాస్తారోకో వేడెక్కింది. గత వారం రోజులుగా మంచినీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే పట్టించుకునే నాధుడు లేడని ఈ విషయంలో ఎన్ఎస్పి అధికారులు చేస్తున్న నిర్లక్ష్యం దారుణమని రమేష్ జి అన్నారు. మోటార్లు చెడిపోతే రిపేరు చేయించి నీటి సరఫరా అందించాలన్ని కనీస బాధ్యత ఎన్ఎస్పి అధికారులు మరిచారని తక్షణమే ఎన్ఎస్పి అధికారులు మోటార్లను రిపేరు చేయించి కాలనీలో నీటి సరఫరా చేయాలని ఈ విషయంలో అలసత్వం వహించిన అధికారులపై కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సభావత్ చంద్రమౌళి,కొండలు, సైదులు, మన్సూర్, కోట్ల సైదులు, యూసుఫ్, అంజయ్య, రాములు, వెంకటేశ్వర్లు ఏడుకొండలు, లక్ష్మణ్, సిద్దయ్య, తిమ్మలు వెంకటేశ్వర్లు, రషీద్, కృష్ణ, సైదాబీ, వీణబాయ్ అరుణ, సులోచన, పద్మ, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఢిల్లీలో మళ్లీ ఆంక్షలు



**న్యూఢిల్లీ :** శీతాకాలం సమీపిస్తున్న వేళ దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మళ్లీ పడగ విప్పుతోంది. స్థానికంగా వాయు నాణ్యత సూచీ దిగజారడంతో సెంట్రల్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ఈ సీజన్‌లో తొలిసారి ఆంక్షలు విధించింది. ఢిల్లీ ఎన్‌సిఆర్ పరిధిలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్1 నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది. ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ మంగళవారం 211గా నమోదైంది. ఇది పూర్ కేటగిరిలోకి వస్తుంది. కొన్ని రోజులు కాలుష్యం ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందనే వాతావరణ విభాగం, ఇతర సంస్థల అంచనాల మేరకు అధికారులు ఈ చర్యలు చేపట్టారు. వాయు నాణ్యత మరింత క్షీణించకుండా నిరోధించేందుకు జిఆర్ ఎపి1 నిబంధనలను వెంటనే అమలు చేయాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

# ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

### రాజకీయ పార్టీలకు ఇసి ఆదేశం



**న్యూఢిల్లీ:** నవంబర్‌లో బిహార్‌లో శాసన సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ (ఇసి) రాజకీయ పార్టీలకు కీలక సూచనలు చేసింది. రాజకీయ ప్రచార ప్రకటనలకు పార్టీలు తప్పనిసరిగా ముందుస్తు అనుమతులు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు రాజకీయ పార్టీలకు, పోటీ చేసే అభ్యర్థులకు ఇసి మార్గదర్శకాలు జారీ చేసింది. అభ్యర్థులు సోషల్ మీడియాతో సహా ఎలక్ట్రానిక్ లేదా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో అభ్యర్థులు ఏదైనా ప్రకటనలను ప్రచురించడానికి లేదా ప్రసారం చేయడానికి ముందు మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) నుంచి ముందస్తు ధ్రువీకరణ పొందడం తప్పనిసరి అని పేర్కొంది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు!**

ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో, అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేసేటప్పుడు వారి అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను అందించాలని ఆదేశించింది. రాజకీయ ప్రకటనల కోసం ముందస్తు ధ్రువీకరణ ప్రక్రియను పర్యవేక్షించడానికి జిల్లా, రాష్ట్రస్థాయిలో పలుమీడియా సర్టిఫికేషన్, ఎంసిఎంసిలను ఏర్పాటు చేసినట్లు ఇసి పేర్కొంది. రాజకీయ ప్రచారాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడం కోసం ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. నిబంధనలను ఉల్లఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం, అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన 75 రోజుల్లోపు ప్రచార ఖర్చుల పూర్తి వివరాలను రాజకీయ పార్టీలు సమర్పించాలని సూచించింది. ఖర్చుల నివేదికలో ప్రకటనల కోసం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు చేసిన అన్ని చెల్లింపులు, అలాగే కంటెంట్ రూపొందించడం, ప్రచారం, సోషల్ మీడియా ఖాతాల నిర్వహణ కోసం అయ్యే ఖర్చులు తప్పనిసరిగా ఉండాలని రాజకీయ పార్టీలకు (ఇసి) సూచించింది.

**వీడియో, ఆడియో సందేశాలపై నిషేధం!**

ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత 48 గంటల వరకు ఎలాంటి బల్క్ ఎస్‌ఎంఎస్‌లు, ఆడియో సందేశాలు చేయరాదని ఎన్నికల సంఘం హెచ్చరించింది. అలాగే టివి, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియోల్లో ఎన్నికలకు సంబంధించి రాజకీయ ప్రకటనలు చేయరాదని తెలిపింది. పోలింగ్ ప్రాంతంలో ఆడియో విజువల్ డిస్‌ప్లేలు నిషేధించినట్లు పోల్ ఆథారిటీ పేర్కొంది. బిహార్ నవంబర్ 6న మొదటి దశ పోలింగ్ ప్రారంభమవుతున్న తరుణంలో ఇసి నిర్ణయం తీసుకుంది. కాగా బిహార్‌లో నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి. అదే నెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో బిహార్ రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అధికార ఎన్‌డిఎ, ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ పార్టీలు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. ప్రస్తుతం బిహార్‌లో అసెంబ్లీ గడువు నవంబర్ చివరి వారంలో ముగియనుంది. ప్రస్తుతం అక్కడ ఎన్డీఏ పార్టీ అధికారంలో ఉంది.

# మహారాష్ట్ర ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు

### ఎన్నికల కమిషనర్‌కు ప్రతిపక్ష నాయకుల ఫిర్యాదు



**ముంబయి:** మహారాష్ట్రలో ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలను ప్రతిపక్షనాయకుల బృందం మంగళవారం ఆ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి దృష్టికి తీసుకువచ్చింది. ఓటర్ల జాబితాలో అవకతవకలను సరిదిద్దాలని ప్రతిపక్షనాయకుల బృందం డిమాండ్ చేసింది. ఆ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి ఎస్.చొక్కలింగంను కలుసుకున్న ప్రతిపక్ష నాయకుల ప్రతినిధిబృందంలో కాంగ్రెస్, వామపక్షాలు, పీజంట్స్,వర్కర్స్‌పార్టీ, సమాజ్‌వాదీపార్టీలకు చెందిన నాయకులు కూడా ఉన్నారు. ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకుడు శరద్‌పవార్, శివసేన (యుబిటి) నాయకులు ఉద్ధవ్ థాక్రే, ఎంఎన్‌ఎస్ నాయకుడు రాజ్ థాక్రే తదితరులతో కూడిన ప్రతిపక్ష నాయకులబృందం మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఓ)ని కలిసి ఎన్నికల ప్రక్రియలో అవకతవకలను ఆయన దృష్టికి తీసుకువచ్చింది. అదే విధంగా ఈఏడాది చివరిలో లేదా వచ్చే ఏడాది ఆరంభంలో జరుగుతాయని భావిస్తున్న మహారాష్ట్ర స్థానిక ఎన్నికలలో వివిపిటిలను (వోటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) ఉపయోగించాలని కూడా ప్రతిపక్ష నాయకులు సిఇఓను డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికలలో కలిసి పోటీ చేయాలనే లక్ష్యంతో ఇటీవల ఏకమైపోయిన శివసేన గ్రూపులకు చెందిన నాయకులు, బంధువులు ఉద్ధవ్ థాక్రే, రాజ్‌థాక్రే ఇద్దరు కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి రావడం కనిపించింది. ఐతే మహారాష్ట్ర నవ నిర్మాణసేన(ఎంఎన్‌ఎస్) ప్రధాన నాయకుడు కూడా ఈ విశాలమైన ప్రతిపక్ష కూటమిలో భాగస్వామిగా ఉంటారా? లేదా? అనే విషయం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ఎన్నికల వేళ ప్రతిపక్ష నాయకులు ఏకమవుతూ ఉండటంతో ఉపముఖ్యమంత్రి, శివసేన అధిపతి ఏక్‌నాథ్ షిండే వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ''అది మహా వికాస్ ఈఘాడీ కాదు, మహా గందరగోళ అఘాడీ'' అని విమర్శించారు.కాగా ముంబై కాంగ్రెస్ అధ్యక్షుడు వర్ష గైక్వార్డ్, శివసేన (యుబిటి) నాయకులు అంబదాస్ దన్వే, అరవింద్ సావంత్ లతో కూడిన మరో బృందం కూడా మహారాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను కలుసుకుని ఎన్నికల ప్రక్రియలో అవతవకలపైనే ఫిర్యాదు చేసింది. ''ఓటర్ల జాబితాలో ఉన్న అవకతవకలు ఏమిటో సిఇఓ దృష్టికి తీసుకువచ్చాం, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయి, దీన్ని బట్టే స్పష్టంగా అర్థమైంది, రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో, నియోజకవర్గాలలో అవకతవకలు జరుగుతున్నాయి'' అని ఎన్‌సిపి(ఎస్‌పి) నాయకుడు జయంత్ పాటిల్ పాత్రికేయులకు చెప్పారు. దీని వల్ల రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇదేవిధమైన గందరగోళ పరిస్థితులు కొనసాగుతాయని ఆయన అన్నారు. తమ ఆందోళనలు, తమ డిమాండ్లు తెలుసుకుని చర్చించడంకోసం అందరితో ఒక సమావేశం నిర్వహించాలని సిఇఓను తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు పదే పదే వచ్చాయని, ఒక ఇంట్లో 170 ఓట్లు ఉన్నాయని ఇది అవకతవకలకు పెద్ద తార్కాణమని పాటిల్ విమర్శించారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపేముందుగా ఓటర్ల జాబితాలో ఉన్న తేడాలన్నింటినీ సరిదిద్దాలని కోరారు.

## రాష్ట్రం హక్కులను లాక్కుంటారా..?

**న్యూఢిల్లీ :** తమిళనాడు మద్యం కుంభకోణం కేసు మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)ని సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను ఇడి లాక్కుంటుందా..? అలా చేయడం సమాఖ్య వ్యవస్థకు విరుద్ధం కాదా? అంటూ ఘాటుగా స్పందించింది. మద్యం రిటైలర్ 'టాస్మాక్'లో అవకతవకలపై తమిళనాడు పోలీసులు, అవినీతి నిరోధకశాఖ కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నాయి. అయితే, ఆయా కేసుల ఆధారంగా ఇడి సైతం మనీ లాండరింగ్ కింద కేసు దర్యాప్తు ప్రారంభించింది.

## టిక్కెట్లు ఇచ్చి... మళ్లీ వెనక్కి

**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ మంగళవారం తెల్లవారుజామున అనేక మంది అభ్యర్థులకు పార్టీ టిక్కెట్లు ఇచ్చారు. యితే ఆయన కుమారుడు, వారసుడు తేజస్వి యాదవ్ బిహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఇంకా సీట్ల పంపకాల ఫార్ములాను అధికారికంగా ప్రకటించలేదని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆర్‌జెడి అధినేత భార్య, మాజీ ముఖ్యమంత్రి రబ్రీ దేవికి కేటాయించిన బంగళా 10, సర్క్యులర్ రోడ్ వెలుపల తొక్కిసలాట లాంటి పరిస్థితి కనిపించింది. ఈ జంట ఢిల్లీలో కోర్టు ముందు హాజరై తిరిగి వచ్చినప్పుడు ఆ బంగళాలో తొక్కిసలాట సందడి నెలకొంది. పార్టీ నుండి ఫోన్ కాల్స్ అందుకున్న ఆశావహులు, నిమిషాల తర్వాత పార్టీ గుర్తు చేతుల్లో, ముఖాల్లో విశాలమైన చిరునవ్వుతో బయటకు వచ్చారు. అయితే, తల్లిదండ్రులు తిరిగి వచ్చిన కొన్ని గంటల తర్వాత ఢిల్లీ నుండి తిరిగి వచ్చిన యాదవ్, ఈ పరిణామంతో కలత చెందారని చెబుతున్నారు. ఆర్‌జెడి వర్గాల సమాచారం ప్రకారం, పార్టీ గుర్తు, అభ్యర్థుల ఫొటోలు, వీడియో క్లిప్‌లు కూటమి భాగస్వాములతో ఇంకా ఒప్పందం కుదరలేదు అని ఆయన తన తండ్రికి చెప్పారు. అందువల్ల, పార్టీ చిహ్నాల పంపిణీని నిలిపివేసి, అర్ధరాత్రి దాటిన తర్వాత, వాటిని పొందిన వారిని సాంకేతిక సమస్యల కారణంగా టిక్కెట్లను తిరిగి ఇవ్వమని కోరారు. ఆర్‌జెడిలో టికెట్లు పొందిన వారిలో గత వారం ముఖ్యమంత్రి నితీష్ కుమార్ జెడియు నుండి వైదొలిగిన సునీల్ సింగ్ (పర్బట్టా), మతిహాని నుండి అనేకసార్లు మాజీ ఎమ్మెల్యేగా ఉన్న నరేంద్ర కుమార్ సింగ్ అలియాస్ బోగో ఉన్నారు. భాయ్ వీరేంద్ర, చంద్రశేఖర్ యాదవ్ (మాధేపుర), ఇజ్రాయెల్ మన్సూరి (కాంతి) వంటి అనేక మంది సిట్టింగ్ ఆర్‌జెడి ఎమ్మెల్యేలు కూడా పార్టీ చిహ్నాన్ని ఊపుతూ పార్టీ అధినేత ఇంటి నుండి బయటకు వచ్చారు.

## జార్ఖండ్‌లో ఈ ఏడాది 266 మంది నక్సల్స్ అరెస్టు

### 32 మంది మృతి, 30 మంది లొంగుబాటు

**రాంచి :** జార్ఖండ్‌లో సెప్టెంబర్ చివరి వరకు 266 మంది మావోయిస్టులను అరెస్టు చేయగా, 32 మంది మరణించారని, 30 మంది భద్రతా దళాల ముందు లొంగిపోయారని మంగళవారం ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. అరెస్టు అయిన వారిలో ఇద్దరు ప్రాంతీయ కమిటీ సభ్యులు, ఒక జోనల్ కమాండర్, ఇద్దరు సబ్‌జోనల్ కమాండర్లు, సిపిఐ (మావోయిస్ట్), దాని చీలిక గ్రూపులకు చెందిన తొమ్మిది మంది ఏరియా కమాండర్లు ఉన్నారని ఆయన చెప్పారు. 'జనవరి 1 నుండి భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 32 మంది నక్సలైట్లు మరణించారు. ఎన్‌కౌంటర్లలో మరణించిన ప్రముఖుల్లో వివేక్ అలియాస్ ప్రయాగ్ మాంఝీ, అనుజ్ అలియాస్ సహదేవ్ సోరెన్ ఉన్నారు. ఇద్దరూ సిపిఐ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ సభ్యులపై ఒక్కొక్కరికి రూ. 1 కోటి రివార్డు ఉందని, ఐజి (ఆపరేషన్స్), జార్ఖండ్ పోలీసు ప్రతినిధి మైఖేల్ రాజ్ విలేకరులకు తెలిపారు. ఈ కాలంలో మొత్తం 30 మంది నక్సలైట్లు భద్రతా దళాల ముందు లొంగిపోయారని ఆయన చెప్పారు. లొంగిపోయిన వారిలో జోనల్ కమాండర్ రవీంద్ర యాదవ్ మరియు సిపిఐ (మావోయిస్ట్) సబ్‌జోనల్ కమాండర్ ఆనంద్ సింగ్, జార్కండ్ జన ముక్తి పరిషత్ (జెజెఎంపి) సబ్ జోనల్ కమాండర్, లావ్లేష్ గంజు అలియాస్ లోకేష్ గంజు కూడా ఉన్నారు. జనవరి 1 నుండి సెప్టెంబర్ 30 వరకు పోలీసులు భారీ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. 'పోలీసుల నుండి దోచుకున్న 58 ఆయుధాలు, 11,950 కార్ట్రిడ్జ్‌లు, 18,884 డిటోనేటర్లు, 394.5 కిలోల పేలుడు పదార్థాలు, 228 ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ పరికరాలు (ఐఇడిలు) సహా 157 తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. గత తొమ్మిది నెలల్లో 37 మావోయిస్టు బంకర్లను కూడా ధ్వంసం చేశారు' అని పోలీసు ప్రతినిధి తెలిపారు. ఈ కాలంలో రూ. 39.53 లక్షల లెవీ మొత్తాన్ని కూడా జప్తు చేశారు. ఈ సంవత్సరం సైబర్ నేరస్థులపై పోలీసు శాఖ పెద్ద ఎత్తున చర్యలు చేపట్టిందని కూడా పేర్కొన్నారు. సైబర్ నేరస్థులపై మొత్తం 128 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయగా, ఆగస్టు, సెప్టెంబర్‌లలో ఇటువంటి నేరాలకు సంబంధించి 105 మందిని అరెస్టు చేశారు. ఇంకా, ఈ ఆపరేషన్లలో 128 మొబైల్ ఫోన్లు, 166 సిమ్ కార్డులు, 60 ఎటిఎం కార్డులు, 15 పాస్‌బుక్‌లు, రెండు ల్యాప్‌టాప్‌లు, 11 చెక్ బుక్‌లు, రూ.2.81 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.



## పూరణ్ కేసులో ట్విస్ట్.. మరో పోలీసు అధికారి ఆత్మహత్య



**చండీగఢ్ :** హర్యానా అదనపు డిజిపి వై.పూరణ్ కుమార్ ఆత్మహత్య కేసులో ట్విస్ట్ చోటు చేసుకుంది. పూరణ్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ తాజాగా మరో పోలీసు అధికారి ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించింది. పూరణ్‌పై అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ఎఎస్ఐ సందీప్ కుమార్ గన్‌తో కాల్చుకుని సూసైడ్ చేసుకున్నారు. ఆత్మహత్యకు ముందు ఆయన సెల్ఫీ వీడియోను రిలీజ్ చేశారు. రోహతక్ సైబ ర్ సెల్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన సందీప్.. పూరణ్ కుమార్ అవినీతి కేసును దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఆయన మంగళవారం గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పా ల్పడ్డారు. ఈ మేరకు సెల్ఫీ వీడియో రిలీజ్ చేశారు. అందులో పూరణ్‌పై సంచలన ఆరోపణలు చేశారు. పూరణ్ ఓ అవినీతి అధికారి అంటూ ఆరోపించారు. అవినీతి కేసులో శిక్ష పడుతుందన్న భయంతోనే పూరన్ ఆత్మహత్య చేసుకున్నట్లు సందీప్ కుమార్ వెల్లడించారు. 'పూరణ్ కుమార్ ఓ అవినీతి అధికారి. అతని అవినీతి మామూలుగా లేదు. అదంతా బయటపడుతుందనే భయంతోనే ఆత్మహత్య చేసుకున్నాడు అని పేర్కొన్నారు. సత్యం కోసం తన ప్రాణాలను త్యాగం చేస్తున్నట్లు ఈ సందర్భంగా సెల్ఫీ వీడియోలో సందీప్ కుమార్ పేర్కొన్నారు.

## బిహార్‌లో 71 మంది అభ్యర్థులతో బిజెపి తొలి జాబితా




**న్యూఢిల్లీ :** అధికార బిజెపి బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు మంగళవారం 71 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను విడుదల చేసి ఆశ్చర్యపరిచింది. ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన స్పీకర్ నంద్ కిషోర్ యాదవ్‌కు టికెట్ నిరాకరించగా, దశాబ్ద కాలం తర్వాత ప్రత్యక్ష ఎన్నికల్లో డిప్యూటీ సిఎం సామ్రాట్ చౌదరిని బరిలోకి దింపింది. శాసనమండలి సభ్యుడు, ఆరోగ్య, న్యాయ మంత్రి మంగళ్ పాండేను కూడా పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు పోటీకి నిలిపింది. 2010లో పర్బట్టా నుంచి ఆర్‌జెడి టికెట్‌పై అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన చౌదరి, పక్కనే ఉన్న తారాపూర్ నుంచి పోటీకి దిగగా, పాండేను సివాన్ నుంచి బిజెపి అభ్యర్థిగా ప్రకటించారు. ముఖ్యంగా, చౌదరి, పాండే ఇద్దరూ మాజీ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు. అయితే, తన కుమారుడికి టికెట్ ఆశిస్తున్నట్లు చెప్పబడుతున్న 72 ఏళ్ల మాజీ అసెంబ్లీ స్పీకర్, వెంటనే సోషల్ మీడియాలో 'నేను బిజెపి తీసుకున్న నిర్ణయంతో కట్టుబడి ఉన్నాను. నాకు ఎటువంటి ఫిర్యాదులు లేవు. కొత్త తరం నాయకత్వాన్ని నేను స్వాగతిస్తున్నాను' అని పోస్టు చేశారు. కిశోర్ యాదవ్ మొదట 1995లో పాట్నా తూర్పు నుండి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు, 2008లో డీలిమిటేషన్ తర్వాత పాట్నా సాహిబ్‌గా పేరు మార్చారు, మాజీ డిప్యూటీ సిఎం సుశీల్ కుమార్ మోదీ మరణం తర్వాత రాష్ట్రంలో తన తరంలో మిగిలి ఉన్న చివరి బిజెపి కురవృద్ధుడిగా పరిగణించబడ్డారు. అభ్యర్థుల జాబితాలో ఆశ్చర్యకరమైన అంశం ఏమిటంటే, మాజీ కేంద్ర మంత్రి రామ్ కృపాల్ యాదవ్, తన మాజీ గురువు, ఆర్‌జెడి అధ్యక్షుడు లాలు ప్రసాద్ పట్ల నిరాశ చెంది 2014లో బిజెపిలో చేరారు. ఆయన పాటలీపుత్ర లోక్‌సభ నియోజకవర్గంలో ప్రసాద్ కుమార్తె మిసా భారతిని రెండుసార్లు ఓడించారు. కానీ గత సంవత్సరం జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు. పాట్నా శివార్లలోని దనాపూర్ స్థానం నుండి ఆయనకు పార్టీ టికెట్ ఇచ్చింది, ప్రస్తుతం ఈ స్థానానికి ఆర్‌జెడి బలమైన నాయకుడు రీత్ లాల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత ఎన్నికల్లో లఖిసరాయ్‌లో హ్యాట్రిక్ సాధించిన ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హాను మళ్ళీ అదే నియోజకవర్గం నుండి పోటీకి నిలిపారు. రేణు దేవి (బెట్టయ్య), నితిన్ నబిన్ (బంకిపూర్), నితీష్ మిశ్రా (ఝంఝార్‌పూర్), జిబేష్ మిశ్రా (జాలే), సంజయ్ సరోగి (దర్భంగా), నీరజ్ కుమార్ సింగ్ బబ్లూ (ఛాతాపూర్), కేదార్ ప్రసాద్ గుప్తా (కుర్హానీ) సహా అనేక మంది మంత్రులు కూడా ఈ జాబితాలో ఉన్నారు. వీరందరూ వారి సిట్టింగ్ స్థానాల నుండి తిరిగి నామినేట్ చేయబడ్డారు. కళ, సంస్కృతి మంత్రి మోతీలాల్ ప్రసాద్‌ను తొలగించారు. ఆయన రిగా సీటు బైద్యనాథ్ ప్రసాద్‌కు దక్కింది. రెండవ అవకాశం ఇచ్చేందుకు నిరాకరించబడిన సిట్టింగ్ ఎమ్మెల్యేల సంఖ్య సుమారు 10 అని బిజెపి వర్గాలు పేర్కొన్నాయి. ఈ జాబితాలో ఐదు సంవత్సరాల క్రితం జముయి నుండి అరంగేట్రం చేసిన ఏస్ షూటర్ శ్రేయసి సింగ్‌తో సహా తొమ్మిది మంది మహిళలు ఉన్నారు.

## సురక్షిత ప్రాంతానికి పారిపోయిన మడగాస్కర్ దేశాధ్యక్షుడు



**అంటనానరివో:** ఆఫ్రికా ఆగ్నేయ తీరప్రాంత దేశం మడగాస్కర్‌లో యువకులు చేస్తున్న ఉద్యమం పరాకాష్ఠకు చేరుకోవడంతో పరిస్థితులు అదుపుతప్పాయి. దేశాధ్యక్షుడు ఆంద్రీ రాజోలినా (51) అభిశంసన, శిక్షలనుండి తప్పించుకోవడం కోసం పార్లమెంటు (నేషనల్ అసెంబ్లీ)ను రద్దుచేశారు. తన ప్రాణాలకు ముప్పు ఉన్నందువల్ల దేశం వదిలి సురక్షితమైన ప్రదేశానికి వెళ్ళిపోయినట్లు ప్రకటించారు. ఐతే రాజోలినాను అభిశంసించేందుకు అభిప్రాయసేకరణగా జరిగిన ఓటింగ్‌ను కూడా ఆయన ఖండించి తరస్కరించారు. తనను అభిశంసిస్తూ ఓటింగ్ చేయడ రాజ్యాంగ విరుద్ధమని కూడా ఆయన ప్రకటించారు. ఈ ఓటింగ్‌లో ఎలాంటి ఫలితం వచ్చినా అది బుట్టదాఖలు కావాల్సిందేనని సోషల్ మీడియాలో ఆయన పోస్టింగ్ పెట్టారు. అభిశంసన ఓటింగ్‌కు ముందుగా 163 మంది ఎంపీలలో 110 మంది అభిశంసన ఓటింగ్ జరపాలన్న లేఖపై సంతకాలు చేశారు. పార్లమెంటు రద్దుపై సెనేట్ సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకున్నాననీ, గుర్తుతెలియని ప్రదేశం నుండి ఫేస్‌బుక్ ద్వారా ప్రకటించిన డిక్రీలో ఆయన తెలిపారు. ఐతే దీని చెల్లుబాటుపై అస్పష్టత నెలకుంది. పార్లమెంటును రద్దుచేస్తూ జారీ చేసిన డిక్రీ చెల్లుబాటు కాదని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. దీంతో గందరగోళం నెలకుంది. ఫ్రాన్స్ సైనిక విమానం ఎక్కి ఆదివారంనాడే రాజోలినా దేశం వదిలివెళ్ళిపోయినట్లు ప్రతిపక్షాలు, వైమానికదళ అధికారవర్గాలు, ఒక విదేశీ దౌత్యవేత్త చెప్పినట్లు రాయిటర్స్ వార్తాసంస్థ తెలియజేసింది. ఐతే రాజోలినా మంగళవారంనాడు ఎక్స్ వేదికగా విడిగా మరో పోస్టింగ్ పెడుతూ, దేశంలో తిరిగి కొత్త పార్లమెంటును ఎన్నికల ద్వారా ఏర్పాటు చేసేందుకు చట్టసభను రద్దుచేస్తూ తాను నిర్ణయం తీసుకున్నానని, దేశంలో యువకుల మాట అందరూ వినాలని ఆయన పేర్కొన్నారు. ఇటీవల నేపాల్‌లో, అంతకుముందు బంగ్లాదేశ్‌లో, శ్రీలంకలో కూడా జనరేషన్ జెడ్ ఉద్యమాలు దేశ ప్రభుత్వాలను కూల్చివేశాయి. దేశంలో జనరేషన్ జెడ్ చేస్తున్న ఉద్యమం అదుపుతప్పిందని, పరిస్థితులు చేజారాయని ఆయన ప్రకటించారు. దేశాధ్యక్షుడు రాజోలినా రెండేళ్ళక్రితం ఎన్నికల్లో గెలుపు తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఆయన అవినీతి, అక్రమాలకు పాల్పడి గెలిచారన్న ఆరోపణలు సర్వత్రా వ్యాప్తించడంతో దేశంలో యువకుల ఉద్యమం మొదలైంది. ఇన్నాళ్ళు ఆయనకు మద్దతుగా ఉన్న సైనికవర్గం కూడా ఆయనకు దూరమై యువకులకు మద్దతు ఇస్తోంది. సైన్యంలోని చీలికవర్గం దేశాధికారాన్ని స్వాధీనం చేసుకుంటామని రెండు రోజులక్రితం ప్రకటించింది. మరోవైపు జనరేషన్ జెడ్ ఉద్యమం ఉద్ధృతంరూపం దాల్చింది. ఈ ప్రతిష్ఠంభన మధ్య పార్లమెంటును రద్దుచేసి దేశం వదిలివెళ్ళిపోతున్నట్లు అధ్యక్షుడు రాజోలినా ప్రకటించారు. ఆ దేశంలో సంక్షోభం తారాస్థాయికి చేరింది. ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు గుర్తుతెలియని శక్తులు కుట్ర చేస్తున్నాయని అధ్యక్ష భవనం రెండు రోజులక్రితం ప్రకటన చేసిన కొద్ది గంటలకే సైన్యంలోని చీలికవర్గం దేశాధికారాన్ని స్వాధీనం చేసుకుంటామని ప్రకటించింది. ఒకప్పుడు దేశాధ్యక్షుణ్ణి అధికారంలో నిలబెట్టేందుకు సహకరించిన సైన్యం ఇప్పుడు దేశంలో నిరసన ప్రదర్శకులతో చేతులు కలపడంతో చీలికవర్గం ఈ ప్రకటన చేసింది. సైన్యంలో త్రివిధ దళాలు తమ చెప్పుచేతల్లో ఉన్నాయని చీలికవర్గం తెలిపింది. 2009లో కుట్రద్వారా రాజోలినాను సైన్యం అధికారంలో కూర్చోబెట్టింది. ఇప్పుడు ఆయనకు ఎదురుతిరిగింది. 2023లో రాజోలినా ఎన్నిక వివాదాస్పదమైనప్పటినుండీ దేశంలో ప్రజాందోళన చెలరేగింది.

## వైద్య విద్యార్థినిపై అత్యాచారం కేసు.. సీన్ రీకన్‌స్ట్రక్షన్



**కోల్‌కతా :** వైద్య విద్యార్థిని అత్యాచారం కేసులో పశ్చిమ బెంగాల్ పోలీసులు మ అరెస్టు చేసిన ఐదుగురు నిందితులను, బాధితురాలి స్నేహితుడిని దర్యాప్తులో భాగంగా నేరాన్ని పునర్నిర్మించడానికి నేర స్థలానికి తీసుకెళ్లారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. అరెస్టు చేసిన వ్యక్తులను, బాధితురాలి స్నేహితుడిని పరానగంజ్ కాలి బారి శ్మశాన వాటిక పక్కన ఉన్న అడవిలోని నేర స్థలానికి తీసుకెళ్లి, శుక్రవా రం రాత్రి అక్కడ జరిగిన నేరానికి సంబంధించి వారి పాత్రలను పునరావృతం చేయమని ఆదేశించారు. ఈ పునర్నిర్మాణాన్ని వీడియోగ్రాఫ్ చేసి, ఆపై వారి వాంగ్మూలాలతో సరిపోల్చుతారు. బాధితురాలి వాంగ్మూలంతో కూడా తా ము దీనిని ధృవీకరిస్తామని దర్యాప్తు బృందంలో భాగమైన పోలీసు అధికారి పిటిఐకి తెలిపారు. నేరం పునర్నిర్మాణం కోసం వచ్చే ముందు దర్యాప్తు అధికారులు బాధితురాలి స్నేహితుడిని దాదాపు గంటసేపు విచారించారని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా, నేరానికి సంబంధించి వారు దాచిపెట్టిన ఆధారాలను కనుగొనడానికి మంగళవారం ఉదయం అరెస్టు చేసిన ఐదుగురు నిందితులలో ఇద్దరిని వారి వారి నివాసాలకు తీసుకెళ్లామన్నారు. సోదాల సందర్భంగా పోలీసులు ఇద్దరి ఇళ్ల నుండి కొన్ని దుస్తులను స్వాధీనం చేసుకున్నారని, నేరం సమయంలో వారు వాటిని ధరించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నా రు. అంతకు ముందు దర్యాప్తులో భాగంగా అరెస్టు చేసిన మిగిలిన ముగ్గురు నిందితుల దుస్తులను కూడా స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు. ఈ దుస్తులను ఫోరెన్సిక్ పరీక్షకు పంపుతామని, వచ్చే ఫలితాలు తమ దర్యాప్తులో సహాయపడతాయన్నారు. అరెస్టు చేసిన ఐదుగురు నిందితులు గతంలో ఏదైనా నేరంలో పాల్గొన్నారా అని తెలుసుకోవడానికి వారి నేపథ్యాన్ని కూడా తనిఖీ చేశామని ఆయన అన్నారు. అరెస్టయిన ఐదుగురు నిందితుల వద్ద నుండి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌లను కూడా పరీక్షల కోసం పంపామని, పోలీసులు తమ దర్యాప్తులో భాగంగా బాధితురాలి తోటి విద్యార్థులను కూడా ప్రశ్నిస్తున్నారని ఆయన అన్నారు. అరెస్టు చేసిన ఐదుగురు నిందితులలో ఒకరు ప్రైవేట్ కళాశాల మాజీ సెక్యూరిటీ గార్డు, మరొకరు ప్రస్తుతం మరొక ఆసుపత్రిలో పనిచేస్తున్నారని పోలీసు అధికారి తెలిపారు. ఒక నిందితుడు స్థానిక పౌర సంస్థలో తాత్కాలిక ఉద్యోగి కాగా, మరొకరు నిరుద్యోగి.

## స్టార్‌షిప్ ప్రయోగం విజయవంతం

### 2030 నాటికి మార్స్‌పైకి మానవులు!

**న్యూఢిల్లీ :** ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత శక్తివంతమైన రాకెట్ 'స్టార్‌షిప్ ఫ్లైట్ 11' (ఐఎఫ్‌టి11) ఒక ప్రధాన పరీక్షను విజయవంతంగా పూర్తి చేసింది. దీనిని అక్టోబర్ 13న టెక్సాస్‌లోని స్టార్‌బేస్ నుంచి విజయవంతంగా ప్రయోగించారు. ఇది స్పేస్‌ఎక్స్ 11వ టెస్ట్ ఫ్లైట్. దీని అన్ని ప్రధాన లక్ష్యాలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ స్టార్‌షిప్ 11వ ఫ్లైట్ టెస్ట్ స్పేస్‌ఎక్స్ అతిపెద్ద పునర్వినియోగ రాకెట్‌కు సంబంధించినది. టెక్సాస్‌లోని స్టార్‌బేస్ నుంచి స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్ రాకెట్‌ను ప్రయోగించారు. బూస్టర్ విడిపోయి అంతరిక్షంలో నియంత్రిత పద్ధతిలో ప్రయాణించింది. అనంతరం అంతరిక్ష నౌక గల్ఫ్ ఆఫ్ మెక్సికోలోని హిందూ మహాసముద్రంలో దిగింది. ఈ పరీక్ష ఎటువంటి వైఫల్యాలు లేకుండా విజయవంతంగా పూర్తయింది. మునుపటిలాగే స్టార్‌షిప్ 8 స్టార్‌లింక్ ఉపగ్రహాలను మోసుకెళ్లింది. మెక్సికన్ సరిహద్దుకు సమీపంలోని స్టార్‌బేస్ నుంచి ఈ మిషన్ టెస్టింగ్ ప్రయోగం 60 నిమిషాలకు పైగా కొనసాగింది. దీనిని పూర్తి స్థాయి స్టార్‌షిప్ టెస్ట్ ఫ్లైట్‌గా పరిగణిస్తారు. స్పేస్‌ఎక్స్ వ్యవస్థాపకుడు, సిఇఒ ఎలోన్ మస్క్ దీనిని నిర్వహిస్తున్నారు. 2027 నాటికి చంద్రుని ఉపరితలంపైకి మానవులను తిరిగి పంపించాలనే లక్ష్యంతో ఉన్న నాసాకు స్టార్‌షిప్ ఫ్లైట్ చాలా ముఖ్యమైనది. మూన్ ల్యాండర్‌ను అభివృద్ధి చేయడానికి నాసా.. స్పేస్‌ఎక్స్‌కు 3 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టును ఇచ్చింది. ఈ ఒప్పందం ఆర్టెమిస్ ప్రోగ్రామ్‌లో భాగం. ఇది మానవులను చంద్రునిపైకి తిరిగి పంపే లక్ష్యంతో ఉన్న నాసా ప్రాజెక్ట్. ఇది ఎలాన్ మస్క్ డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన 'హ్యూమన్స్ ఆన్ మార్స్'కు ఓ మైలు రాయిగా ఉండబోతుంది. ఎలాన్ మస్క్ విజన్ ఒకే లక్ష్యానికి మించి విస్తరించి ఉంది. అంగారక గ్రహంపై శాశ్వత, స్వయం సమృద్ధిగల మానవ నివాసాన్ని త్వరగా స్థాపించడానికి ప్రతి రెండు సంవత్సరాలకు 2,000 అంతరిక్ష నౌకలను ప్రయోగించడమే ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. మార్స్ మిషన్: 2030లలో మానవసహిత మార్స్ మిషన్ కోసం 2026 మార్స్ లక్ష్యాన్ని సాధించేందుకు ఫ్లైట్ టెస్ట్‌ల సమయంలో అనేక క్లిష్టమైన సాంకేతిక సవాళ్లను అధిగమించే సామర్థ్యం స్టార్‌షిప్‌కు ఉండాలి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మస్క్ దీనిపై పనిచేస్తున్నారు. వీటిలో ప్రధానమైనది సంక్లిష్టమైన కక్ష్యలోనే ఇంధనం నింపే ప్రక్రియ. అది అంగారక గ్రహానికి చేరుకునే సుదూర ప్రయాణానికి చాలా అవసరం. 2026 చివరిలో అరుదైన గ్రహ అమరికతో భూ గ్రహం మార్స్‌కు అతి తక్కువ దూరంలో ఉంటుంది. ఆ సమయంలో భూమి నుంచి అతి తక్కువ ప్రయాణంతో అంగారక గ్రహాన్ని చేరుకోవచ్చు. ఇందుకోసం దాదాపు 7 నుంచి 9 నెలల సమయం పడుతుంది.

ప్రజాపక్షం
బుధవారం, 15 అక్టోబరు

# సిరా తడి ఆరకముందే ఉల్లంఘన

ఇరవై నాలుగు గంటలైనా గడవక ముందే గాజా శాంతి ఒప్పందానికి ఇజ్రాయెల్ తూట్లు పొడిచింది. హమాస్–ఇజ్రాయెల్ నడుమ మధ్యవర్తిత్వం వహించిన అమెరికా, ఈజిప్ట్, తుర్కియే, ఖతార్ దేశాధినేతలు ఈ ఒప్పందంపై సోమవారం సంతకాలు చేశారు. ఈజిప్ట్‌లో శాంతి నగరిగా పేరొందిన షెర్మ్ – ఎల్ – షేక్ వేదికగా, రెండు డజన్‌కు పైగా దేశాధినేతల సమక్షంలో ఇది జరిగింది. ఒప్పందానికి తాము పూచీకత్తు అని ఘనంగా చెప్పుకున్నారు ట్రంప్ సహా మధ్యవర్తిత్వం వహించిన నలుగురు దేశాధినేతలు. కానీ, మరుసటి రోజే దానిని ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తూ గాజాలో ఆరుగురు పాలస్తీనావాసులను పొట్టనపెట్టుకుంది.

నోబెల్ శాంతి బహుమతి ఊహల్లో తేలియాడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నయానో, భయానో 20 సూత్రాల ఒప్పందంపై హమాస్‌ను ఒప్పించారు. అందుకు అనుగుణంగానే తొలిదశలో భాగంగా దాని ఆధీనంలో ఉన్న 20 మంది ఇజ్రాయెల్ బందీలను సోమవారం విడుదల చేసింది. అదే సమయంలో ఇజ్రాయెల్ ప్రతిగా తమ జైళ్లలో మగ్గుతున్న 1,718 మంది పాలస్తీనియన్‌లను విడిచిపెట్టింది. ఈ సందర్భంగా సంవత్సరాల తరువాత తమ వారిని చూసుకున్న కుటుంబాలు, బంధుమిత్రుల భావోద్వేగ దృశ్యాలు ఇరువైపులా గోచరమయ్యాయి. ఇజ్రాయెల్ వాసులు హర్షాతిరేకాలతో కేరింతలు కొడుతూ, వీధుల్లో నృత్యాలు చేస్తూ తమ వారికి స్వాగతం పలుకగా, గాజావాసులకు ఆ భాగ్యం దక్కలేదు. కోలాహలం లేకుండా తమ వారిని తీసుకెళ్ళాలని ఇజ్రాయెల్ దుర్మార్గ ఆంక్షలు విధించడంతో బందివిముక్తులైన పాలస్తీనా వాసులకు కంటతడిపెడుతూ మౌన స్వాగతం లభించింది.

ఇక శాంతి ఒప్పందంలో దీర్ఘకాలిక సమస్యలైన రెండు దేశాల పరిష్కారం, లేదా పాలస్తీనా గుర్తింపు, స్వయం పాలన అంశాల ప్రస్తావనే లేదు. ఎట్టకేలకు మరోవైపు ఇజ్రాయెల్ విధ్వంసం కారణంగా దూరంగా వెళ్ళిపోయిన గాజావాసులు, నెమ్మదిగా తిరిగి తమ నగరాలకు చేరుకుంటున్నారు. వారికక్కడ హృదయవిదారక దృశ్యాలు స్వాగతం పలికాయి. తమ కష్టంతో కట్టుకున్న ఇళ్ళు, భవనాలు రాళ్ళ దిబ్బగా మారాయి. సర్వం కోల్పోయి తలదాచుకునేందుకు స్థలం లేక, తినేందుకు ఆహారం లేక నిస్సహాయంగా దీనంగా సాయంకోసం ఎదురుచూస్తున్నారు. ఒక అంచనా ప్రకారం గాజాలో 92 శాతం నివాసభవనాలు, 88 శాతం వాణిజ్య కేంద్రాలు ధ్వంసమయ్యాయి, 62 శాతం గాజావాసులు తమ ఆస్తుల పత్రాలను కోల్పోయారు. రెండేళ్ళ తరువాత స్వస్థలాలకు చేరుకోవడమే కాస్త ఊరట.

ఈజిప్టుకు కంటే ముందు ఇజ్రాయెల్‌కు వెళ్ళిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అక్కడ ఘన స్వాగతం లభించింది. స్థానిక పార్లమెంట్ నెస్సెట్‌లో ఆయన చేసిన ప్రసంగంలో యుద్ధాన్ని ఆపిన ఘనత తనకు తాను ఆపాదించుకోగా, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు(బీబీ) అందుకు వంతపాడారు. మూడు వేల ఏళ్ళ సంవత్సరాల సమస్యను పరిష్కరించానని ట్రంప్ జబ్బలు చరుచుకోగా, ఆయనను వేల సంవత్సరాలపాటు ఇజ్రాయెలీలు మరిచిపోలేరని బీబీ పొగడ్తల్లో ముంచెత్తారు. నోబెల్ శాంతి బహుమతి లభించని బాధలో ఉన్న ట్రంప్‌కు ఊరటగా ఇజ్రాయెల్ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించారు. అంతేకాక వచ్చే ఏడాది మరోసారి నోబెల్ కోసం సిఫార్సు చేస్తామని కూడా బీబీ మాటిచ్చారు. ఉబ్బితబ్బిబ్బైన ట్రంప్ గతంలో నెతన్యాహుపై నమోదైన అవినీతి ఆరోపణలను కొట్టివేసి, క్షమాభిక్ష ప్రసాదించాలని నెస్సెట్‌లోనే ఇజ్రాయెల్ అధ్యక్షుడిని కోరారు. ఏదో బహుమానంగా ఇచ్చిన వాటిని అవినీతిగా చూడొద్దన్నారాయన. తనకు తాను యుద్ధాన్ని ఆపానని చెప్పుకుంటున్న అధ్యక్షుడు ట్రంప్ గాజాపై వాడిన ఆయుధాలను ఇజ్రాయెల్‌కు సరఫరా చేసినట్లుగా నెస్సెట్ సాక్షిగా ఒప్పుకున్నారు. దీనిని బట్టి ఆయన శాంతి కాముకుడా లేక యుద్ధానికి ఆజ్యం పోశారా అనేది ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. ట్రంప్ ఏ శాంతి అధిపతిగానో లేదా యుద్ధ అధిపతిగానో ఉండవచ్చు తప్ప ఏకకాలంలో రెండు పాత్రల్లో ఉండలేరని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీ చేసిన వ్యాఖ్యలు వాస్తవాన్ని ప్రతిబింబిస్తున్నాయి. శాంతి ఒప్పందంపై సంతకాల సిరా ఆరకముందే ఇజ్రాయెల్ తన వక్రబుద్ధిని ప్రదర్శించింది. రెండేళ్ళ యుద్ధ కాలంలో కాల్పుల విరమణ ఒప్పందాలను ఆ దేశం ఉల్లంఘించడం ఇది మూడవసారి. రెండేళ్ళ పాటు గాజావాసులను ముప్పు తిప్పలు పెట్టి, నలువైపులా మానవహననానికి పాల్పడిన యుద్ధోన్మాది నెతన్యాహూ శాంతి ఒప్పందానికి కట్టుబడి ఉండడం సందేహమే!

# గాజాలో మారణహోమం నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు



డాక్టర్ అరుణ్ మిత్ర
ప్రెసిడెంట్,
ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్‌మెంట్(ఐడిపిడి)

ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ద్వారా దాదాపు రెండు సంవత్సరాలుగా పాలస్తీనా చిన్నారులు, మహిళలపై సాగుతున్న ఇజ్రాయెల్ సైన్యం మారణహోమానికి తెర పడుతుందనే ఆశను రేకెత్తించింది. అయితే, ఒప్పందం తర్వాత కూడా ఇజ్రాయెల్ తమ బాంబు దాడులను ఆపలేదని వార్తలు వస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ, రాబోయే రోజుల్లో ఈ దాడులు తగ్గుతాయనే ఆశ కొంత ఉంది. అయితే, ఈ మారణహోమం అనేక ముఖ్యమైన నిజాలను బయటపెట్టింది.

2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌లోకి హమాస్ చొరబడి 1200 మందికి పైగా అమాయక ప్రజలను చంపి, 251 మందిని బందీలుగా పట్టుకున్నప్పుడు, ఛేదించలేని భద్రతా కవచం ఉందనే ఇజ్రాయెల్ దీర్ఘకాలిక వాదన వీగిపోయింది. అమాయక ప్రజలు చంపబడటం లేదా బందీలుగా పట్టుబడటం వలన హమాస్ దాడిని ప్రపంచం తీవ్రంగా ఖండించింది. కానీ, దానికి ప్రతిగా ఇజ్రాయెల్ గాజాలో జరిపిన భారీ మారణహోమం జాతి నిర్మూలనే తప్ప మరొకటి కాదు. ఇది అన్ని అంతర్జాతీయ మానవతా చట్టాలను ఉల్లంఘించడమే.

హమాస్ దాడి తప్పు అని, అది ఇజ్రాయెల్ ప్రతిచర్యలకు పురిగొల్పిందంటూ అనేకమంది ఇజ్రాయెల్ క్రూరమైన ప్రతిస్పందనను సమర్థించారు. అయితే, ఈ ప్రాంతంలో ఇజ్రాయెల్ ఉద్దేశాలు అప్పటికే స్పష్టంగా ఉన్నాయని, ఈ సంఘటన కేవలం దానికి ఒక సాకును మాత్రమే ఇచ్చిందని అర్థం చేసుకోవాలి. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ పేర్కొన్నట్లుగా, "హమాస్ దాడి శూన్యంలో జరగలేదు. ఇది సంవత్సరాల తరబడి జరిగిన అణచివేత ఫలితం. శాంతియుత పాలస్తీనా విముక్తి ఉద్యమాన్ని (పిఎల్‌ఓ నాయకత్వంలో)బలహీనపరిచేందుకే ఇజ్రాయెల్ పరోక్షంగా హమాస్‌ను ఎదగనిచ్చిందని, దానికి నిధులు కూడా సమకూర్చిందని నివేదికలు సూచిస్తున్నాయి. హమాస్ సాయుధ విధానానికి ప్రపంచ మద్దతు ఎన్నటికీ లభించదు కాబట్టి, అది ఇజ్రాయెల్‌కు ప్రయోజనకారిగా మారింది.

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహు తమ దేశం హమాస్‌ను నిర్మూలిస్తుందని ప్రకటించినప్పటికీ, ఈ యుద్ధం హమాస్‌కు మాత్రమే పరిమితం కాలేదు. ఒకవైపు చిన్నారులు, మహిళలు, మరోవైపు భారీగా ఆయుధాలు కలిగిన ఇజ్రాయెల్ సైనికులు నిలబడ్డారు. ఆకలితో అలమటిస్తూ, నిరాశ్రయులైన పిల్లలు నీళ్ళు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తుండగా వారిని కూడా కాల్చి చంపారు. కొన్ని వార్తల ప్రకారం, 65,000 మందికి పైగా చనిపోయారు. వీరిలో 60 శాతం మంది మహిళలు, పిల్లలు. శిథిలాల కింద కూరుకుపోయిన వారిని కూడా లెక్కిస్తే మృతుల సంఖ్య 100,000 దాటవచ్చని కొన్ని నివేదికలు అంచనా వేస్తున్నాయి.

ఇదే సమయంలో, ఇజ్రాయెల్ ఆకాంక్షలు మరింత స్పష్టమయ్యాయి. ఇది సిరియా, లెబనాన్, ఇరాన్, యెమెన్ దేశాలపై దాడులు చేయడమే కాకుండా, వెస్ట్ బ్యాంక్‌లో చట్టవిరుద్ధంగా స్థావరాలను విస్తరించడాన్ని కొనసాగించింది. అక్కడ పాలస్తీనావాసులను వారి ఇళ్ల నుండి తరిమివేసి, వారి భూభాగాన్ని అనుసంధానం లేని ఎన్‌క్లేవ్(విదేశంలోని స్వదేశీ భాగాలు)గా విభజించింది. ఈ ప్రాంతాల మధ్య ప్రయాణించడానికి ఇప్పుడు ఇజ్రాయెల్ చెక్‌పోస్టులను దాటుకొని వెళ్లడం తప్పనిసరి, ఇది పాలస్తీనావాసుల దైనందిన జీవితాన్ని అత్యంత కఠినంగా చేసింది.

పాలస్తీనాను పూర్తిగా తుడిచిపెట్టి, గాజాను పర్యాటక, కార్పొరేట్, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం ఆధునిక నగరంగా పునర్నిర్మించాలని అమెరికన్ సామ్రాజ్యవాదం లక్ష్యంగా పెట్టుకుందని ఇప్పుడు స్పష్టమైంది. ప్రధాన బహుళజాతి సంస్థలు, నిర్మాణ లాబీలు ఇప్పటికే గాజా పునర్నిర్మాణం ద్వారా లాభాల కోసం ఎదురుచూస్తున్నాయి. కానీ పాలస్తీనియన్లు ఎక్కడికి వెళ్తారు?

ఒప్పందంలోని 12వ నిబంధన ప్రకారం, ఎవరూ గాజాను విడిచి వెళ్లడానికి బలవంతం చేయబడరు. వెళ్లాలనుకునే వారికి స్వేచ్ఛ ఉంటుంది, తిరిగి వచ్చేందుకు కూడా స్వేచ్ఛ ఉంటుంది. ప్రజలు అక్కడే ఉండాలని మేము ప్రోత్సహిస్తాము. మెరుగైన గాజాను నిర్మించే అవకాశాన్ని వారికి కల్పిస్తాము. అయితే, వారి స్వంత ఇళ్లకు తిరిగి రావడం గురించి ఏమీ ప్రస్తావించబడలేదు. ఇది గాజాలో పాలస్తీనావాసులకు ఇక స్థానం లేదనేందుకు సూచన. పాలస్తీనావాసులకు పాలనపై పూర్తి నియంత్రణ ఉండబోదు.

గాజాలో ఉపయోగించిన అధునాతన ఆయుధాలు, బాంబులను నిరంతరం సరఫరా చేయడం ద్వారా ఇజ్రాయెల్ సైనిక శక్తిని నిర్వహించడంలో, బలోపేతం చేయడంలో అమెరికా ప్రధాన పాత్ర పోషించింది. ఇరాన్‌తో యుద్ధంలో ఇజ్రాయెల్ ఇబ్బందులను ఎదుర్కొన్నప్పుడు సైతం అమెరికా నిఘా సమాచారం, మద్దతును అందించింది. ఖతార్‌లోని హమాస్ నాయకులను హత్య చేయడానికి కూడా ప్రయత్నాలు జరిగాయి. ఈ దేశాల్లోని ప్రజలు ఇజ్రాయెల్ చర్యలకు వ్యతిరేకంగా అనేక నిరసనలు తెలిపినప్పటికీ, ఈ మారణహోమం అంతటా పాశ్చాత్య దేశాలు ఎక్కువగా ఇజ్రాయెల్‌కు అండగా నిలిచాయి.

1940లలో మారణహోమం సమయంలో యూదులపై జరుగుతున్న సామూహిక జాతి నిర్మూలన దాడుల గురించి ప్రపంచానికి పెద్దగా తెలియదు. కానీ నేడు, పిల్లల హత్యలు, ఆకలితో, దాహంతో బాధపడుతున్న వారి బాధను ప్రపంచం వాస్తవ సమయంలో చూసింది. అయినప్పటికీ మౌనం వహించింది. పాలస్తీనావాసులు ఇతర దేశాల నుండి మద్దతు ఆశించి ఉండవచ్చు. కానీ అరబ్ ప్రభుత్వాలు ఏవీ వారికి బహిరంగంగా మద్దతు ఇవ్వలేదు. వీటిలో చాలావరకు ప్రజాస్వామ్యం లేని రాచరికాలు. ఇక్కడ పాలకులు తమ ప్రజల ఇష్టాల కంటే అమెరికాతో తమ సంబంధాలకు ఎక్కువ విలువ ఇస్తారు. తమను తాము ఇస్లామిక్ రిపబ్లిక్ అని చెప్పుకునే, ఇస్లామిక్ నాటో కోసం వాదించే పాకిస్తాన్ కూడా పాలస్తీనా కోసం అర్థవంతంగా ఏమీ చేయలేదు. అది ఇప్పుడు అమెరికాతో సాన్నిహిత్యం కోసం ప్రయత్నిస్తోంది.

అదే సమయంలో కార్పొరేషన్‌లు ఈ మారణహోమం నుండి లబ్ధి పొందాయి. అనేక కంపెనీలు ఇజ్రాయెల్‌కు ఆయుధాలు, డ్రోన్లు, నిఘా చిప్‌లను సరఫరా చేశాయని, ఇవి దాని సైన్యాన్ని బలోపేతం చేసి, సుదీర్ఘ సామూహిక జాతి నిర్మూలనను కొనసాగించాయని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. ఈ యుఎన్ నివేదిక ఇజ్రాయెల్ 'జాతి నిర్మూలన'కు సహకరించిన కంపెనీలను జాబితాను తయారు చేసింది. ఇజ్రాయెల్ ఆక్రమణ, గాజాపై యుద్ధానికి సహాయం చేస్తున్న కంపెనీలలో అనేక అమెరికా దిగ్గజాలను పేర్కొంటూ యుఎన్ ప్రత్యేక ప్రతినిధి ఫ్రాన్సిస్కా అల్బనీస్ ఒక నివేదికను విడుదల చేసింది. చైనా నుండి మెక్సికో వరకు ఇతర దేశాల కంపెనీల పేర్లు కూడా ఇందులో ఉన్నాయి. భారత ప్రభుత్వం తమ దీర్ఘకాలిక పాలస్తీనా అనుకూల వైఖరిని విడిచిపెట్టి, బహిరంగంగా ఇజ్రాయెల్‌కు మద్దతు పలికింది. అనేక భారతీయ కంపెనీలు కూడా ఇజ్రాయెల్‌కు సామాగ్రిని సరఫరా చేశాయి. పాలస్తీనియన్లను వారి ఉద్యోగాల నుండి తొలగించిన తర్వాత వారి స్థానంలో భారతీయ కార్మికులను (వారి జీవితాలకు ప్రమాదం ఉన్నప్పటికీ) ఇజ్రాయెల్‌కు పంపారు.

సాధారణ ఫాసిస్ట్ పద్ధతిలో ఇజ్రాయెల్ చర్యలకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిని యూదు వ్యతిరేకులు అనే ముద్ర వేశారు. భారతదేశంలో, పాలస్తీనాకు మద్దతు పలికిన గొంతులను అణచివేయడానికి ముస్లిం వ్యతిరేక హిస్టీరియా(కట్టడి లేని భావోద్వేగాల)ను ఉపయోగించారు. పాలస్తీనాతో భారతదేశ చారిత్రక సంఘీభావం బలహీనపడింది. బిజెపి పాలిత రాష్ట్రాలలో, పాలస్తీనాకు అనుకూలంగా బహిరంగ ప్రదర్శనలను నిషేధించడమే కాకుండా సమావేశ గదులలో చర్చలు నిర్వహించడానిని కూడా నిషేధించారు. అటువంటి సమావేశాలను భగ్నం చేయడానికి మితవాద హిందూ మత మౌఢ్య సమూహాలను సమీకరించారు. ఇది ఇజ్రాయెల్ జియోనిజం(యూదుమతవాదం), హిందుత్వ జాతీయవాదం మధ్య ఉన్న భావజాల సారూప్యతను బయటపెట్టింది.





ఈ పరిణామాలు ప్రపంచ భౌగోళిక రాజకీయాల భవిష్యత్తు గురించి, సామ్రాజ్యవాద, నయావలసవాద శక్తులు మళ్లీ ఇతర దేశాలపై ఆధిపత్యం చెలాయించడానికి ఎలా ప్రయత్నిస్తున్నాయనే దాని గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తాయి. దురదృష్టవశాత్తు, ఈ మారణహోమంలో ఇజ్రాయెల్‌కు అండగా నిలబడిన డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు నోబెల్ శాంతి బహుమతి కోసం చూస్తున్నారు.

ఈ నేపథ్యంలో రానున్న కాలంలో, శాంతి, న్యాయం, మానవ గౌరవం కోసం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటానికి, ఐక్యంగా ఉండటం అత్యంత అవసరం.

## అనన్య సామాన్య ప్రతిభా మూర్తి...

# అబ్దుల్ కలాం



మహనీయుల జీవిత గాథలు చరిత్రకే అలంకారం. చరిత్ర సృష్టించడమే కాదు. 'చరిత్ర'కే నిర్వచనం చెప్పే నిస్వార్థ సేవకులు ఈ భరత ధరిత్రిపై జన్మించారు. అనేకరంగాల్లో తమ మేథస్సును చాటిచెప్పి, తాము దేశం కోసమే జన్మించామని, దేశం కోసమే తమ జీవితం అంకితమని నిరూపించి చరిత్రపుటల్లో నిలిచిపోయిన అనన్య సామాన్యమైన ప్రతిభా వంతులను, స్ఫూర్తి దాతలను స్మరించుకోవడం మన కనీస బాధ్యత. తుదిశ్వాస వరకు విద్యార్థులకు స్ఫూర్తిని రగిలించిన అబ్దుల్ కలాం జయంతిని ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి పరిగణించడం భారతీయులకు అత్యంత గర్వకారణం. ఇది అబ్దుల్ కలాం సేవలకు నిజమైన గుర్తింపు. అహర్నిశలూ భారతదేశ ప్రగతికోసం తపించిన కలాం గురించి ఎంత చెప్పినా తక్కువే.

భారతీయ విజ్ఞానం అమోఘమైనది, అనితర సాధ్యమైనది. భారతదేశం పాలు పొంగే జీవగడ్డ. సంపదకు పురిటిగడ్డ. విజ్ఞానానికి వేదిక. ప్రాచీన కాలం నుంచీ భారతదేశం విజ్ఞానరంగంలో ముందంజలో ఉంది. శాస్త్ర, సాంకేతిక రంగాలు ప్రపంచానికి పరిచయం కాకముందే భారతదేశం ఈ రంగాల్లో అగ్రస్థానంలో ఉంది. అయితే అప్పట్లో మన పరిశోధనలకు, ప్రయోగాలకు ప్రాచుర్యం లభించలేదు. గ్రంథస్థం చేసే సౌలభ్యం ప్రాచీన కాలంలో లేదు. తాళపత్ర గ్రంథాలలోనో, సంస్కృత లిపిలోనో మనవైభవం నిక్షిప్తమై ఉండేది. కాలానుగుణంగా ఇవన్నీ జీర్ణించుకుపోయాయి. మన సంపదతో పాటు విజ్ఞానాన్ని కూడా పరాయి దేశాలు కొల్లగొట్టాయి. అయినప్పటికీ కొంత విజ్ఞానం ప్రపంచానికి తెలిసింది. నేడు ప్రపంచం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలోకి దూసుకుపోతున్నది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లోను, అంతరిక్ష పరిశోధనా రంగాలలోను అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఏ దేశమైనా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే అన్నిరంగాల్లో పురోగతి సాధించాలి. దేశరక్షణ అనేది ప్రతీ దేశానికి తలకు మించిన భారంగా మారింది. ముఖ్యంగా భారతదేశం వంటి దేశాలకు రక్షణావసరాలు అధికం. దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడుకోవాలంటే రక్షణరంగాన్ని పటిష్టపరచక తప్పదు. ప్రపంచంలో పలు దేశాలు అణ్వస్త్ర దేశాలు కావడం వలన మనం కూడా అణ్వస్త్ర పాటవం కలిగి ఉండక తప్పడం లేదు. భారతదేశం ఎప్పుడూ శాంతి కాముకదేశమే, పైగా 'నో ఫస్ట్ యూజ్ ఆఫ్ న్యూక్లియర్ వెపన్స్' అనే స్వయం నిబంధన విధించుకున్నాం. నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఫోఖ్రాన్1 అణు పరీక్షలకు, వాజ్‌పాయ్ ప్రభుత్వం ఫోఖ్రాన్ 2 అణు పరీక్షలకు సాహసం చేయడం జరిగింది. ఫోఖ్రాన్2 అణుపరీక్షల్లో మన క్షిపణి పితామహుడు అబ్దుల్ కలాం పాత్ర శ్లాఘనీయం. భారతదేశం అణ్వస్త్ర రంగంలో ముందంజలో ఉంటేనే శత్రుదేశాలకు వెన్నులో వణుకు పుడుతుందని అబ్దుల్ కలాం భావించారు. భారతదేశంపై ఆర్థికపరమైన ఆంక్షలు విధించినప్పటికీ, అబ్దుల్ కలాం పై ఎన్ని ఒత్తిడులు వచ్చినప్పటికీ ఆయన తలొగ్గలేదు. అప్పటి ప్రభుత్వానికి కలాం చేసిన సూచనల ఫలితమే భారతదేశం అణ్వస్త్ర రంగంలో పురోగతి సాధించింది. బోటు నడుపుకునే కుటుంబం నుంచి వచ్చిన అతి నిరుపేద అబ్దుల్ కలాం తన తల్లిదండ్రుల కష్టాలను చూసి, వారికి చేదోడు వాదోడుగా ఉండాలనే దృఢ నిశ్చయంతో పేపర్ బాయ్‌గా పనిచేసి, భౌతిక శాస్త్రంలో పట్టా పొంది, మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎయిరో స్పేస్ ఇంజనీర్ గా బాహ్య ప్రపంచంలోకి అడుగుపెట్టడం జరిగింది. డి.ఆర్.డి.వో నుంచి ఇస్రో వరకూ ఎక్కడ పనిచేసినా దేశం కోసమే కలాం తన సమయాన్నంతా వెచ్చించడం జరిగింది. హోమీ జహంగీర్ బాబా, సతీష్ ధావన్ లాంటి ప్రఖ్యాత శాస్త్రవేత్తలు నేటి తరానికి తెలియకపోవచ్చునేమో గాని అబ్దుల్ కలాం పేరు తెలియని వారంటూ ఎవరూ లేరు. యువతపైన, విద్యార్థుల పైన 'కలాం' ప్రభావం అసాధారణం.

అబ్దుల్ కలాం కేవలం శాస్త్రవేత్త, క్షిపణి పితామహుడు మాత్రమే కాదు ఆయనలో ఒక తత్వవేత్త, ప్రకృతి ప్రేమికుడు, పర్యావరణ మిత్రుడు, రచయిత దాగివున్నాడు. అబ్దుల్ కలాం ఒక దార్శనికుడు, సాత్వికుడు, స్వాప్నికుడు. ప్రతి ఒక్కరూ తమ స్వప్నాలను సాకారం చేసుకోవాలని, అందు కోసం అహర్నిశలూ కృషి చేయాలని, తమ స్వప్నాలను సాకారం చేసుకుని, దేశాభ్యున్నతికి పాటుపడాలని నేటి తరానికి దశా దిశా నిర్దేశించిన చైతన్య దీప్తి అబ్దుల్ కలాం. ఆయనకు ఎన్ని అవార్డులు వచ్చినా, వాటికి అతీతంగా నిగర్వంగా, నిరాడంబరంగా జీవించిన నిజమైన దేశభక్తుడు భారతరత్న అబ్దుల్ కలాం. తాను రాష్ట్రపతిగా ఉన్నంతకాలం ప్రజలకోసమే తపించి, ప్రజల రాష్ట్రపతిగా పేరుగాంచారు. రెండు సూట్లు, నాలుగు చొక్కాలతో అతి నిరాడంబర జీవితం గడిపి, తుదిశ్వాస వదిలేముందు కూడా యువతను విద్యార్థులను తన చైతన్య వంతమైన ప్రసంగాలతో ఆకట్టుకున్న అపార ప్రజ్ఞాశాలి అబ్దుల్ కలాం. ఈ దేశానికి అబ్దుల్ కలాం లాంటి దేశభక్తులు, దార్శనికులు చాలా అవసరం. ఆయన కీర్తి అజరామరం,ఆచంద్ర తారార్కం. ఆయన ఆశించిన భారతావనికై యువత, విద్యార్థిలోకం నడుం బిగించాలి. కలాం స్ఫూర్తితో దేశాన్ని ముందుకు నడిపించాలి. భారతదేశం అభివృద్ధిలో ముందుకు సాగుతున్నా, ఆర్థిక అంతరాలకు ఆద్యంతాలు లేకుండా పోవడం ఆక్షేపణీయం. ఈ పరిస్థితులు మారాలి. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలి. శ్రమశక్తిని గౌరవించాలి. ప్రభుత్వ వేతన జీవులంతా తమ విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాలి. దేశంకోసం శ్రమించాలి. భారతదేశానికి శతృదేశాల పీడ అధికమవుతున్న నేపథ్యంలో రక్షణ వ్యవస్థను పటిష్ట పరచాలి. అబ్దుల్ కలాం లాంటి శాస్త్రవేత్తలను, రక్షణరంగ నిపుణులను తయారు చేయాలి.

*(అక్టోబర్ 15, అబ్దుల్ కలాం జయంతి, ప్రపంచ విద్యార్థుల దినోత్సవం)*

# విప్లవోద్యమ నిర్మూలన సాధ్యమేనా?

దేశంలో బిజెపి పాలన అమెరికా సుంకాలు, పెరిగిన నిరుద్యోగం, మతవిద్వేషాలు అంశాలతో పాటు ఇప్పుడు మావోయిస్టు ఉద్యమం భవితవ్యం పైన దేశవ్యాప్తంగా చర్చ సాగుతుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి వామపక్ష విప్లవోద్యమం ఏదో ఒక ప్రాంతంలో కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు 2026 మార్చి తర్వాత భారతదేశంలో నక్సలిజం ఇక ఉండదని మావోయిస్టు పార్టీని ఉండనివ్వబోమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన ప్రకటన కూడా చర్చనీయాంశమవుతుంది. ఇప్పుడు ఉన్న మావోయిస్టు పార్టీని లేదా విప్లవోద్యమ నిర్మూలన సాధ్యమేనా అన్నది ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశమైంది. గడిచిన రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం దండకారుణ్యంలో చేపట్టిన అనేక చర్యలు ప్రభుత్వానికి సానుకూల ఫలితాలను ఇచ్చి ఉండవచ్చు. సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టుల కోటల్లో పోలీసులు పాగా వేయవచ్చు. పోలీసులకు ప్రవేశం దొరకని చోట ఇప్పుడు బేస్ క్యాంపులు ఏర్పాటు చేయవచ్చు. ఎవరో ఒకరి సాయంతో మావోయిస్టు అగ్రనేతలను లోబర్చుకోవడమో లేదా వివిధ రూపాలలో హతమార్చడం కూడా జరిగి ఉండవచ్చు. భౌతికంగా మావోయిస్టులను ఏరివేయవచ్చు. శాశ్వతంగా విప్లవోద్యమ తుపాకుల జాడ వినిపించని స్థితికి విప్లవోద్యమ ప్రభావిత ప్రాంతాలను తీసుకురావచ్చు. కానీ విప్లవోద్యమ భావజాలం మాటేమిటన్నదే ఇప్పుడు ప్రశ్న. వ్యవస్థ మార్పుకోసం పోరాడుతున్న వారిని హతమార్చినంత మాత్రాన వ్యవస్థ మారాలన్న నినాదాన్ని నిలుపుదల చేయడం సాధ్యం కాదు. ఇప్పటి కేంద్రప్రభుత్వం చెబుతున్నట్లుగా మావోయిస్టు పార్టీ అంతకు ముందు పీపుల్స్‌వార్ ఇంకొంచెం ముందుకు వెళితే భారత కమ్యూనిస్టు పార్టీ, (మార్క్సిస్టు, లెనినిస్ట్) పార్టీ దేనికొరకు పోరాడుతున్నది అన్నది ప్రధానమైంది. ఏజెన్సీ ప్రాంతాలనే ఎందుకు ఎంచుకున్నది. 1960 దశకంలో భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో చీలికలు ప్రారంభమైన తర్వాత సాయుధ బలగాలు సమాజ మార్పు కోసం తమదైన పంథాలో పనిచేస్తున్నాయి. తొలుత సమాజానికి దూరంగా వెలివేయబడి అభివృద్ధికి నోచుకోని కోట్లాదిమంది ప్రజల పక్షాన సాయుధులు తమ గొంతుక వినిపించారు. వారి హక్కుల కోసం పోరాడారు. సాయుధ ఉద్యమ ఫలితాలను పరిశీలించే ముందు సాయుధ పోరాటంలో పాల్గొన్న వారి త్యాగాలను కూడా మనం మననం చేసుకోవాలి. సాయుధ పోరాటంలోకి ఉన్నత విద్యను అభ్యసించి ఈ సమాజ మార్పును కోరుకునే వారే ప్రవేశించారు. అనేకమందిని పోగేశారు. ఎవరు ఔనన్న, కాదన్న భారతదేశ రాజకీయ చిత్ర పటంపై సమాజ మార్పుకు చేసిన కృషి చెరిపేయలేనిది ఇది వాస్తవం. సాయుధ పోరాటంలో కొన్ని తప్పులు జరిగి ఉండవచ్చు. వాటితో పాటే ప్రజల ఆలోచనా విధానంలోనూ మార్పులు వచ్చాయి. అంకిత భావం స్థానే అవకాశవాదం చోటు చేసుకుంటున్నది. ఏరోజు మేలుచేస్తే ఆరోజు గుర్తుంచుకుని మరుసటి రోజుకు మరిచిపోయే పరిస్థితులు నెలకొన్న ఈ రోజుల్లో మావోయిస్టులకు కొంతమేర మద్దతు తగ్గిందన్నది నిజం. కానీ మావోయిస్టుల సంఖ్య కూడా పరిమితం కావచ్చు. పోలీసులు చెబుతున్నట్లు వందలమంది లొంగిపోవడం, ఏ ఎన్‌కౌంటర్ జరిగినా పదుల సంఖ్యలో మావోయిస్టు సాయుధులు మరణించడం ఇక మిగిలింది వీరేనంటూ సంఖ్యలు, అంకెలు, పేర్లు చెబుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో 2026 మార్చి 31 నాటికి అసలు మావోయిస్టులే లేరన్న ప్రకటన కూడా రావచ్చు. అడవులను విముక్తి చేశాం అంటూనే అంబానీ, అదానీలు లేదా మరికొన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే పరిస్థితి రావచ్చు. మావోయిస్టు వ్యతిరేకులు సంబురాలు చేసుకోవచ్చు. కానీ ఆ భావజాలం అంతమవుతుందా. భారతదేశ వ్యాప్తంగా బిజెపి వ్యతిరేక భావజాలం పెరుగుతుంది. బూర్జువా పార్టీల నేతలు సైతం కమ్యూనిస్టుల అవసరాలను గుర్తిస్తున్నారు. బహిరంగవేదికల మీద కమ్యూనిస్టుల అవసరం ఉందని ఈ దేశంలో కమ్యూనిస్టులు ఉండాలంటూ నొక్కి చెబుతున్నారు. వాక్ స్వాతంత్ర్యానికి భంగం కలిగినప్పుడు మనిషిని మనిషి దోచుకునే పరిస్థితి ఏర్పడినప్పుడు మనిషిపై బలవంతపు భావజాలాన్ని రుద్దినప్పుడు, స్వేచ్ఛగా తన భావాన్ని వ్యక్తం చేయలేనప్పుడు తొలుత గుర్తుకు వచ్చేది కమ్యూనిస్టులు. హక్కులు కోల్పోతున్న వారి కి ఆదరణ కరువైన వారికి, ఆపదలో ఉన్న వారికి గుర్తుకు వచ్చేది కూడా కమ్యూనిస్టులే. ఎర్రజెండాను పట్టుకోలేని వారు గతంలో ఎర్రజెండాను కాదనుకున్న వారు సైతం ఇప్పుడు ఆ జెండాల గొప్పతనాన్ని, అవసరాన్ని గుర్తిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మావోయిస్టులను హతమార్చడం సాధ్యమేమో కానీ ఆ భావజాలాన్ని రూపుమాపడం సాధ్యం కాదు.



భావజాలం బిజెపి విధానాలు మారనంత కాలం సంపదను కొంత మందికి దఖలు పరిచే విధానం పోనంతకాలం భావజాలం పెరుగుతూనే ఉంటుంది. పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, నిర్బంధంలో నుంచి విప్లవోద్యమం ఎదుగుతూనే ఉంటుంది తప్ప అంతం కాదు. అది ఏదో ఒక రూపంలో మళ్లీ నవ యవ్వన శక్తితో ముందుకొస్తుంది. మావోయిస్టులను హతమార్చడం ద్వారా మాత్రం ఆ భావజాలం అంతం కాదని అది ఏదో ఒక రూపంలో బహిర్గతమవుతుందని గుర్తుంచుకోవాలి. వామపక్ష తీవ్రవాదం పుట్టుకకు కారణమైన వ్యవస్థలోని లోపాలను సరి చేయకుండా వామపక్ష తీవ్రవాద బలోపేతానికి కారణాలను అన్వేషించకుండా సాయుధ బలగాలతో పైచేయి సాధించినంత మాత్రాన విప్లవోద్యమం అంతం కాదు విప్లవోద్యమ లక్ష్యం నెరవేరితే తప్ప.

ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం

# పరిశుభ్ర చేతులతోనే సురక్షిత జీవితం




చేతులు కడుక్కోవడం అనేది సూక్ష్మ జీవ వ్యాధుల వ్యాప్తిని అరికట్టే అత్యంత సరళమైన, తక్కువ ఖర్చుతో కూడిన ఆరోగ్య చర్య. ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు యునిసెఫ్ అంచనాల ప్రకారం, సబ్బుతో చేతులు కడుక్కోవడం ద్వారా డయేరియా వ్యాధులు 40 శాతం వరకు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు 25 శాతం వరకు తగ్గుతాయి. మానవ చర్మంపై కోట్ల సూక్ష్మ జీవులు సహజంగా నివసిస్తాయి; వీటిలో కొన్ని హానికరమైన పాథోజెన్స్‌గా మారి ఆహారం, తలుపుల హ్యాండిల్స్, మొబైల్ ఫోన్లు వంటి వస్తువులను చేతులతో తాకడం ద్వారా వ్యాపిస్తాయి. సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ నివేదిక ప్రకారం, సబ్బుతో 20సెకన్లపాటు చేతులు కడుక్కోవడం ద్వారా సూక్ష్మ జీవుల సంఖ్య 99శాతం తగ్గుతుంది.

**ప్రపంచ పరిశుభ్రత పాఠాలు** : 2020లో కరోనా మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా పరిశుభ్రత ప్రాధాన్యతను మరింతగా వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ హ్యాండ్ హైజిన్ ఫర్ ఆల్ అనే గ్లోబల్ ప్రచారాన్ని ప్రారంభించింది. జపాన్, సింగపూర్, కొరియా వంటి దేశాలు సెన్సార్ ఆధారిత హ్యాండ్ వాష్ స్టేషన్లు ఏర్పాటు చేసి పరిశుభ్రతను సాంకేతిక మార్గంలో విస్తరించాయి. భారత్‌లో స్వచ్ఛ భారత్ మిషన్ కింద గ్రామీణ పాఠశాలల్లో తక్కువ ఖర్చుతో నీరు, సబ్బు సదుపాయా లు ఏర్పాటు చేయడం వలన కరోనా సమయంలో ఇన్ఫెక్షన్ల రేటు తగ్గింది. ఈ అనుభవం పరిశుభ్రత కేవలం వ్యక్తిగత చర్య కాదు, సామూహిక ఆరోగ్య రక్షణకు కీలకమైనదని ప్రపంచానికి గుర్తు చేసింది.

యునైటెడ్ నేషన్స్ నివేదికల ప్రకారం, ప్రపంచ జనాభాలో సుమారు 2.1 బిలియన్ మందికి చేతులు కడుక్కోవడానికి అవసరమైన నీరు లేదా సబ్బు సదుపాయం లేదు. ఇది ముఖ్యంగా ఆఫ్రికా, దక్షిణాసియా, లాటిన్ అమెరికా గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా ఉంది. ఉదాహరణకు, నైజీరియాలో యునిసెఫ్ అమలు చేసిన శుభ్రమైన చేతులు ప్రాజెక్ట్ ద్వారా మూడు సంవత్సరాల్లో డయేరియా కేసులు 28 శాతం తగ్గాయి. బంగ్లాదేశ్‌లో ప్రారంభించిన సోపీ వాటర్ స్టేషన్లు అనే తక్కువ ఖర్చు విధానం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. ఒక చిన్న సీసా, కొంత నీరు, సబ్బుతో వందలమంది ప్రతిరోజూ చేతులు కడుక్కోగలిగే సదుపాయం అందించారు. ఈ ప్రయత్నాలు సామాన్య వనరులతో పెద్ద ఆరోగ్య మార్పులు సాధ్యమని నిరూపించాయి.

**ఆరోగ్యమే ఆర్థికాభి వృద్ధికి మూలం** : పిల్లల్లో పరిశుభ్రత అలవాటు పెంపొందించడం దీర్ఘకాల ఆరోగ్యానికి పునాది వేస్తుంది. కెన్యాలోని నైరోబీ పాఠశాలల్లో ప్రతిరోజూ హ్యాండ్ వాష్ కార్యక్రమం ప్రారంభించడంతో విద్యార్థుల హాజరు 20 శాతం పెరిగింది. భారత్‌లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో హ్యాండ్‌వాష్ హీరోస్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పరిశుభ్రత రాయబారులుగా మారుతున్నారు. ఈ చర్యలు విద్య, ప్రవర్తన మార్పు ఆధారంగా ఆరోగ్య సంస్కృతిని ఏర్పరుస్తున్నాయి. అలాగే వ్యాధి భారం తగ్గి, ఆరోగ్య ఖర్చులు తగ్గుతాయి, ఉత్పాదకత పెరుగుతుంది. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం, పరిశుభ్రతలో పెట్టుబడి చేసిన ప్రతి ఒక డాలర్‌కు మూడు డాలర్ల లాభం వస్తుంది. ఇండోనేషియాలో హ్యాండ్ హైజీన్ కార్యక్రమం ప్రారంభమైన తర్వాత కార్యాలయాల్లో గైర్హాజరు రేటు 19 శాతం తగ్గింది. ఈ ఉదాహరణలు పరిశుభ్రత అనేది ఆరోగ్య చర్య మాత్రమే కాక ఆర్థిక అభివృద్ధికి కూడా ప్రేరణ అని చూపుతున్నాయి. డిజిటల్ యుగంలో గ్లోబల్ హ్యాండ్‌వాషింగ్ డే వంటి కార్యక్రమాలు సోషల్ మీడియా ద్వారా కోట్లమంది ప్రజలను చేరుకుంటున్నాయి. మనం అమలు చేసే ఈ చిన్న చర్యతో ప్రపంచ ఆరోగ్యాన్ని కాపాడగలము. పరిశుభ్రమైన చేతులు సురక్షిత సమాజానికి బాటవేసే శాస్త్రీయ చర్యగా నిలుస్తాయి.

జి.వెంకటరమణ గౌడ్, 9866878769

## మీడియాపై మేనేజర్ దురుసుగా మాటలు

### ఆర్‌డిఎంకు ఫిర్యాదు

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ మీడియాపై తన దురుసు ప్రవర్తన అక్కసును వెళ్లబుచ్చారు. మీడియాని ఎవరు లోనికి రానిచ్చారు. వారిని ఎందుకు కూర్చోనిచ్చారు అంటూ అక్కడున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే వైరా మున్సిపాల్ కార్యాలయానికి విచారణ నిమిత్తం వరంగల్ నుంచి ఆర్‌డిఎంఒ షాహిద్ మసూద్ వచ్చారు. విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు అక్కడికి వెళ్లగా మున్సిపాల్ సిబ్బందితో ఆర్‌డిఎంఒ మాట్లాడుతుండగా అక్కడికి వచ్చిన మీడియాను గమనించిన మున్సిపాల్ కమిషనర్ గురులింగం బయటకు వచ్చి రూమ్‌లో కూర్చోండి అని చెప్పి వెళ్లడం జరిగింది. దీంతో పక్కనే ఉన్న గదిలో మీడియా మిత్రులు కూర్చోగా ఒక్కసారిగా మేనేజర్ సుధాకర్ మీడియాని ఎందుకు లోపలికి రానిచ్చారు. వాళ్లని ఎందుకు ఇక్కడ కూర్చోనిచ్చారు. బయటికి పంపించండి అంటూ అక్కడున్న తోటి అధికారులను ఆదేశించారు. ఇదే విషయాన్ని మీడియా ప్రతినిధులు బయటికి వచ్చిన తర్వాత ఆర్‌డిఎంఒకి కమిషనర్‌కు వివరించారు.

## సామూహిక సీమంతాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ఖమ్మం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని గోపాలపురం సెక్టార్‌లో సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. రోటరీ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో పోషణ్ మాసంలో భాగంగా సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సిడిపిఒ వీరభద్రమ్మ మాట్లాడుతూ పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషక ఆహార లోపాన్ని గుర్తించి వారికి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక ఆహార లోపాన్ని నివారించేందుకు బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నారు. ప్రధానంగా రక్తహీనత నిర్మూలించడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ విద్యార్థులకు యాక్టివిటి మెటీరియల్స్‌ను ప్రదర్శించారు. చిన్నారులు ఫ్యాన్సీ డ్రెస్‌లో ప్రదర్శనలు నిర్వహించారు.

## గీత పనివారల సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలి: బొమ్మగాని

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం 68వ ఆవిర్భావ దినోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని సంఘం నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం సమావేశం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన హైదరాబాదులోని రాజ్‌బహదూర్ గౌర్ హాల్‌లో సోమవారం జరిగింది. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిల్ గౌడ్, రాష్ట్ర కోఆర్డినేటింగ్ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, ఉపాధ్యక్షులు కెవిఎల్, కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈనెల 18వ తేదీన బిసిల రిజర్వేషన్‌కు మద్దతుగా బిసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన 'బంద్ ఫర్ జస్టిస్'కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ కార్యక్రమం జయప్రదం చేయాలని గీత పనివారల సంఘం విజ్ఞప్తి చేసింది.

## ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకున్న ఆర్ఐ

### ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు : తహసీల్దార్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని బారుగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 26లోని ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఫెన్సింగ్ వేసి ఆక్రమించేందుకు మంగళవారం యత్నించారు. సమాచారం తెలుసుకున్న ఆర్ఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి దానిని అడ్డుకున్నారు. సర్వేయర్ సతీష్‌రెడ్డి ద్వారా సర్వే చేపించి, ప్రభుత్వ హద్దులను గుర్తించారు. అనంతరం ఆక్రమణ ఫెన్సింగ్‌ను జేసీబీ ద్వారా తొలగింపు చేపించారు. తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్ మాట్లాడారు.ఈ భూమిని గతంలో ఎస్సైన్‌మెంట్‌దారులకు వ్యవసాయం చేసేందుకు ప్రభుత్వం ఇచ్చినట్లు తెలిపారు. కానీ వారు వ్యవసాయం చేయకపోవడంతో ప్రభుత్వం వెనక్కి తీసుకుందన్నారు. కావున ఇది ప్రభుత్వ భూమేనని ఎంతటివారైన ఆక్రమించాలని చూస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఆఫీసర్లు (జీపీఓలు) పాల్గొన్నారు.

## టపాసుల దుకాణాలకు అనుమతులు తప్పనిసరి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మున్సిపాల్టీలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే యజమానులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కమీషనర్ బి.నాగరాజు తెలిపారు. దీపావళి పర్వదినం సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే యజమానులు ఈ నెల 17వ తేదీ సాయంత్రం 4గంటలలోగా మున్సిపాల్టీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, ఇంటి పన్ను రసీదు జిరాక్స్, నల్లా పన్ను రశీదు, ఆధార్, పాన్ కార్డు జిరాక్స్, సెల్ఫ్ డిక్లరేషన్ ఫామ్, షాపు ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు 2, నక్ష కాపీలు 3లతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మున్సిపాల్టీ నిబంధనలను యజమానులు తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు.

## ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు తయారు చేయాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రామవరం నేతాజీ క్యాంపస్‌లో నిర్మించిన హాస్టల్ భవన సముదాయం పూర్తిగా అందుబాటులోనికి వచ్చేందుకు ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు తయారు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. వందమంది విద్యార్థుల కోసం నిర్మించిన ఈ భవనం పూర్తిగా అందుబాటులోకి వచ్చేందుకు బిసి సంక్షేమాధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలకు కావాల్సిన చిన్నచిన్న మరమ్మత్తులకు స్కూల్ గ్రాంట్‌లు ఉపయోగించుకోవాలన్నారు. పాఠశాల అభివృద్ధిలో భాగంగా పచ్చదనం ఉట్టిపడేలా ఏపిపిసి స్వచ్ఛ మిత్రులతో ఎప్పటికప్పుడు మొక్కలు నాటాలన్నారు. పాఠశాల స్థలానికి సంబంధించి హద్దులు నిర్మించి పెన్సింగ్ ఏర్పాటు చేసేలా చూడాలని తహశిల్దార్‌కు సూచించారు. జిల్లా బిసి సంక్షేమాధికారి విజయలక్ష్మి, ఎస్సీ సంక్షేమాధికారి శ్రీలత, బిసి గురుకుల ఆర్సిఓ రాంబాబు, జిల్లా విద్యాశాఖ కో ఆర్డినేటర్లు సతీష్ కుమార్, సైదులుతో పాటు రాజగోపాల్, ద్రౌపది పాల్గొన్నారు.

## వైరా మున్సిపాలిటీలో 14 జీవో మాయ

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో 14 జీవో అడ్డగోలు నియామకాలు జరిగాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా ఎవరు నచ్చితే వారిని 14 జీవోలో పెట్టుకోవడం ఇప్పుడు వైరాలో ఒక సాంప్రదాయంగా మారింది. ఎన్నో సంవత్సరాల నుంచి చేస్తున్న వారికి 14 జీవోలో చోటు లేదు కాని ఇటీవల కాలంలో వైరా మున్సిపాలిటీలో ఏర్పడిన తర్వాత చేరిన కొత్తవారికి కాసుల వర్షం కురిపించిన వారికి 14 జీవోలో చేర్చారు అనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. వైరా మున్సిపాలిటీలో పని చేయకుండా పక్క మండలాల్లో వేరే ప్రాంతాల్లో నుండి వచ్చిన వారికి సైతం 14 జీవోలో స్థానం కల్పించారు. కాని సోమవారం పంచాయతీ నుండి పనిచేసిన వారికి 14 జీవోలో స్థానం లేదు. డబ్బు కొట్టు, 14 జీవో నిబంధనలు ఏమిటి? నిబంధనలోని అంశాలు ఏమిటి? 14 జీవోలో ఏమి ఉంది. ఆ నిబంధనలో అమలు అయ్యాయా అనేది ఒక్కసారి ఆలోచిస్తే వైరా మున్సిపాలిటీలో జరిగిన 14 జీవో మాయాజాలం బయటకు వస్తుంది. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని వైరా మున్సిపాలిటీలో 14 జీవోలో ఎవరెవరు ఉన్నారు.

## ఆకస్మికంగా సందర్శించిన ఎస్పీ

**ప్రజాపక్షం/మణుగూరు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ మంగళవారం మణుగూరు పోలీస్ స్టేషన్‌ను అకస్మికంగా సందర్శించారు. గత కొద్ది కాలంగా మణుగూరు పోలీస్ స్టేషన్ మీద ఏసీబీ దాడులు జరగటం, ఒక సీఐ ఒక ఎస్సై జాడల్లో పట్టుబడటం, అదేవిధంగా మణుగూరులో పనిచేస్తున్న నలుగురు కానిస్టేబుళ్లు లంచాలు తీసుకున్నారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగిన క్రమంలో వారిని ఎస్పీ కారణంగా ఎటాచ్ చేసినట్టుగా సమాచారం. ఎస్పి మణుగూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ నిర్వహించారని తెలుస్తుంది. అదేవిధంగా తెలంగాణ డిజిపి ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండాలని సివిల్ మేటర్ లో పోలీస్‌లు తల దూర్చొద్దని హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా బాస్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ సందర్శించి సివిల్ మేటర్ల విషయంలో తగిన జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారని ఇందుకోసం అంతర్గతంగా మీటింగ్‌లు ఏర్పాటు చేసి హెచ్చరికలు జారీ చేస్తున్నారని తెలుస్తుంది.



# ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి

### కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** వానా కాలం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర జితేష్ వి పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర వేణుగోపాలరావుతో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 138177 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల అంచనా ఉందని అందులో సన్నరకం 202862 మెట్రిక్ టన్నులు కాగా, దొడ్డు రకం 35315 మెట్రిక్ టన్నులు ఉంటాయన్నారు. ఇందు కోసం 193 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి రూ.2389, బి గ్రేడ్ రకానికి రూ.2369 అందిస్తారని, సన్నాలకు అదనంగు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తారని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో మంచినీరు, టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, తూకపు పరికరాలు, గన్నీ కంచులు అందుబాటులో ఉంచాలన్నారు. రైతుల వద్ద ధాన్యం కొనేందుకు టోకెన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. పొరుగు రాష్ట్రాల నుండి ధాన్యం రాకుండే నివారించేందుకు సరిహద్దుల్లో ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి రుక్మిణి, మేనేజర్ త్రినాధ్ బాబు, డిసిఓ శ్రీనివాస్, బాబూరావు, వెంకటరమణ, మనోహర్, నరేందర్, ఆనందర రావు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## రహదారుల సమస్యకు పరిష్కారం

### ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వివిధ పథకాల్లో మంజూరైన నిధులతో నిర్మించిన గ్రామీణ ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులకు ప్రజలకు అందుబాటులోనికి రాగా, మరికొన్ని రహదారులు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇటీవల రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నియోజకవర్గానికి రూ.10.62 కోట్ల నిధులు మంజూరయ్యా యి. నియోజకవర్గంలోని పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, మండలాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఈ నిధులతో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం జరగనుంది. అంతర్గత రహదార్లు, డ్రైన్లు, విద్యుత్ సౌకర్యం తాగునీటి వంటి వసతి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి దశలవారీగా పరిష్కరిస్తున్నామన్నారు. గడిచిన ఇరవై నెలల్లో గ్రా మీణ ప్రాంతాల్లో 80 శాతం రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశామని, తా జాగా రూ. 10.62 కోట్లతో మిగిలిన పనులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామన్నారు. త్వరలో శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కూనంనేని తెలిపారు.

## ఎమర్జెన్సీ వాహనాల తనిఖీ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎమర్జెన్సీ సేవల వాహనాలను జిల్లా ఎమర్జెన్సీ సేవల అధికారి దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. మంగళవారం 108 ఎమర్జెన్సీ వాహనాన్ని, 1962 (పశు సంచార) వాహనం, 102 (తల్లి బిడ్డ, అమ్మ ఒడి) వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల పనితీరు, రోజు వారి కేసుల సంఖ్య, రికార్డులను ఎమర్జెన్సీ సేవల అధికారి దుర్గాప్రసాద్ పరిశీలించారు. 108 ఉద్యోగులు ఎమర్జెన్సీ సమయంలో గోల్డెన్ అవర్ తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.

## బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలి



**ప్రజాపక్షం/వైరా:** బెస్ట్ అవైలబుల్ స్కీమ్ క్రింద తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 238 ప్రైవేటు విద్యా సంస్థల్లో 3000 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుతున్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీం పథకం 20 సంవత్సరాల నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అమలవుతుంది. గత రెండు సంవత్సరాల నుండి రాష్ట్ర ప్రభుత్వం రూ.180కోట్లు చెల్లించకపోవడంతో ప్రైవేటు విద్యాసంస్థల అసోసియేషన్ విద్యార్థులను పాఠశాలకు రాకుండా నిలుపుదల చేశారని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం వైరాలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 16వ తేదీన జరుగు క్యాబినెట్ సమావేశంలోపు బకాయిలు విడుదల చేయకపోతే 17వ తేదీ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన కార్యక్రమం చేపడతారని, అనంతరం అక్టోబర్ 20వ తేదీ తర్వాత ముఖ్యమంత్రి కార్యాలయాన్ని పెద్ద ఎత్తున విద్యార్థులు, తల్లిదండ్రులు ముట్టడి చేస్తారని ఆయన తెలిపారు. దళిత, గిరిజన విద్యార్థులను ప్రభుత్వం విద్య నుంచి దూరం చేయకుండా వెంటనే చర్యలు చేపట్టి పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## విశ్వవిద్యాలయం అభివృద్ధి అందరి బాధ్యత

### కెయు వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** విశ్వవిద్యాలయం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగాస్వాములు కావాలని అప్పుడే అగ్రగామిగా నిలుస్తామని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక యూనివర్శిటీ పిజి కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలను కలియతిరిగి కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, తరగతి గదులు పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న భోదనా తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది, అధ్యాపకులు సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థులు పోటీప్రపంచంలో ధీటుగా నిలిచేందుకు పరిశోధనాత్మకమైన విద్యను అందించాలన్నారు. అప్పుడే వారు సమాజాభివృద్ధిలో కీలకంగా మారుతారన్నారు. అప్పుడే వారితో పాటు విశ్వవిద్యాలయాలకే కేయూ తలమానికగా నిలుస్తుందన్నారు. ఇందుకు ప్రతిఒక్కరూ గురుతరబాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈసందర్భంగా కళాశాల సమస్యలు, కోర్సుల తీరు, విద్యార్థులు, సిబ్బంది వివరాలను ప్రిన్సిపాల్ డాక్టర్ చేకూరి రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అవసరాల మేరకు కళాశాలలో మౌలిక సదుపాయాలతో పాటు కంప్యూటర్ ల్యాబ్‌ను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దుతానన్నారు. ఆయన వెంట పర్సనల్ అసిస్టెంట్ రవి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, లైబ్రెరియన్ వెంకటనర్సయ్య, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.



## కౌలు రైతుకు తప్పని కష్టం

### వరి పైనే ఆశలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రకృతి వైపరీత్యాలు కౌలు రైతుల పాలిట శాపాలుగా మారాయి. వరుసగా నాలుగేళ్ల నుంచి నష్టాలు, కష్టాలు తప్ప ఒరిగింది ఏమి లేదు. పంట నష్టపోతే పరిహారం భూయజమానులకు అందుతుంది తప్ప కౌలు రైతులకు ప్రభుత్వ పరంగా కనీస ఆర్థిక సాయం అందడం లేదు. వ్యవసాయ రంగంలో చోటు చేసుకున్న మార్పులలో భాగంగా కౌలు రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వ్యవసాయ రంగంలో ఇప్పుడు కౌలు రైతుల సంఖ్య రాష్ట్రంలో సగం జిల్లాల్లో సగానికి ఎక్కువే. ప్రభుత్వ లెక్కల ప్రకారమే కౌలు రైతుల సంఖ్య 38 శాతం. పెరిగిన పట్టణీకరణ నేపథ్యంలో 10 ఎకరాల ఆసామి ఎవరు గ్రామాల్లో ఉండి వ్యవసాయం చేయడం లేదు. జామాయిల్, సుబాబులు, పామాయిల్ లాంటి దీర్ఘకాలిక పంటల వైపు దృష్టిసారిస్తున్నారు. గతంలో పంటలు పండిన తర్వాత కౌలు చెల్లించే పద్ధతి ఉండేది. నమ్మకాలు కోల్పోతున్న వేళ ముందస్తు చెల్లింపులు వచ్చాయి. కౌలు చెల్లిస్తేనే భూమిలోకి దిగి వ్యవసాయ పనులు ప్రారంభించే పరిస్థితి ఏర్పడింది. ముందుగా డబ్బులు చెల్లించి పత్తి, మిర్చి, అపరాలు, మొక్కజొన్న మొదలైన పంటలను సాగు చేస్తే గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రకృతి సహకరించక దిగుబడి రాకపోవడం అతివృష్టి లేదా అనావృష్టిలో పంటలు దెబ్బతీనడం జరుగుతుంది. ఈ ఏడాది ఎకరానికి రెండు మూడు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. ధర కూడా అంతంత మాత్రమే. ఈ ఏడాది కౌలుకు తీసుకుని పత్తి సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పటికే చెల్లించిన కౌలు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెసర, మినుములు మొదలైన అపరాల పంటలు ఈ ఏడాది కోసే పరిస్థితి లేదు. ఈ ఏడాది కౌలు రైతుల ఆశలు మాగాణిపైనే. ఇప్పటి వరకు ఫర్వాలేదనిపిస్తున్న కోతలకు వచ్చే ముందు అనుకూల వాతావరణం లేకపోతే మా గాణికి ఇబ్బందులు తప్పకపోవచ్చు. కౌలు రై తుల పరిస్థితి ఇ బ్బందికరంగా మారింది. అ ప్పుల ఊబిలోకి కూ రుకుపోయి చివరకు పట్టణాల్లో రోజు వారి కూ లీలుగా మారిపోతున్నా రు. ప్రభుత్వం ఇప్పటికైనా కౌలు దారి చట్టాన్ని అమల్లోకి తెచ్చి కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## మట్టిలో మాణిక్యం..

### పుట్ బాల్ జట్టుకు ఎంపికైన బూర్గంపాడు యువతి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఓ సాధారణ వ్యవసాయం కుటుంబంలో పుట్టి స్థానికంగా చదివి, ఐదవ తరగతి నుండి పాల్వంచ మండలంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు చదువును ప్రారంభించి, చిన్నప్పటి నుంచే ఆటలపై మక్కువతో చదువుతో పాటు ఆటల్లో కూడా రాణిస్తూ తన ప్రతిభను చాటేది. తన ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయులు తల్లిదండ్రుల అనుమతితో ఏడవ తరగతి నుండి మెదక్ జిల్లా స్పోర్ట్స్ అకాడమీలో చేర్పించారు. అక్కడ స్పోర్ట్స్ అకాడమీలో చదువుతో పాటు ఆటలలో మెరుగుగా రాణిస్తూ తన గురువు ప్రకాష్ నేతృత్వంలో పుట్ బాల్‌లో మెలకువలను నేర్చుకుని, ఆల్‌రౌండర్‌గా ప్రతిభను చాటుతూ వచ్చింది. పుట్ బాల్‌లో ఎక్కువగా డిఫెన్స్‌కి ప్రాధాన్యతనిస్తూ తన జట్టు గెలుపులో కీలక భూమిక పోషిస్తూ వచ్చేది. ఈ క్రమంలోనే రాష్ట్ర స్థాయి అండర్ 19 పుట్ బాల్ మహిళా జట్టులో ఎంపికై బూర్గంపాడు గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చింది. రాష్ట్ర స్థాయి జట్టులోఏ ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు మండల ప్రజలు ప్రతి ఒక్కరు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలుపుతున్నారు.

### నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్న యువతిపై ప్రత్యేక కథనం

బూర్గంపాడు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన మేక పూర్ణం కుమార్తె మేక సృజన చిన్నప్పటి నుంచి చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలనే పట్టుదలతో పక్క గ్రామంలోని మోరంపల్లిబంజర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి వరకు చదువుకొని ఐదవ తరగతిలో పాల్వంచలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో సీటు రావడంతో అక్కడ తన చదువుని ప్రారంభించింది. అక్కడి గురువుల ప్రోత్సాహంతో చదువుతో పాటు ఆటల్లోనూ మంచి ప్రతిభ చాటడంతో ఆమెను స్పోర్ట్స్ పాఠశాల పోటీ పరీక్షకు సెలెక్ట్ చేయడంతో మెదక్ జిల్లా స్పోర్ట్స్ అకాడమీలో ఏడవ తరగతిలో ఆమెకు సీటు రావడంతో అక్కడే తన చదువును కొనసాగిస్తూ స్పోర్ట్స్‌లో మరింతగా రాణిస్తూ ముఖ్యంగా పుట్ బాల్ క్రీడలో తన గురువు ప్రకాష్ తోడ్పాటును అందించడంతో రాష్ట్ర స్థాయి అండర్ 19 పుట్ బాల్ జట్టులో స్థానం సంపాదించగలిగానని తెలిపారు. తన లక్ష్యం భారతీయ పుట్ బాల్ మహిళా జట్టులో చోటు దక్కించుకొని తన ప్రతిభను చాటాలని పేర్కొంటుంది. తన తల్లిదండ్రులు ఇద్దరు వ్యవసాయం చేస్తున్నారని, తనకు ఒక చెల్లి ఉందని ఆమె ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతుందని, తన వంతుగా భారతదేశానికి పేరు ప్రఖ్యాతలు తేవాలనే సంకల్పంతో పాటు తల్లిదండ్రులకు ఒక గుర్తింపు తేవాలని ఆశిస్తున్నానని తెలిపారు. ఆమె నెరవేరాలని రాష్ట్రంతో పాటు దేశానికి పేరు తెచ్చే విధంగా మరింత ఉన్నత స్థానంలో ఎదగాలని ఆశిద్దాం.

## ఆస్తి పంపకం... అన్నదమ్ములు ఘర్షణ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఒక ఆస్తి కోసం ఇద్దరు అన్నదమ్ముల మధ్య విభేధాలు. ఎటు చెప్పలేని తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపణ. ఆస్తి పంపకం కాస్త ఇల్లు దాటి, రాజకీయ నాయకుల చేతుల్లోకి వెళ్లింది. ఖమ్మంలో ఇప్పుడు ఈ సమస్య శాంతి భద్రతల సమస్యగా మారిపోయింది. అంతే కాదు సోషల్ మీడియాలో ఆరోపణలు, ప్రత్యారోపణలతో వేడెక్కిస్తున్నారు. ఒక రాజకీయ పార్టీలోని అంతర్గత వ్యవహారాలతో పాటు మరో రాజకీయ పార్టీ ప్రేరేపిస్తుందన్న ఆరోపణలు సోషల్ మీడియాలో చోటు చేసుకుంటున్నాయి. చివరిగా ఖమ్మం కార్పోరేషన్‌కు చెందిన ఓ కార్పొరేటర్ ఆమె భర్త ఆందోళనలు, అరెస్టుల వరకు దారి తీసింది. ఈ ఆస్తి వ్యవహారం దాడులకు, రాజకీయ ఆరోపణలకు దారి తీయడంతో పాటు నగరంలో సర్వత్రా చర్చకు ఎందుకు దారితీస్తుందన్న అంశంలోకి వెళితే... చేకూరి సత్యంబాబు ఖమ్మం నగరంలో ధనవంతులలో ఒకరు. పలు వ్యాపారాలను నిర్వహించే వారు. చిట్‌ఫండ్స్, హోటల్స్, జిన్నింగ్ మిల్లులు కూడా ఉన్నాయి. ఆయనకు శ్రీధర్, చంద్రశేఖర్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. విశేషం ఏమిటంటే శ్రీధర్‌కు ఒక రాజకీయ పార్టీకి చెందిన కుటుంబంతో బంధుత్వం ఉంటే చంద్రశేఖర్ ది అదే పరిస్థితి. ఇద్దరి మధ్య ఆస్తి పంచాయతీని తొలుత వామపక్షానికి చెందిన ప్రధాన నాయకుడు పరిష్కరించాడు. చిన్నవాడైన చంద్రశేఖర్‌కు రూ. 100 కోట్ల మేర ఆస్తి అప్పగించాలని తీర్పు చెప్పాడు. ఆ తీర్పును కాదంటూ శ్రీధర్ వేరే వారిని ఆశ్రయించాడు. ఈ క్రమంలోనే వారి ఇండ్లపై దాడులు, ప్రతిదాడులు చోటు చేసుకున్నాయి. తన మాట వినని చోట తాను తిరిగి మాట్లాడబోనని నేను చెప్పిన తీర్పును అమలు చేస్తే సరి లేదంటే ఆ విషయం నాకు చెప్పవద్దంటూ వామపక్ష నేత తన పెద్దరికాన్ని కాపాడుకున్నట్లు సమాచారం. ఇక ఈ పంచాయతీలోకి చాలా మంది తలదూర్చారు. చంద్రశేఖర్‌కు బంధువులైన డోర్నకల్‌కు చెందిన ఒక లిక్కర్ వ్యాపారి తన దందాతో ఖమ్మంలో చంద్రశేఖర్‌కు అనుకూలంగా భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు. రెండు మూడు రోజుల క్రితం డోర్నకల్‌కు చెందిన కొందరు తమపై దాడికి యత్నించారని కార్పొరేటర్ మంజుల ఆమె భర్త మిక్కిలినేని నరేంద్ర ఆందోళనకు దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక ఆ తర్వాత నుంచి సోషల్ మీడియాలో యుద్ధం ప్రారంభమైంది. మిక్కిలినేని నరేంద్ర సెటిల్‌మెంట్ గ్యాంగ్ నడుపుతున్నాడని అతన్ని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కొందరు పోస్టింగులు పెడుతూ ఆయన ప్లాట్లు రాయించుకున్నాడని ఆరోపణలు చేస్తుండగా మరో పక్క దీని వెనక బిఆర్ఎస్ హస్తం ఉందని లిక్కర్ వ్యాపారి గ్యాంగులను కొందరు ప్రోత్సహిస్తున్నారంటూ మాజీ మంత్రిని కూడా ఈ వివాదంలోకి లాగే ప్రయత్నం చేస్తున్నారు. ఒక ఆస్తి, ఇద్దరు అన్నదమ్ముల పంచాయతీ ఇప్పుడు పోలీసులకు, రాజకీయ నాయకులకు కూడా ఇబ్బంది కరంగా మారింది. సిఎంవో నుంచి పోలీసుల పై ఒత్తిడి తీసుకు వస్తున్నారని ఆరోపిస్తూ పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని కార్పొరేటర్ మంజుల బహిరంగంగానే ఆరోపించారు. ఇదిలా ఉండగా వివాదరహితుడిగా ఎటువంటి పంచాయతీలోనూ తలదూర్చని పెద్దమనిషిగా పేరున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సైతం ఈ వివాదంలోకి లాగుతూ మిక్కిలినేని నరేంద్రను మంత్రి అనుచరుడిగా చిత్రీకరిస్తూ విమర్శలు చేస్తున్నారు. ఇప్పుడు ఖమ్మంలో ఇద్దరు అన్నదమ్ముల ఆస్తి వివాదం శాంతి భద్రతల సమస్యగా మారింది. కొన్ని రాజకీయ పార్టీలు ఏటో ఒకవైపు మద్దతుగా నిలిచి అనుకూల వ్యతిరేక ప్రకటనలు చేస్తున్నాయి. అటు పోలీసులను ఇటు రాజకీయ నాయకులను భాగస్వాములను చేస్తూ ఒక రగడగా మారిన పరిష్కారం ఎప్పుడు లభిస్తుందో చూడాలి. ఇద్దరు అన్నదమ్ముల ఆస్తి వ్యవహారం ఒక ప్రధాన సమస్యగా మారిన ఈ ఆస్తి వివాదం ఏ పరిస్థితికి దారి తీస్తుందో వేచి చూడాలి.



## కృషి విజ్ఞాన కేంద్రంలో రైతు సదస్సు




**ప్రజాపక్షం/వైరా:** కృషి విజ్ఞాన కేంద్రం వైరా నందు వ్యవసాయ కళాశాల అశ్వారావుపేట విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణిదేవి, కృషి విజ్ఞాన కేంద్రం వైరా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి.సుచరితాదేవి, వైరా డివిజన్ సహాయ సంచాలకులు కరుణశ్రీ, వ్యవసాయ కళబూశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు కృష్ణతేజ, శిరీష, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వి.చైతన్య, డాక్టర్ టి.పావని, ఫణిశ్రీ పాల్గొన్నారు. అదేవిధంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి.సుచరితదేవి మాట్లాడుతూ కెవికె ద్వారా రైతాంగానికి అందుతున్న నూతన సాంకేతిక వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయ యూనివర్శిటీ నుంచి విడుదలవుతున్న కొత్త వంగడాలు, పంటను కాల్చకుండా వ్యవసాయ వ్యర్థాలను నేలలో కలియదున్నేలా చూసుకొని భూమి యొక్క సారాన్ని పెంపొందించుకోవాలని వివరించడం జరిగింది. వైరా వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు కరుణశ్రీ మాట్లాడుతూ ప్రస్తుతం వరి, మిరప పంటలో ఆశిస్తున్న చీడపీడలు వాటి సస్యరక్షణ రైతులు అధిక మొత్తంలో వాడుతున్న యూరియా వాడకాన్ని తగ్గించడం, ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం విద్యార్థిని, విద్యార్థులు, వివిధ గ్రామాల్లో వారు నేర్చుకున్న అనుభవాలు, కెవికె ద్వారా రైతులకు వివరించారు. వివిధ కంపెనీల మేనేజర్లు, వ్యవసాయ విద్యార్థిని, విద్యార్థులు, శాస్త్రవేత్తలు, రైతు సోదరులు, సోదరీమణులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రింట్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నరకాసుర వధ ఉత్సవ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్:** ఈనెల 19న జరిగ ఉత్సవాలు తిలకించడానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం నరకాసుర వద ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో హన్మకొండ రాంనగర్‌లోని మంత్రి నివాసంలో నరకాసుర వద ఉత్సవ పోస్టర్లను మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పూర్వంలో జరిగిన సంఘటనలు నేటి తరానికి తెలియచేయడానికి దీపావళి పండుగ సందర్భంగా నరక చతుర్దశి రోజు నరకాసుర వద ఉత్సవాలు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

ప్రతీ వ్యక్తి దైవభక్తి కలిగి ఉండాలని అలాంటప్పుడే సమాజం ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో నరకాసుర వద ఉత్సవ కమిటీ ప్రతినిధి మరుపల్ల గౌతమ్, ఆవునూరి రామ్మూర్తి, దూడ బాలకొమురెల్లి, వనం మధు, శెట్టి మోహన్, టంటం నర్సింహా, కుండె రాజు, ఆవునూరి అయిలేశం, మరుపల్ల శివ, కాటం సతీష్ ఉన్నారు.

# జాతీయ ఎస్‌టి కమిషన్‌ను కలిసిన సురేందర్

**ప్రజాపక్షం/ములుగు:** ఆదివాసీ నాయకుడు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ జాతీయ ఎస్‌టి కమిషన్‌ను మంగళవారం కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ మహా జాతరను పురస్కరించుకొని మేడారం మహా జాతరలో ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా సమ్మక్క సారలమ్మకు ఆడబిడ్డ అయినా ఆదివాసీ నాయకపోడ్ కులదైవం ఆరాధ్య దైవమైన లక్ష్మీ దేవరా ప్రతి మేడారం మహా జాతరకు జంపన్న వాగులో స్నానం ఆచరించి అనంతరం సమ్మక్క సారలమ్మ గద్దెలను ఆదివాసీ నాయకపోడు ఆచార సంస్కృతి సాంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించి అనంతరం లక్ష్మీ దేవర్లు చెట్టుకు పుట్టకు ఎక్కడపడితే అక్కడ దేవర్లకు ఒక స్థానం అంటూ లేకుండా జనవాసంలో తొక్కుటలో ఉండడం జరుగుతుందని, దీని వలన ఆదివాసీ నాయకపోడ్ కులస్తులకు కీడు సంభవించే అవకాశం ఉందని ఆదివాసీ నాయకపోడ్ కులస్తులు పెద్దలు భావిస్తున్నారన్నారు. గట్టమ్మ దేవాలయానికి కావాల్సిన నిధులను వెంటనే రిలీజ్ చేయాలని కోరారు.

# డిసిసి అధ్యక్షుల నియామకానికి హాజరైన ఎఐసిసి పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్

హన్మకొండ డిసిసి అధ్యక్షుడిగా ఇనుగాల వెంకట్రాంరెడ్డిని నియమించాలని వినతి



**ప్రజాపక్షం/ఆత్మకూరు:** డిసిసి అధ్యక్షుల నియామ కార్యక్రమానికి ఎఐసిసి పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్ హాజరయ్యారు. పిసిసి పరిశీలకుడు దుర్గం భాస్కర్, పరకాల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ తరపున పరకాల కాంగ్రెస్ కార్యకర్తలను తన కుటుంబ సభ్యులుగా ఏ ఆపద వచ్చినా కష్ట సుఖాల్లో తోడుగా ఉంటూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ గత 20 ఏళ్ల నుంచి పార్టీ బలోపేతం కోసం మండల కమిటీలు, గ్రామ కమిటీలు వేస్తూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకరావడం కోసం తన వంతు కృషి ఎంతో చేశారు. గత పదేళ్ల నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా వ్యహరిస్తూ పార్టీ ఆదేశించిన ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. కావున మాజీ పరకాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరంగల్ కుడా ఛైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న ఇనుగాల వెంకట్రాంరెడ్డిని హన్మకొండ జిల్లా డిసిసి అధ్యక్షునిగా నియమించాలని పరకాల యుజన కాంగ్రెస్ నుంచి కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల యూత్ అధ్యక్షుడు సందీప్, దామెర మండల యూత్ అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి శివకుమార్, వినోద్, రమేశ్, ప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన సిపి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** నేడు కాజీపేటలోని పిజిఆర్ గార్డెన్‌లో జరిగే నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దశదిన ఖర్మ కార్యక్రమానికి సిఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. దీంతో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం జిల్లా అధికారులతో కలసి పర్యటన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనపై తీసుకోవాల్సిన చర్యలపై పలు సచనలు చేశారు.

# ఒక్క సిసి కెమెరా వంద మందితో సమానం

వర్ధన్నపేట ఎసిపి అంబటి నర్సయ్య



**ప్రజాపక్షం/రాయపర్తి:** ఒక్క సిసి కెమెరా వంద మంది పోలీసులతో సమానమని వర్ధన్నపేట ఎసిపి అంబటి నర్సయ్య అన్నారు. మంగళవారం మైలారం గ్రామంలో దాతల సహకారంతో ఏర్పాటుచేసిన సిసి కెమెరాలను ఎసిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సిసి కెమెరాల ఏర్పాటుతో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ, అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా నివారించవచ్చన్నారు. నేరాలు జరిగినపుడు నేరస్థులకు శిక్షణ పడానికి సిసి కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. దాతల సహకారంతో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషమన్నారు. మైలారం గ్రామం వలే మండలంలోని అన్ని గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట సిఐ శ్రీనివాసరావు, ఎస్సై రాజేందర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. మంత్రి పర్యటనపై తీసుకోవాల్సిన చర్యలపై పలు సచనలు చేశారు.

# ములుగు డిసిసి అధ్యక్షుడి ఎన్నిక

ఎఐసిసి పరిశీలకుడు జాన్సన్ అబ్రహం

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** ఈ రోజు రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అదేశాల మేరకు ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి పిఎస్‌ఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ అధ్యక్షతన జరిగిన ములుగు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుల ఎన్నిక కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా హాజరైన ఎఐసిసి అబ్జర్వర్ జాన్సన్ అబ్రహం ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ డిసిసి అధ్యక్షుల ఎన్నిక కు అధిస్థానం ప్రత్యేక కార్యచరణ రూపొందించిందని ఎఐసిసి పరిశీలకులు జాన్సన్ అబ్రహం అన్నారు. పదేళ బిఆర్ఎస్ పాలనలో పార్టీ కోసం ఎంతో కష్టపడి పోరాటాలు చేసిన కార్యకర్తలు నాయకులకు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యత ఇచ్చి బాధ్యతాయతమైన పదవులు ఇస్తుందన్నారు డిసిసి అధ్యక్ష పదవికి అసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరించారు డిసిసి ఎంపిక పారదర్శకంగా ఉంటుందని ఎవరైనా డిసిసి పోటిలో వుండవచ్చని ఈ ప్రక్రియలో ఎలాంటి లాబియింగా ఉండదని స్పష్టం చేశారు అధిష్టానం నిర్ణయమే తుది నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఓబిసి మహిళా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేసేదిశగా క్రుషి చేస్తుందన్నారు పార్టీ కోసం కష్టపడేవారని గుర్తించడంతో పాటు సమర్దులైన నాయకులను ఎంపిక చేస్తామన్నారు డిసిసి అధ్యక్ష పదవికి నామినేషన్ ఎఐసిసి అబ్జర్వర్ జాన్సన్ అబ్రహం అందించిన ప్రస్తుత జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి మల్లాడి రామ్ రెడ్డి, గొల్లపల్లి రాజేందర్ గౌడ్, ఇర్సవడ్ల వెంకన్న, సూరపనేని నాగేశ్వర్ రావు, చిడం రామ్మోహన్ రావు, లు నామినేషన్ వెయ్యడం జరిగింది అనుబంధ సంఘాల అధ్యక్షులు జిల్లా సినియర్ నాయకుల అభిప్రాయలను తీసుకోవడం జరిగింది అనంతరం అయిన మాట్లాడుతూ నాయకుల దగ్గర తీసుకున్న అభిప్రాయాలను టిపిసిసికి పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసి పరిశీలకులు సాగరికరావు నాగేందర్ రెడ్డి, తో పాటు జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ ,ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణితో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లాబ్లాక్‌మండల గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# కష్టపడిన వారికే పార్టీలో పదవులు

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హనుమకొండ :** కష్ట పడిన వారికే కాంగ్రెస్ పార్టీలో పదవులు దక్కుతాయని రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన "సంఘటన్ సృజన్ అభియాన్" కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎఐసిసి పరిశీలకులు నవ జ్యోతి పట్నాయక్‌తో కలిసి పాల్గొన్న రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పునర్నిర్మాణం, పార్టీ బలోపేతం దిశగా కార్యకర్తలు, నాయకుల సమిష్టి అభిప్రాయాల ఆధారంగా అధ్యక్షుడిని పారదర్శకంగా ఎంపిక చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. జిల్లా అధ్యక్షుడి ఎంపికలో అందరి అభిప్రాయాలను గౌరవించి, పార్టీ ఐక్యతను బలపరుస్తూ ముందుకు సాగుతామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం ద్వారా క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ నాయకులు, పార్టీ ప్రతినిధుల అభిప్రాయాలతోనే డిసిసి అధ్యక్షుడి నియామకంపై ఎఐసిసి నేతృత్వంలో టిపిసిసి ఆధ్వర్యంలో తుది నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పునర్నిర్మాణం, పార్టీ బలోపేతం దిశగా కార్యకర్తలు, నాయకుల సమిష్టి అభిప్రాయాల ఆధారంగా అధ్యక్షుడిని పారదర్శకంగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడి ఎంపికలో అందరి అభిప్రాయాలను గౌరవించి, పార్టీ ఐక్యతను బలపరుస్తూ ముందుకు సాగుతామని తెలియజేసారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు తప్పకుండా పదవులు వస్తాయని ఎంపి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, నగర కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/పరకాల :** అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం పరకాల పట్టణ కేంద్రంలోని లలితా కన్వెన్షన్ లో స్థానిక శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో ఎఐసిసి అబ్జర్వర్ నవజ్యోతి పట్నాయక్, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలోకి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు పారదర్శకంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పార్టీ కోసం నిజాయితీగా కష్టపడి పనిచేసిన అర్హులకు అవకాశాలు లభిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయి నాయకులు, మండల, పట్టణ డివిజన్ సమన్వయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఫ్రంటల్ ఆర్గనైజర్స్ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, మాజీ కౌన్సిలర్లు,వార్డు, గ్రామ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ:** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచి, ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. మంగళవారం హనుమకొండ జిల్లా నడికుడ మండలం రాయపర్తిలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, రెండు అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠ్యాంశాలకు సంబంధించి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి అభ్యసన స్థాయిలను పరీక్షించారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం అమలు తీరు గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం గురించి కలెక్టర్ అడిగి తెలుసుకుని వంట గదులను పరిశీలించి మెనూ గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతిని మరింత మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు అందిస్తున్న మెనూ చార్ట్ ను జిల్లా కలెక్టర్ అంగన్వాడీ టీచర్లను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు అందిస్తున్న కార్యక్రమాలను గురించి ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని వంట గదులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖ అధికారి వాసంతి, తహసీల్దార్ రాణి, మండల విద్యాశాఖ అధికారి హనుమంతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల స్వామి, భరత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వోల్వో శిక్షణ

ఏరియా జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** సింగరేణి కోలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకుల అభివృద్ధి దిశగా మరో కొత్త కార్యక్రమాన్ని చేపట్టినట్లు భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. వోల్వో డంప్ ట్రక్కు ఆపరేటర్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.ఈ శిక్షణకు పదవ తరగతి ఉత్తీర్ణులు, కనీసం మూడు సంవత్సరాల హెవీ వాహనాల డ్రైవింగ్ అనుభవం కలిగి, హెవీ గూడ్స్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న నిరుద్యోగ యువకులు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని ముఖ్యంగా సింగరేణి ఉద్యోగుల పిల్లలు, మాజీ ఉద్యోగుల పిల్లలు, పరిసర గ్రామాల ప్రజలు, భూ నిర్వాసితులు వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి బ్యాచ్‌లో 60 మందికి మూడు నెలలపాటు శిక్షణ అందించబడుతుందని జీఎం తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు 18 నుండి 35 సంవత్సరాల వయస్సు మధ్య ఉండాలని చెప్పారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన సంవత్సరం, మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని వివరించారు.అలాగే, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సడలింపులు, వయస్సు మినహాయింపులు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఏ విధమైన స్టైపెండ్, భృతి ఇవ్వబడదని స్పష్టం చేశారు. శిక్షణ పూర్తిగా వారి సొంత బాధ్యతపై, స్వయంగా ఖర్చులతో కొనసాగించవలసి ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను అక్టోబర్ 10లోపు సంబంధిత ఎంవీటీసీ (మైన్ వోకేషనల్ ట్రైనింగ్ సెంటర్) వద్ద సమర్పించాలని సూచించారు. ఈ శిక్షణ ద్వారా స్థానిక యువతకు తగిన సాంకేతిక నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, భవిష్యత్తులో మరిన్ని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు సింగరేణి చేపడుతుందని జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి తెలిపారు.

# దొంగల ముఠా అరెస్టు.. ఆభరణాలు స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఎసిపి రవీందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట నియోజకవర్గంలోనిపలు గ్రామాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను నర్సంపేట పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుండి 2.2 తులాల బంగారం, 38 తులాల వెండి, ఐదు సెల్ ఫోన్లు, ఒక ఆటో, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకోని, ఆ ముఠాను రిమాండ్ కు తరలించినట్లు నర్సంపేట ఎసిపి రవీందర్ రెడ్డితెలిపారు. నర్సంపేట పోలీస్ స్టేషన్ ఏర్పాటు విలేకరుల సమావేశంలో దొంగల ముఠా అరెస్టును చూపించారు. అనంతరం ఎసిపి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా చెందిన ఇమ్రాన్, మాదాసు భార్గవి, నవీన్‌లతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన బత్తుల రాజేశ్వరీ, కుంజ విజయలతో కలిసి రాత్రిళ్లు దొంగతనాలకు పాల్పడుతున్నారని, నర్సంపేట డివిజన్‌లో ఆగస్టు నెలలో ఖానాపురం మండలం బుధరావుపేటలో, సెప్టెంబర్ నెలలో నర్సంపేట పట్టణంలోని పాకాల రోడ్డులో గల ఓ నగల షాపులో దొంగతనానికి పాల్పడ్డారు. మరో రెండు దొంగతనాలు మహబూబాబాద్ పట్టణంలో చేసినట్లు చేశారు. దొంగతనాల్లో దోచుకున్న సొమ్ములో కొంత మేర అవసరానికి వాడుకున్నట్లు, మరికొంత ఆటో, ద్విచక్ర వాహనం కొనడానికి వాడుకున్నట్లు తెలిపారు. దొంగతనానికి పాల్పడిన వాటిలో రూ. 2లక్షల విలువ చేసే బంగారం, 38తులాల వెండి మొత్తం 4.30లక్షలు నిర్ధారించారు. వీటిలో రూ. 2.70లక్షల వరకు ఖర్చు చేయగా రూ. 1.30లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు.వారి వద్ద ఒక ఒక బైక్, ఆటో, మొబైల్ ఫోన్‌లు స్వాదీనం చేసుకోని ఐదుగురిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసిపి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు రవి కుమార్, గూడ అరుణ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తి నియోజకవర్గానికి మహర్దశ



**ప్రజాపక్షం/పాలకుర్తి:** పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి దిశగా మరో ముఖ్యమైన అడుగు పడింది. పా లకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని గిరిజన ప్రాం తాల అభివృద్ధి అంశాలపై పలు ప్రతిపాదనలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పా లకుర్తి నియోజకవర్గంలోని తండాలు, గూడాలకు బిటి రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. దానికి సంబంధించిన రూ.24కోట్ల 30లక్షల విలువైన ఉత్తర్వులను మంత్రి ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడు తూ నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాలకు అభివృద్ధి మార్గం ప్రారంభమైందని దీని వల్ల రవాణా సౌకర్యాలు మెరుగు పడతాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వివిధ మండల కేంద్రాల్లో బంజార భవనాల నిర్మాణానికి నిధు లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. మంత్రి నిర్ణయం నేపథ్యంలో పాలకుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి పట్ల కొత్త ఉత్సాహం నెలకొంది. గిరిజన ప్రాంతాల్లో సౌకర్యాల పెంపు, రోడ్ల నిర్మాణం, సామాజిక మౌలిక వసతుల కల్పన వంటి అంశాల్లో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి నిరంతరం కృషి మరోసారి స్పష్టమైందని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి దుద్దిళ శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/కాటారం:** మండలంలోని ఒడిపిలవంచ గ్రామానికి చెందిన ఇసునం లక్ష్మి పిడుగుపాటుకు గురై మృతి చెందగా వారి కుటుంబానికి మంగళవారం రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరామర్శించి ప్రగాఢ సానుభుతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరిత్యాల వల్ల ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. అలాగే బాధిత కుటుంబానికి అన్ని విధాల సహాయం అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. అనంతరం గుమ్మళ్లపల్లి గ్రామంలో పిడుగు పాటుకు గురై గాయపడిన బాధితులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపిపి పంతకాని సమ్మయ్య,మాజీ సర్పంచ్ కోడి రవి కుమార్, చీమల సందీప్,మూల నరోత్తం రెడ్డి,భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/జనగామ:** బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులకు విద్యాబోదనలో ఇ బ్బందులు కలగకుండా చూడాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లుభట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యకు సంబందించి మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విక్రమార్క మాట్లాడుతూ ఎలాంటి కారణాలతో ఆయా విధ్యార్థులకు విధ్యాభోదనలో ఆటకంకాలు కలిగించవద్దని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాకలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, డిఎస్‌డిఒ విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

# బురదమయంగా మారిన డ్రైనేజీ పైప్‌లైన్

సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రతినిధి బృందం సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌యుబి ని సందర్శించి నిరసన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ 2011లో 18 కోట్లతో ఆయుబి ఏర్పాటు చేసి మళ్లీ 2011లో రెండు కోట్ల 50 లక్షల వ్యవయంతో చేపట్టిన పనులు బిఆర్ఎస్ హయాంలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నదని ఆయన విమర్శించారు. ఆర్‌యుబిలో పగిలిన డ్రైనేజీ పైప్లైన్లు బురదమయంగా మారి వాహనాదారులకు పాదాచారులకు ఇబ్బందిగా మారిందన్నారు. ముఖ్యంగా వరద నీరు, బురద నీరు నిలిచి పగిలిన పైపుల ద్వారా వచ్చే లీకేజీల నీరు మొత్తం నిండడంతో కొత్త బజార్ నుంచి పాత బజార్, పాత బజార్ నుంచి కొత్త బజార్ కు రావాలన్నా, పోవాలన్నా నరక కూపంగా ఆర్‌ఓబి ఉందన్నారు. ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు ముఖ్యంగా ఆర్‌ఓబి నిర్వహణ ఎవరిది? అని డిమాండ్ చేశారు. ఆర్‌ఓబి రైల్వేదా? మున్సిపాలిటీ దా? ఎవరిదో తేల్చి చెప్పి మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఎత్తున నిరసన ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, దేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, జలగం ప్రవీణ్, నక్క నాగార్జున, గాదం శ్యాం ప్రసాద్, యాదవ్ రాగం, మల్లయ్య, వరికుప్పల వెంకన్న పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపి కావ్య



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని, అందుకే సంక్షేమ పథకాలన్ని మహిళల పేరు మీదనే అమలు చేస్తుందని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య తెలిపారు.స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జేసీ పింకేష్‌కుమార్‌లు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 256 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు వారు మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే డీఆర్డీఏ ఆద్వర్యంలో లబ్ధిదారులకు వ్యవసాయ మోటార్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేయడానికి రూ.22వేల 500 కోట్ల ఖర్చుతో 4లక్షల 50వేల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను చేపట్టిందన్నారు. ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అర్హత కల్గిన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే భాద్యత నాదని హామి ఇచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ఎన్నో సంక్షేమ ఫథకాలను అమలు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు మాతృనాయక్, హరికృష్ణ, వెంకన్న, ఎఎమ్‌సీ చైర్మన్ లావణ్య శిరీష్‌రెడ్డి, డీఈలు, ఏఈలు, ఎంపీడీవోలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## రంజీలు ఆడుతున్నప్పుడు వన్డేల్లో ఆడలేనా?

### చీఫ్ సెలెక్టర్‌పై షమీ ఆగ్రహం

ఒకప్పుడు భారత జట్టులో ప్రధాన బౌలర్ అయిన మహమ్మద్ షమీ ప్రస్తుతం గడ్డు కాలం ఎదుర్కొంటున్నాడు. మోకాలి సర్జరీ



తర్వాత కోలుకున్న అతడు పునరాగమనం కోసం నిరీక్షిస్తున్నాడు. రంజీలు, దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నా సరే సెలెక్టర్లు మొండి చేయి చూపించడంపై షమీ మండిపోతున్నాడు. అంతేకాదు స్క్వాడ్ సెలెక్షన్ ముందు తనను సంప్రదించామని, ఫిట్‌గా లేనందునే పక్కనపెట్టేశామని చెబుతున్న చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌పై షమీ ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'ఫిట్‌నెస్ విషయమై భారత జట్టు, ఛీఫ్ సెలెక్టర్.. ఎవరూ కూడా నన్ను సంప్రదించలేదు. నాకు నేనుగా ఫిట్‌నెస్ గురించి చెప్పడం సరికాదు. కెప్టెన్, కోచ్ నన్ను అడగాలి. నేను నాలుగు రోజుల మ్యాచ్‌లు ఆడగలిగినప్పుడు.. వన్డేలు ఆడలేనా?. ఒకవేళ నేను ఫిట్‌గా లేకపోతే గమ్మున నేషనల్ క్రికెట్ అకాడమీలో చేరేవాడిని. అంతేతప్ప.. రంజీ ట్రోఫీ కోసం సిద్ధమయ్యేవాడిని కాదు కదా' అని షమీ వెల్లడించాడు. త్వరలోనే ప్రారంభం కానున్న రంజీ ట్రోఫీలో షమీ బెంగాల్ తరఫున బరిలోకి దిగనున్నాడు. తమ జట్టు పేస్ దళంలోని ఆకాశ్ దీప్, ముకేశ్ కుమార్, ఇషాన్ పొరెల్‌తో కలిసి నిప్పులు చెరిగేందుకు రెఢీ అవుతున్నాడీ వెటరన్. 'దులీప్ ట్రోఫీలో షమీ ఆడినట్టు చెబుతున్నారు. కానీ, గత రెండు మూడేళ్లలో అతడు క్రికెట్ ఆడింది చాలా తక్కువ. అతడు మరికొన్ని మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది' అని చీఫ్ సెలెక్టర్ చెప్పాడు. దాంతో.. ఇక ఈ స్పీడ్‌స్టర్ ఇప్పట్లో భారత జెర్సీ వేసుకోవడం అసాధ్యమేనని సంకేతాలు ఇచ్చాడు అగార్కర్. అంతేకాదు.. అక్టోబర్ 19 నుంచి మొదలయ్యే ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌కు సైతం షమీని పరగణించలేదు. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే ఒకప్పుడు అత్యుత్తమ పేసర్‌గా వెలుగొందిన అతడు కెరీర్ ముగింపు దశకు చేరిందనే వార్తలు వినిపిస్తున్నాయి.



## టీమిండియా ఘన విజయం

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో భారత్ వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో భారత్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పట్టికలో 12 పాయింట్లు పెరిగాయి. రెండో టెస్టుకు ముందు 40 పాయింట్లు ఉండగా.. తాజా విజయంతో 52కి చేరాయి. అయినప్పటికీ ప్రపంచ టెస్ట్ చాంపియన్ షిప్ 2025–27 పాయింట్ల పట్టికలో భారత్ మూడో స్థానంలోనే కొనసాగుతున్నది. అయితే, పాయింట్ల శాతం 55.56శాతం నుంచి 61.90శాతానికి పెరిగింది. న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా ఈ ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో ఇంకా ఒక్క టెస్ట్ ఆడదు. ప్రస్తుతం పాక్‌దక్షిణాఫ్రికా మధ్య టెస్ట్ మ్యాచ్ కొనసాగుతున్నది. తాజా గణాంకాల ప్రకారం ఆస్ట్రేలియా 100శాతం విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్నది. అప్పటి వరకు ఆడిన మూడు టెస్టుల్లో మూడింటిని గెలిచి.. 36 పాయింట్లు, వంద పాయింట్లశాతంతో తన ఆధిక్యాన్ని పదిలం చేసుకుంది. త్వరలో ఆస్ట్రేలియా యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్‌తో తలపడబోతున్నది. పాయింట్ల పట్టికలో ఒక విజయం, ఒక ఓటమితో శ్రీలంక రెండోస్థానంలో ఉన్నది. ఈ జట్టు పాయింట్ల శాతం 66.67గా ఉంది. ఇక భారత జట్టు ఆరు మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, రెండు ఓటములు, ఒక డ్రాతో మూడవ స్థానంలో ఉంది. ఢిల్లీ టెస్ట్ గెలిచిన తర్వాత, టీమిండియా పాయింట్లు 52కి పెరిగాయి. కానీ పాయింట్ల శాతం ఆధారంగా.. శ్రీలంక కంటే వెనుకబడి ఉన్నది. భారత జట్టు స్థానం ప్రస్తుతం బలపడగా.. మొదటి రెండు స్థానాలకు చేరుకునేందుకు దక్షిణాఫ్రికాతో జరగబోయే టెస్ట్ సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. దక్షిణాఫ్రికాపై సైతం ఇదే ఊపును కొనసాగిస్తే 2027 ప్రపంచ టెస్ట్ చాంపియన్ షిప్ ఫైనల్‌కు చేరడం అంత కష్టమేమీ కాదు. ఇంగ్లాండ్ ఇక రెండు విజయాలు, రెండు ఓటములు, ఒక డ్రాతో 43.33 పాయింట్ల శాతంతో నాలుగో స్థానంలో ఉన్నది. ఇక బంగ్లాదేశ్, వెస్టిండిస్ చివరి రెండు స్థానాల్లో ఉన్నాయి. బంగ్లాదేశ్ రెండు మ్యాచుల్లో ఒక టెస్ట్‌ను మాత్రమే డ్రా చేసుకుంది. 16.67శాతం పాయింట్ల శాతం ఉన్నది. వెస్టిండిస్ ఇప్పటి వరకు ఆడిన ఐదు టెస్టుల్లోనూ ఓటమిపాలైంది. పాయింట్ల శాతం సున్నాకు చేరింది. ప్రపంచ టెస్ట్ చాంపియన్ షిప్ (2025–2027)లో ప్రతి మ్యాచ్ ఫలితం ఆధారంగా జట్లకు పాయింట్లు ఇస్తారు. ఒక మ్యాచ్‌లో విజయం సాధిస్తే 12 పాయింట్లు.. డ్రా అయితే నాలుగు, టై అయితే ఆరు పాయింట్లు ఇస్తారు. మొత్తం ర్యాంకింగ్ పాయింట్ల ద్వారా మాత్రమే కాకుండా.. పాయింట్ పర్సంటేజ్ సిస్టమ్ ద్వారా నిర్ణయిస్తారు.

## కొలంబోలో భారీ వర్షం

### న్యూజిలాండ్ ఇన్నింగ్స్ సాధ్యమయ్యేనా?



ప్రేమదాస స్టేడియంలో న్యూజిలాండ్ బౌలర్లను దంచేస్తూ భారీ స్కోర్ కొట్టిన శ్రీలంకకు వరుణుడు షాకిచ్చేలా ఉన్నాడు. ఆస్ట్రేలియాతో మ్యాచ్ వర్షార్పణం కాగా.. రోజు కూడా కొలంబోలో భారీగా వాన పడుతోంది. లంక ఇన్నింగ్స్ ముగిసిన కాసేపటికే మైదానంలో చినుకులు మొదలయ్యాయి. దాంతో.. పూర్తి ఓవర్ల ఆట సాధ్యమవుతుందా? లేదంటే.. రద్దయ్యే పరిస్థితి వస్తుందా? అని తొలి విజయంపై కన్నేసిన లంక జట్టు కాస్త ఆందోళనగా ఉంది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక ఆటపట్టు, నీలాక్షి డిసిల్వా అర్ధ శతకాలతో మెరవగా 258 రన్స్ చేసింది. ఈ మెగా టోర్నీలో ఇప్పటివరకూ ఈ మైదానంలో ఇదే భారీ స్కోర్ కావడంతో విజయంపై దీమాతో ఉన్న లంకను వర్షం కంగారెత్తిస్తోంది. వర్షం పెద్దగా పడుతుండడంతో మ్యాచ్ సాగుతుందా? లేదా? అనేది తెలియాల్సి ఉంది. చినుకులు మొదలవ్వడంతో సిబ్బంది పిచ్‌ను పూర్తిగా ప్లాస్టిక్ కవర్లతో కప్పేశారు. వాన తగ్గాక.. ఔట్ ఫీల్డ్ సిద్ధం చేసి మ్యాచ్ ప్రారంభం కానుది. అప్పటికి ఎంత సమయం పడుతుందో చెప్పలేం. ఒకవేళ అరగంట పైనే ఆటకు అంతరాయం ఏర్పడితో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఓవర్లు కుందించి .. కివీస్‌కు లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశముంది.

# ఫోకస్ మహిళ

## ఆర్థిక వెనుకబాటు..



గ్రామీణ మహిళ భారతీయ ఆర్థిక వ్యవస్థలో అత్యంత నిర్లక్ష్యమరచిన కార్మిక వర్గం. నేషనల్ సాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్‌ఎస్‌ఎస్‌ఒ) నివేదికల ప్రకారం, వ్యవసాయ రంగంలో మహిళల భాగస్వామ్యం 55 శాతం పైగా ఉన్నప్పటికీ, వారిలో కేవలం 13 నుంచి15 శాతం మంత్రి మాత్రమే భూమి యజమానులు. మిగతావారు కూలీలు లేదా సహకార కార్మికులు. పంటల సాగు, విత్తనాల నాటకం, తడిపంటల మార్పు, కోత, పొలం శుభ్రపరిచే పనులన్నీ ఆమె చేస్తుంది. కానీ కూలీ విషయంలో లింగ అసమానత తీవ్రంగా ఉంది. పురుషులు పొందే వేతనంతో పోలిస్తే మహిళలకు కనీసం 20 నుంచి 30 శాతం తక్కువగా చెల్లిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మైక్రో ఫైనాన్స్, స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జి) ద్వారా కొంతమంది మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. అయితే, ఇలాంటి పథకాల్లోనూ, మహిళలకు తమకు అందిన మొత్తాలను తిరిగి ఇంటి ఖర్చులకు వెచ్చించడం లేదా కుటుంబ సభ్యులకు ఇవ్వడం వంటి కారణాలతో ఆర్థిక వెనుకబాటు కొనసాగుతునే ఉంది.

## గ్రామీణ మహిళల జీవితాలు బాగుపడేది ఎన్నడో?



ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాల్లో గ్రామీణ మహిళలు ఆర్థిక, సామాజిక వివక్షకు గురవుతున్నారు. మన దేశంలోనూ అదే పరిస్థితి. దశాబ్దాలుగా వారి జీవన స్థితి ఏమాత్రం బాగుపడలేదు. వెనుకబాటు తప్పడం లేదు. ఇది అత్యంత ఘోరమైన వాస్తవం. దేశ జనాభాలో సుమారు 65 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వారిలో సగానికి పైగా మహిళలే. కానీ ఈ సమూహం దేశ అభివృద్ధిలో ప్రధాన బలం అయినప్పటికీ, నిర్ణయాధికారంలో, ఆర్థిక స్వాతంత్ర్యంలో, విద్యలో, ఆరోగ్యంలో, సమాన అవకాశాలలో తీవ్ర వెనుకబాటుతో ఉంది. చారిత్రక అంశాలను పరిశీలిస్తే, గ్రామీణ భారతంలో మహిళల పాత్ర శతాబ్దాలుగా ద్వంద్వ స్వభావాన్ని కలిగి ఉంది. ఒకవైపు ఆమె కుటుంబపు ఆర్థిక స్థితిని నిలబెట్టే శక్తి, మరోవైపు సమాజం విధించిన పరిమితులలో బందీ. వేదకాలంలో విద్య, ఆస్తి హక్కులు మహిళలకు అందుబాటులో ఉండేవి. కానీ మధ్యయుగ కాలం నుండి పితృస్వామ్య వ్యవస్థ బలపడడంతో మహిళల హక్కులు క్రమంగా లుప్తమయ్యాయి. బ్రిటిష్ కాలంలో విద్యావ్యాప్తి మొదలైనప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో దాని ప్రభావం తక్కువగానే మిగిలింది. గ్రామీణ మహిళల సామాజిక స్థానం నేటికీ కుటుంబానికి, భర్తకు, వంశపారంపర్య సంప్రదాయాలకు లోబడే కొనసాగుతున్నది. పితృస్వామ్య ధోరణి కారణంగా ఆమె స్వతంత్రతకు అవకాశాలు దాదాపుగా లేకుండాపోయాయి. పిల్లల పెంపకం, వంట, పశుపోషణ, వ్యవసాయం, నీరు తేవడం, ఇంధనం సేకరించడం వంటి పనులు అంతా ఆమె భుజాల మీదే. కానీ ఇవన్నీ ఉద్యోగంగా లేదా ఉత్పత్తిగా గుర్తింపుకు నోచుకోవు. ఇది ముమ్మాటికీ సాంఘిక అన్యాయమే.

## విద్యలోనూ అదే స్థితి..



'బేటీ బచావో... బేటీ పఢావో' వంటి ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా, ఎన్ని పథకాలను తెచ్చినా, మహిళల్లో విద్యాశాతం తక్కువగానే ఉంటున్నది. ప్రత్యేకించి గ్రామీణ మహిళల విద్యా స్థాయి దేశ అభివృద్ధి సూచికల్లో అత్యంత ఆందోళనకరమైన అంశంగా మారింది. దేశంలో స్త్రీల సగటు అక్షరాస్యత శాతం సుమారు 70కి చేరినా, గ్రామీణ ప్రాంతాల్లో అది 55 శాతం దాటడం లేదన్న విషయాన్ని గుర్తించాలి. పేదరికం, పాఠశాలలు అందుబాటులో లేకపోవడం, బాల్యవివాహాలు, కుటుంబ పరిమితులు కారణంగా బాలికల విద్య మధ్యలోనే ఆగిపోతుంది. సర్వశిక్షా అభియాన్, బేటీ బచావో బేటీ పఢావో వంటి పథకాలు కొంత మార్పు తెచ్చినప్పటికీ, ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. మహిళల విద్య పట్ల తల్లి దండ్రుల అవగాహన కూడా పెరుగుతోంది. కానీ విద్యావ్యాప్తి తీరు, నాణ్యత, ఉపాధి అవకాశాలకు అనుసంధానం వంటి అంశాలు ఇంకా బలహీనంగానే ఉన్నాయి.

(నేడు అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవం)




## భవిష్యత్తు ఆశాజనకం

గ్రామీణ మహిళలు పలు రకాల సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, భవిష్యత్తు ఆశాజనకంగానే కనిపిస్తున్నది. ఇటీవల కాలంలో, గ్రామీణ మహిళల్లో స్వీయ గౌరవం పెరుగుతోంది. విద్య, మీడియా, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు మహిళల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాయి. డిజిటల్ యుగం మొదలైన తర్వాత, ఎంతో మంది సోషల్ మీడియా వేదికగా తమను తాము కొత్తగా ఆవిష్కరించుకుంటున్నారు. ఎంతో మంది ఆర్థికంగానూ లాభపడుతున్నారు. దేశంలోని మహిళా రైతులు ఇప్పుడు ఆర్గానిక్ వ్యవసాయం, హ్యాండీక్రాఫ్ట్, చిన్న పరిశ్రమల ద్వారా ఆదాయ మార్గాలను సృష్టిస్తున్నారు. కుటుంబాల్లో నిర్ణయాధికారంలో కూడా మహిళల పాత్ర క్రమంగా పెరుగుతోంది. మహిళా సాంకేతిక శిక్షణ కేంద్రాలు, రూరల్ బిపిఒలు, డిజిటల్ లిటరసీ ప్రోగ్రామ్‌లు కొత్త అవకాశాలు కల్పిస్తున్నాయి. గ్రామీణ మహిళల సమగ్ర అభివృద్ధి లేకుండా భారత దేశ అభివృద్ధి అసాధ్యం. అందుకే, మహిళల్లో విద్య, నైపుణ్యాభివృద్ధికి ప్రయత్నించాలి. కేవలం చదువు కాదు, ఉపాధికి అనువైన నైపుణ్యాలు పెరిగేలా శిక్షణ ఉండాలి. భూమి, బ్యాంకు రుణాలు, సాంకేతిక సహాయం మహిళల పేరుతో ఉండాలి. అప్పుడే ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుంది. మహిళను బలహీనురాలిగా కాకుండా సహనాయకురాలిగా చూడాలి. సామాజిక దృక్కోణం ఈ మార్పు అత్యవసరం. ఏకంగా చూసినా, గ్రామీణ భారతీయ మహిళ అనేది శ్రమ, త్యాగం, ధైర్యం, సహనం, సృజనాత్మకతల ప్రతీక. ఆమె కేవలం ఇంటి చుట్టూ తిరిగే వ్యక్తి కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. ఆమెకు సమాన హక్కులు, గౌరవం, అవకాశాలు లభించినప్పుడే భారతదేశం నిజమైన ప్రజాస్వామ్య దేశంగా నిలుస్తుంది. గ్రామీణ మహిళల పురోగతి అంటే దేశం పురోగతి. ఎందుకంటే ఆమె చేతుల్లోనే ఆ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లు

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ ధర్మబిక్షం భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలో ఉన్న బిసి నాయకులంతా వారిపై ఉన్న నాయకత్వానికి భయపడి బిసి 42 శాతం బిల్లుని అడ్డుకుంటే భవిష్యత్తు తరాలు క్షమించరని ఆయన వెల్లడించారు. సిపిఐ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా బిసి రిజర్వేషన్లు 42 శాతం ఆమోదించాలని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో సిపిఐ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి అన్ని వర్గాల బిసి సంఘాలు మద్ధతు తెలిపి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సిపిఐ సూర్యాపేట పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులను ఆదుకోవాలి



ప్రజాపక్షం/మణుగూరు : ఆటో కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఆటో యూనియన్ సురక్ష బస్టాండ్ అడ్డ ఎఐటియుసి మహాసభ రాయల బిక్షం అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సరెడ్డి పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ ఆటో కార్మికుల పరిస్థితి అధ్వానంగా ఉందని, రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి ఏర్పడిందని, మహిళలకు ఉచిత బస్ సౌకర్యంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆటో కార్మికులను అందించాలని డిమాండ్ చేశారు. సిపిఐ మణుగూరు పట్టణ, మండల కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబు మాట్లాడుతూ ఆటో కార్మికుల ఐకమత్యంతో కలిసి మెలిసి అన్న, తమ్ముడు లాగా జీవించాలని, ప్రయాణికులతో మంచిగా నడుచుకోవాలని, సత్ప్రవర్తన కలిగి ఉండాలని, ఆదర్శంగా నిలవాలని మీకు అండగా ఎఐటియుసి, సిపిఐ నిలబడుతుందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు రాయల భిక్షం గడ్డం వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, మ్యాజిక్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు చారి, సిరిగదే సతీష్, కొత్తపల్లి సత్యనారాయణ, ప్రసాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**అనంతరం నూతన కమిటీ ఎన్నిక...** ఆటో యూనియన్ సురక్ష బస్టాండ్ అడ్డ (ఎఐటియుసి) అధ్యక్షుడిగా ఎన్.ఎన్.రాజు, కార్యదర్శిగా మందారి పుల్లయ్య, గౌరవ అధ్యక్షుడిగా చారిని ఎన్నుకున్నారు.

## దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం

### మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కరణ




ప్రజాపక్షం/నిజామాబాద్ : నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని, దేశ అభివృద్ధిలో విద్యార్థుల భాగస్వామ్యం తప్పనిసరి అని, వారి పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే, మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోని బోధన్ ఎమ్మెల్యే నివాసంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర 4వ మహాసభల లోగోను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఏ సమాజానికైనా అవసరమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ నైతిక, వైజ్ఞానిక, మానవీయ విలువలు ఇచ్చే సాధన విద్య అని, ఆ విద్యతోనే దేశాభివృద్ధికి బాటలు వేయవచ్చని, దీనికి సాధకులు విద్యార్థులు అన్నారు. దేశ అభివృద్ధిలో విద్యార్థుల భాగస్వామ్యం తప్పనిసరి ఉండాలన్నారు. నేడు సమాజంలో జరుగుతున్న మార్పులను విద్యార్థులు గమనించాలని, విద్యార్థులు రాజకీయాల్లోకి వచ్చి అవినీతి, అన్యాయాలపై ఉద్యమించాలని కోరారు. ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఎఐఎస్ఎఫ్ పోరాటాలు అభినందనయమన్నారు. జిల్లాలో నవంబర్ 20–22 తేదీల్లో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని ఈ సమహాభసలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్ సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు నగేష్‌రెడ్డి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు పి.సుధాకర్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వరదపట్టు వేణురాజ్, నాయకులు అంజలి, రఘురాం, కుషాల్, సుభోద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై పోరాటం

### ఎఐఎస్ఎఫ్ భద్రాద్రి జిల్లా కార్యదర్శి అజిత్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : భారత స్వాతంత్ర పోరాటంలో విద్యార్థులు, యువకులను ఏకం చేసిన ఏఐఎస్ఎఫ్ 90 వసంతాలు పూర్తి చేసుకుందని, ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో విద్యార్థులు భాగస్వాములై విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం ప్రతిభా కళాశాలలో ఎఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య కార్పోరేట్, ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలపై విద్యార్థులు సంఘటితం కావాలని కోరారు. విద్యార్థిలోకం శాస్త్రీయ విద్యావిధానాన్ని అలవర్చుకోవాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎఐఎస్ఎఫ్ నిర్వహించే పోరాటాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, మణిక్యాల వినయ్ కళ్యాణ్, వనిత, వందన తదితరులు పాల్గొన్నారు.



## కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలో విద్యార్థులపై ఫీజు భారం తగదు

### విసికి విద్యార్థి సంఘాల వినతి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలో డిగ్రీ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం విద్యార్థులకు వివిధ రకాల ఫీజులను భారీగా పెంచారని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కాకతీయ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ఖమ్మంలో పర్యటించిన సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విసి ప్రతాపరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు మందా సురేష్ మాట్లాడుతూ కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం విద్యార్థులకు వివిధ రకాల ఫీజులు భారీగా పెంచిందన్నారు. పెరిగిన ఫీజులతో ఒక్కో విద్యార్థిపై గతంలో కంటే రూ.1,910లు అదనంగా భారం పడుతుందన్నారు. పేద విద్యార్థులు పెరిగిన ఫీజులను చెల్లించి విద్యను అభ్యసించే పరిస్థితిల్లో లేరని, తక్షణమే ప్రభుత్వం పునరాలోచన చేసి ఫీజులు భారాన్ని తగ్గించాల కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు శ్యామల, రాము, శివ, గోపి, మనోజ్, శ్రీనాథ్, లోకేష్, సాత్విక తదితరులు పాల్గొన్నారు.



## అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ పథకాలు : ఎఐటియుసి



ప్రజాపక్షం/తంగళ్ళపల్లి : అసంఘగటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని ఎఐటియుసి సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, హమాలీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చుపల్లి శంకర్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా తంగళ్లపెల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో హమాలీ కార్మికులతో కలిసి ఈ నెల 26న వేములవాడలోని గుమ్మి పుల్లయ్య భవన్‌లో నిర్వహించే ఎఐటియుసి జిల్లా 4వ మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా వుండే హమాలీ కార్మికులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వీరు సంవత్సరాలుగా పల్లెలను నమ్ముకొని సొంతంగా పని చేసుకుంటున్నారని, ప్రభుత్వాలపైన అధారపడడం లేదన్నారు. కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, జిల్లాలో ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం చేయాలన్నారు. జిల్లాలో అంగన్‌వాడీ, మున్సిపల్, గ్రామపంచాయతీ, మిడ్ డే మీల్స్, అటెండెర్స్, స్కావేంజర్స్, లాంటి అసంఘటిత కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కాంట్రాక్టు పద్ధతి కాకుండా అన్ని రంగాలలో ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే కార్మికులను ఉద్యోగులుగా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్మిక హక్కుల సాధాన కోసం ఎఐటియుసి నిర్వహిస్తున్న 4వ జిల్లా మహాసభలలో అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ తంగళ్లపెల్లి కార్యదర్శి సోమ నాగరాజు, నాయకులు బట్టు చంద్రం, బర్ల గంగయ్య, ఆకారపు ఎల్లయ్య, ఆకారపు శ్రీనివాస్, ఎర్ర మల్లయ్య, బట్టు మధు తదితరులు పాల్గొన్నారు..

## జిపి కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

### ఎఐటియుసి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రామస్వామి

ప్రజాపక్షం/చండంపేట : గ్రామపంచాయతీ కార్మికుల మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి నల్లగొండ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని చందంపేట మండల ఎంపిడిఒ కార్యాలయం ముందు మంగళవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రామస్వామి పాల్గొని మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ద్వారా ఇస్తామని చెప్పి ఇప్పటికి మూడు నెలలు గడుస్తున్నా వేతనాలు ఇవ్వలేదన్నారు. వేతనాలు లేక కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు నెలకు రూ.9500 ఇవ్వాలని, ఉన్న కొన్ని జిపిలలో తక్కువ వేతనాలు ఇస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. జిపిలకు కనీస వేతనం నెలకు రూ.25వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, నెల నెల ప్రభుత్వం వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దీపావళి తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ఆయన హెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యులు మల్లయ్య, జిపి కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బొజ్జనాయక్, దేవరాజ్, ఇద్దయ్య, దేవాచారి, లక్ష్మ, ముత్తయ్య, అంజమ్మ, శ్రీను, పద్మ, లక్ష్మ య్య తదితరులు పాల్గొన్నారు





# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## వృత్తి శిక్షణ శిక్షకులకు ఆహ్వానం

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించబడే ఉచిత వృత్తి శిక్షణ కోర్సులకు శిక్షకులుగా సేవలు అందించడానికి ఆసక్తి గల మహిళల (సింగరేణి ఉద్యోగస్తుల డిపెండెంట్స్, భూ నిర్వాసితుల) నుండి దరఖాస్తులను కోరుతున్నట్లు డిజిఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియాలో టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి కోర్సులను నేర్పడానికి ఆసక్తిగల పైన పేర్కొన్న మహిళలు తమ తమ కోర్సుకు సంబంధించిన సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో పాటు పూర్తి వివరాలతో కూడిన బయోడేటాను ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో అందజేయాలని ఆయన సూచించారు. కంప్యూటర్ కోర్సులలో (డిటిపి) శిక్షణ ఇచ్చేందుకు కంప్యూటర్ శిక్షణ సంస్థల నుండి కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు పదవ తరగతి లేదా ఆపైన చదువుకున్న వారు మాత్రమే అర్హులని ఆయన పేర్కొన్నారు.

## తక్షణ రక్షణకు సిపిఆర్ శిక్షణ

**ప్రజాపక్షం/మందమర్రి :** సిపిఆర్ (కార్డియోపల్మనరీ రిససిటేషన్) పద్ధతిని నేర్చుకోవడం ద్వారా అనుకోని గుండెపోటు (హార్ట్ స్ట్రోక్) లేదా సడన్ కార్డియాక్ అరెస్టు వచ్చినవారికి తక్షణమే ప్రాణరక్షణ చేయవచ్చని వైద్యులు రమేష్, మానస అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.అనిత ఆదేశానుసారం మంగళవారం మందమర్రి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిపిఆర్, పొగాకు ఉత్పత్తుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రాణాంతకమైన గుండెపోటు సమయంలో తక్షణ రక్షణకు సిపిఆర్ ఎంతో ముఖ్యమని, యువత, ఆశా కార్యకర్తలు, కళాశాల విద్యార్థులు తప్పనిసరిగా ఈ పద్ధతి నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. అదే విధంగా పొగాకు ఉత్పత్తులు, తంబాకు, గుట్కా, సిగరెట్లు, బీడీలు, మత్తు పదార్థాల వాడకం ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ లింగారెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య



**ప్రజాపక్షం/తిర్యాణి :** కుటుంబ కలహాల కారణంగా సైదం కల్పన (28) అనే వివాహిత పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం తిర్యాని మండలంలో చోటుచేసుకుంది. తిర్యాణి ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం... తిర్యాణి మండలం గంభీరావుపేట గ్రామానికి చెందిన సైదం శేఖర్‌కు, బెల్లంపల్లి మండలం, కన్నల గ్రామానికి చెందిన జాగిర్తి బాపు రెండవ కూతురు కల్పనతో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. గత కొన్ని సంవత్సరాలుగా దాంపత్య జీవితం సాఫీగా సాగినా, గత రెండు సంవత్సరాల నుండి గొడవలు మొదలయ్యాయి. గతంలో తిర్యాని పోలీస్ స్టేషన్‌లో శేఖర్ ఫిర్యాదు చేయగా, పోలీసులు భార్యాభర్తలకు కౌన్సిలింగ్ చేసి పంపించారు. అనంతరం మళ్లీ గొడవ కావడంతో కల్పన పుట్టింటికి వెళ్లిపోగా, అనేక సార్లు పెద్దమనుషుల సమక్షంలో కోర్టులో పంచాయతీలు జరిగాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి కల్పన పురుగులమందు సేవించి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన తిర్యాణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ కల్పన మృతి చెందింది. మృతురాలి తల్లి జాగిర్తి దేవక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. కల్పన, శేఖర్ దంపతులకు కుమారుడు హర్షవర్ధన్ (8), కూతురు సామాన్విత (6)లు ఉన్నారు. అయితే, తమ అల్లుడే తమ కూతురు కల్పనను హతమార్చాడని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## భార్యను హత్య చేసిన భర్త



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని వెంకటేశ్వర కాలనీలో భార్యను అతి కిరాతకంగా కత్తితో గొంతు కోసి భర్త హత్య చేసిన ఘటన చోటు చేసుకుంది. జగదీష్ గత 40 సంవత్సరాల క్రితం గుజరాత్ నుండి ఆర్మూర్‌కు బతుకుదెరువు కోసం వచ్చాడు. మెదక్‌కు చెందిన కమ్మరి మమతను వివాహం చేసుకుని ఆర్మూర్‌లో జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఆర్మూర్‌లో జగదీష్ ఒక సామిల్‌లో పని చేస్తున్నాడు. మమత గణపతులు తయారుచేసే వారి వద్ద బొమ్మలకు మెరుగులు అద్దే పని చేస్తుంది. తన భార్య మమత గత కొన్ని రోజులుగా వేరొకరితో అక్రమ సంబంధం పెట్టుకుందని గ్రహించి ఎన్నిసార్లు నచ్చజెప్పినా వినలేదని ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. మంగళవారంగొడవ జరగడంతో మమత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా ఇద్దరిని సయోధ కుదుర్చి ఇంటికి పంపారు. జగదీష్ అన్నం తినడానికి ఇంటికి వచ్చే వరకు వేరొకరితో భార్య ఉండటం చూసిన జగదీష్ కిచెన్‌లోని కత్తి తీసుకుని విచక్షణా రహితంగా గొంతు కోసం హత్య చేశాడు. హత్య చేసిన అనంతరం ఇంటి బయటనే కూర్చుని ఉన్నాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితున్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు తెలిసింది.

## బిజెపి నేతల మధ్య వాగ్వాదం..

**ప్రజాపక్షం/వేమనపల్లి/ బెల్లంపల్లి :** భారతీయ జనతా పార్టీకి చెందిన ఇద్దరు పార్లమెంట్ స్థాయి నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఒక నేతకు కోపం వచ్చి, మరొక నేతకు చెంప పగులుద్ది అంటూ మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఈ ఘటన రాష్ట్ర అధ్యక్షుడు ముందు జరిగింది. వేమనపల్లి మండలం నీల్వాయిలో ఆత్మహత్య చేసుకున్న ఏట మధూకర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వచ్చారు. ఆయన పర్యటన సందర్భంగా బిజెపి పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ గోమాస శ్రీనివాస్ మాజీ పార్లమెంట్ సభ్యుడు వెంకటేష్ నేతను అరేయ్ వెంకటేష్ అంటూ సంబోధించారు. దీంతో వెంటనే స్పందించిన వెంకటేష్ నేత అరేయ్ అంటే చెంప పగులుద్ది అంటూ సీరియస్ అయ్యారు. దీనికి గోమాస శ్రీనివాస్ బట్టలు ఊడదీసి కొడతా అంటూ వెంకటేష్ నేతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకానొక దశలో కూర్చుని ఉన్న వెంకటేష్ నేత గోమాస శ్రీనివాస్ వైపు వెళ్లే ప్రయత్నం చేశారు. అయితే అక్కడున్న ఇతర నాయకులు కలిసి ఆయన భుజాలపై చేయి వేసి కూర్చోబెట్టారు. ఈ వాగ్వాదం అంతా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు ముందే జరగడం గమనార్హం. జాతీయ పార్టీలో, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిలో రాష్ట్ర అధ్యక్షుడు ఎదుట ఇలాంటి వివాదం, అది కూడ పరామర్శకు వెళ్ళి పంచాయితీ పెట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## బిజెపి కార్యకర్త మధుకర్ ఆత్మహత్య కేసులో దోషులను శిక్షించాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ప్రజాపక్షం / వేమనపల్లి/ చెన్నూర్ :** వేమనపల్లి బిజెపి మండల అధ్యక్షుడు ఏటా మధుకర్ ఆత్మహత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం మధుకర్ స్వగ్రామం నీల్వాయిలో ఆయన కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం, మధుకర్ చిత్రపటానికి నివాళులర్పించి మీడియాతో మాట్లాడారు. మధుకర్ కుటుంబాన్ని బిజెపి అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చిన ఆయన, మధుకర్ ఆత్మహత్య కేసులో దోషులను శిక్షించే వరకు బిజెపి పోరాటం చేస్తుందని తెలిపారు. జడ్‌పిటిసి ఎన్నికల్లో మధుకర్ పోటీ చేసి గెలుస్తాడనే భయంతో కాంగ్రెస్ నాయకులు అతనిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయించి, రాజకీయ వేధింపులకు పాల్పడ్డారని, దీని కారణంగానే మధుకర్ ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన ఆరోపించారు. ఎఫ్ఐఆర్ కాపీలో కాంగ్రెస్ నాయకుల పేర్లు ఉన్నప్పటికీ, పోలీసులు ఇప్పటివరకు వారిని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించిన రాంచందర్ రావు, రామగుండం పోలీస్ కమిషనర్ ను కలిసి కేసు పురోగతిపై చర్చించనున్నట్టు తెలిపారు. బిజెపి కార్యకర్తలు ఎవ్వరూ మనోధైర్యం కోల్పోవద్దని, మీకు అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. మంచిర్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్, మాజీ ఎంపి బోర్లకుంట వెంకటేష్ నేత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల హేమాజీ, నాయకులు దుర్గం అశోక్, గోమాస శ్రీనివాస్, వేమనపల్లి మండల నాయకులు కంపల్లి అజయ్ కుమార్, కొప్పుల చరణ్ పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యకు ప్రభుత్వం కృషి

### మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాపక్షం/లక్షెట్టిపేట్/హాజీపూర్ :** ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్, లక్షెట్టిపేట మండల కేంద్రాలలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో అన్ని సదుపాయాలు కల్పించి, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, శుద్ధమైన తాగునీటిని అందుబాటులో ఉంచాలని, ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకొని, హాజరు శాతం పెంపొందించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పాఠశాల తరగతి గదులు, వంటశాల, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రత పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని, పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని కోరారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యాసనా సామర్థ్యాలను పరీక్షించారు. చదువులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

**మంచిర్యాల టౌన్ :** జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఆర్‌డిఓ శ్రీనివాస్ రావుతో కలిసి కలెక్టర్ జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన ఆర్బిట్రేషన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణ పనులలో భాగంగా ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా...

## అలాట్మెంట్ రాదు.. వడ్లు కొనరు!



**ప్రజాపక్షం /నందిపేట్ :** ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే వాటిని కొనుగోలు కేంద్రాల ద్వారా కొనాల్సిన ప్రభుత్వం నామకే వస్తేగా కేంద్రాలని తెరిచి అలాట్మెంట్ కాలేదని ఎక్కడి ధాన్యం అక్కడే వదిలేసిన వైనం నందిపేట్‌లో కనిపిస్తుంది. నందిపేట్ మండలంలో చాలా గ్రామాలలో ముందుగానే వరి పంట నాటారు. తక్కువ కాలం సన్నరకాలు కావడంతో తొందరగా పంట చేతికి వచ్చింది. కోత కోసి కుప్పలుగా పోసి ఆరపెడితే అకాల వర్షాలు. ప్రభుత్వం అక్టోబర్ నెల మొదటివారంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని ప్రకటించింది. జిల్లాలో 663 కొనుగోలు కేంద్రాలు మంజూరు చేసింది. అనుకున్న ప్రకారం అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ధాన్యం కొనుగోళ్ళు జరగడం లేదు. రైస్ మిల్లర్లు ముందుకు రావడం లేదని చల్లని కబురు తెలిసింది. ముందే వర్షాలు పడి వడ్లు నానిపోతాయని రైతులకు భయం పట్టుకుంది. ఎప్పుడైతే పంట విత్తనాలు ఏర్రబడ్డాయో అప్పటినుండి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అల్పపీడనం ఏర్పడి భారీ వర్షాలు పడడం కోతకు వచ్చిన వరి అడ్డం పడడంతో రైతులు ఆందోళనలో పడ్డారు. దాదాపు వారం రోజుల వర్షాలకు అందరు భయపడ్డారు. ఈ భయానికే ధాన్యం కొనడం లేదా లేక రైస్ మిల్లర్లు ముందుకు రావడం లేదో తెలియని పరిస్థితి. చాలా గ్రామాలలో టోకెన్ నెంబరు రెండు వందల వరకు వచ్చాయి. ఎప్పుడు ధాన్యం కొంటారో తెలియని పరిస్థితి. ఇన్ని రోజులు కష్టపడి పండించిన పంట కళ్లముందే నష్టం జరిగితే చేసిన అప్పులు తీరేదెలా అంటు రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభించాలని కోరుతున్నారు.

# ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా భోధన

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ :** జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రైవేటు బదులకు దీటుగా నాణ్యమైన విద్యా బోధన అందుతోందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పాఠశాల పరిస్థితులను పరిశీలించారు. తరగతి గదులను పరిశీలిస్తూ విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడారు. విద్యార్థులు యూనిఫామ్‌లు, నోటుబుక్‌లు, పాఠ్య పుస్తకాలు అందుకున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఉపాధ్యాయుల దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటివరకు పూర్తయిన సిలబస్‌పై సమీక్ష చేశారు. సామాన్య శాస్త్ర పాఠానికి సంబంధించిన పట్టాలను బోర్డుపై గీయించి విద్యార్థుల అవగాహన స్థాయిని అంచనా వేశారు. బోర్డు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. పరీక్షలపై భయపడకుండా స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.భోజన్న,మండల ప్రత్యేక అధికారి అంజి ప్రసాద్,తహసీల్దార్ శ్రీకాంత్,ఎంపీడీఓ పుష్పలత,ఇతర అధికారులు,ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

## కొమురం భీం త్యాగాలు స్ఫూర్తిదాయకం

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** తెలంగాణ ముద్దుబిడ్డ, గిరిజనుల హక్కుల కోసం పోరాడిన వీరుడు కొమురం భీం 85వ వర్ధంతి సందర్భంగా కాగజ్ నగర్ మండలం కోసిని గ్రామంలోని ప్రాణహిత భవన్ ఆవరణలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యామ్ రావు హాజరై కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేసి, కొమురం భీం చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా శ్యామ్ రావు మాట్లాడుతూ కొమురం భీం చేసిన త్యాగాలు, పోరాటం తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిగా నిలిచాయని, ఆయన ఆత్మస్ఫూర్తితో ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించి బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమానికి అన్నదానం చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్క మనోహర్, బండి వాసు, తన్నీరు పోచం, డొత్రే గోపాల్, కామ్రే విజయ్, రావుజి తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా పసిడి 'జీరో' దందా!

**అధిక ధరలతో వినియోగదారుల దోపిడీ పట్టించుకోని అధికారులు**

**ప్రజాపక్షం / చెన్నూరు :** నిర్ణీత ధరల కంటే అధికంగా పసిడిని విక్రయిస్తూ చెన్నూరు పట్టణంలో జీరో దందా విచ్చలవిడిగా సాగుతోంది. సరైన అనుమతులు లేకుండా హోల్‌సేల్ గా బంగారం అమ్ముతూ, అధిక ధరలతో వినియోగదారులను కొందరు వ్యాపారులు మోసం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తూనికలు కొలతల శాఖ వాణిజ్య పన్నుల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో వ్యాపారుల ఆగడాలు పెరిగాయని స్థానికులు మండిపడుతున్నారు.

**ఊరంతా జీరో దందానే :** చెన్నూరు బంగారానికి స్థానికంగా డిమాండ్ ఉండడంతో వందకు పైగా దుకాణాలలో వ్యాపారులు జీరో దందా నిర్వహిస్తూ కోట్లు ఆర్జిస్తున్నారు. ఇక్కడ చాలామంది వ్యాపారులు ప్రభుత్వానికి పన్ను ఎగవేస్తూ, అధిక ధరలకు బంగారం విక్రయిస్తున్నారు. కొందరు హోల్‌సేల్ లో బంగారం అమ్ముతుండగా, మరికొందరు ఆన్లైన్ బిల్లులు ఇవ్వకుండా, తెల్ల కాగితాల్లో బిల్లులు ఇస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను ఎగవేస్తున్నారు. తెల్ల కాగితాలపై బిల్లులు ఇస్తూ పన్నులు ఎగవేస్తున్న వ్యాపారుల పట్ల వాణిజ్య పన్నుల శాఖాధికారులు చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారు. వినియోగదారులకు ఆన్లైన్ లోనే బిల్లులు ఇవ్వాలనే నిబంధనలను తుంగలో తొక్కి జీరో దందా నిర్వహిస్తున్నా, తూనికలు కొలతల శాఖ వాణిజ్య పన్నుల శాఖాధికారులు తనిఖీల ఊసెత్తడం లేదు. అధికారులు నిద్రావస్థను వీడి తనిఖీలు నిర్వహించి జీరో దందా నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

**ప్రజలను దోచుకుంటున్న వారిపై చర్యలు చేపట్టాలి :**

**సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు మధునయ్య**

బంగారం వ్యాపారుల జీరో దందాను కట్టడి చేస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరగడమే కాకుండా వినియోగదారులకు సైతం ప్రయోజనకరంగా ఉంటుందని సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు బడికెల మధునయ్య అన్నారు. వ్యాపారులు నిర్ణీత ధరల కంటే అధికంగా వసూలు చేస్తూ తెల్ల కాగితాల్లోనే బిల్లులు ఇస్తున్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి జీరో దందా చేసే వ్యాపారులపై చర్యలు చేపడితే దోపిడీ నుండీ ప్రజలకు విముక్తి లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## న్యాయశాస్త్ర విభాగంలో స్పాట్ అడ్మిషన్ నిర్వహించాలి

### ఎఐఎస్ఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి :** న్యాయశాస్త్ర విభాగంలో (లా కోర్సులు) స్పాట్ అడ్మిషన్ నిర్వహించాలి. తెలంగాణ యూనివర్సిటీ ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం టియు రిజిస్ట్రార్‌కు వర్సిటీలో మిగిలిపోయిన ఎల్ఎల్‌బి సీట్లకు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించాలని వినతి పత్రం అందించి ఎఐఎస్ఎఫ్ నాయకులు సంజీవ్ మాట్లాడారు. టియు పరిధిలో లా కాలేజీ ఒకటే ఉన్నందున మిగిలిపోయిన ఎల్ఎల్‌బి సీట్ల కోసం స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించినట్లయితే గ్రామీణ పేద, మధ్యతరగతి విద్యార్థులకు న్యాయ విద్యనందించిన వారవుతారని, కావున వెంటనే స్పాట్ అడ్మిషన్ నిర్వహించాలని వారు టియు ప్రొఫెసర్ యాదగిరికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో చందు, రావి, రషీద్, తపన్, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల అబద్ధాలు ప్రజలకు బహిర్గతమవుతున్నాయి

### బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి

**ప్రజాపక్షం / కాసిపేట :** కాంగ్రెస్ నేతల అబద్ధాలు ప్రజలకు బహిర్గతమవుతున్నాయని, బిఆర్ఎస్ పార్టీ ఉనికిపై వారు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ ఉనికి గట్టిగా ఉందని, అందుకే కాంగ్రెస్ నేతలు ఆదరాబాదరగా ప్రెస్ మీట్లు పెడుతున్నారని విమర్శించారు.

# మెరుగైన సేవల కోసం పౌర సేవాకేంద్రం భవనం ప్రారంభం



**ప్రజాపక్షం /పటాన్ చెరు :** పటాన్‌చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపల్ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పౌర సేవ కేంద్రం భవనాన్ని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ శ్రీదేవితో పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో పౌరసేవ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నూతన మున్సిపాలిటీల ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, చంద్రశేఖర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి పాల్గుణ కుమార్, మున్సిపల్ కమీషనర్ వెంకట కిషన్ , మాజీ ఎంపిపి శ్రీశైలం , యాదవ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి ,మాజీ ప్రజా ప్రతినిధులు సీనియర్ నాయకులు ,కార్యకర్తలు మున్సిపల్ సిబ్బందికి బట్టలు పంపిణి చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి

### మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

**ప్రజాపక్షం/గజ్వేల్ :** మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక కష్టాల నడుమ శ్రమించి పండించిన మొక్కజొన్న పంట కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం సిగ్గుచేటని నిలదీశారు. దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని వెంటనే కొనుగోలుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వానికి ఏ మాత్రం రైతుల పట్ల చిత్తశుద్ధి ఉన్నా వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర అందించాలని, లేని పక్షంలో రైతుల పక్షాన బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాన్ని చేస్తామని వివరించారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, నాయకులు ఉమర్, శివకుమార్, నిజామోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# దళారులకు ధాన్యం అమ్మొద్దు

### మెదక్ రూ.32 కోట్లు బోనస్ పెండింగ్
### నర్సాపూర్ సెగ్మెంట్ కి రూ.8.1 కోట్లు
### ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి వ్యాఖ్య



**ప్రజాపక్షం/కొల్చారం :** దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొంగోడు, నాయిని జాలాల్‌పూర్, అంసానిపల్లి, కొల్చారం, వరిగుంతం, అప్పాజీపల్లి, పోతంశెట్టి పల్లి గ్రామాలలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నర్సాపూర్ శాసన సభ్యురాలు వాకిటి సునీతా లక్ష్మారెడ్డి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులకు కొనుగోలు కేంద్రాల ప్రారంభంపై ఉన్న శ్రద్ధ రైతులకు కల్పించే వసతులపై లేదని ఆరోపించారు. జిల్లాలో రైతులకు ఇవ్వాల్సిన బోనస్ 32 కోట్లు పెండింగ్‌లో ఉందని, అలాగే నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని రైతులకు 8.1 కోట్లు బకాయి పడ్డ బోనస్ డబ్బులను వెంటనే చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎంపిడిఓ రఫిక్ ఉన్నిసా, ఎఒ శ్వేత, మండల పార్టీ అధ్యక్షులు రాంపల్లి గౌరీ శంకర్‌గుప్తా, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేష్, మాజీ జడ్పీటిసి శ్రీనివాస్ రెడ్డి, మాజీ డిసి ఎం ఎస్ వైస్ చైర్మన్ ఇంద్ర సేనా రెడ్డి,మండల యువత అధ్యక్షుడు తునుకు పల్లి సంతోష్ రావు, మాజీ జడ్పీటిసి ముత్యంగారి మేఘమాల సంతోష్, నరేందర్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, యూత్ ఐకాన్ రవి తేజ రెడ్డి, వేమారెడ్డి,సంజీవులు, పిఎసిఎస్ చైర్మన్లు నాగురి మనోహర్, మన్నే రాములు, చిన్నారపు ప్రభాకర్, కుకునూరి సత్యనారాయణ గౌడ్,మాజీ సర్పంచ్ లు మాజీ ఎంపిటిసిలు సంజీవులు, నెల్లి కిష్టయ్య,చిట్యాల యాదయ్య, కొమ్ముల యాదగౌడ్, సాయిని సిద్ది రాములు, సిఐఒలు సాయిరెడ్డి, కృష్ణ, రాములు, ఆంజనేయులు, నాయకులు గౌరీశంకర్, చింతల యాదగిరి, సోమా నర్సిములు, ఎఇఒలు స్రవంతి, శోభ, తదితరులు ఉన్నారు.

## పాత బాకీలు తీర్చడంతోనే సమయం సరిపోతుంది : మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** గత ప్రభుత్వం చేసిన పాత బాకీలు తీర్చడంతోనే సమయం సరిపోతుందని మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు అన్నారు. నిజాంపేట మండలం రాంపూర్ గ్రామంలో మంగళవారం లీల గ్రూప్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు మోహన్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. గత ప్రభుత్వ హయాంలో మాయ మాటలు చెప్పి ప్రజలను మభ్య పెట్టారని విమర్శించారు. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి మరెన్నో అబద్ధపు మాటలు చెప్పి ప్రజలను మభ్య పెట్టారని పేర్కొన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు ప్రజలకు మోసపూరిత మాటలపై అవగాహన కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన పెంచాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోని తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ తోనే ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, నిజాంపేట మండల అధ్యక్షుడు వెంకట్ గౌడ్, నాయకులు కొమ్మాట బాబు, పంజా మహేందర్, నజీరుద్దీన్, మారుతి, నాతిలక్ష్మా గౌడ్, గరుగుల శ్రీనివాస్, కొమ్మాట సత్యనారాయణ, జెల్లాలక్ష్మణ్, రాజు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## మల్లన్న వనం సందర్శించిన ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ ప్రియాంక నర్గీస్

ప్రజాపక్షం/కొండపాక:కుకునూర్‌పల్లి మండల పరిధిలోని లకుడారం గ్రామ శివారులో ఉన్న మల్లన్న వనంను సిరిసిల్ల జిల్లా సిసిఎఫ్, ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ ప్రియాంక నర్గీస్ మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా వనంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, మొక్కలు పెంపకం, సంరక్షణ చర్యలను పరిశీలించారు.తదుపరి ఆమె సిబ్బందికి పలు సూచనలు చేస్తూ వనం అభివృద్ధిపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఫారెస్ట్ అధికారి శ్రీనివాసులు, జిల్లా ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఇక్రముద్దీన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ చందు, ఇతర అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



## యువకులపై పోక్సో కేసు నమోదు

ప్రజాపక్షం/కొత్తపల్లి:మైనర్‌బాలికపై లైంగికదాడి చేసిన ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు కొత్తపల్లి సిఐ కోటేశ్వర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి మండలంలోని గ్రామానికి చెందిన బాలికతో ఇద్దరు యువకులు కొద్దిరోజులుగా సన్నిహితంగా ఉంటున్నారు. ఆమెకు మత్తుమందు సైతం అలవాటు చేసినట్లు సమాచారం. వారం రోజుల క్రితం నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి ఒకరి తర్వాత ఒకరు లైంగికదాడికి పాల్పడ్డారు. లైంగిక దాడి సమయంలో వీడియో చిత్రీకరించారు. మూడు రోజుల క్రితం ఈ వీడియోలను స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. ఈ వీడియోలు వైరల్ అయి బాలిక తల్లిదండ్రుల దృష్టికి చేరింది. దాడికి పాల్పడిన విశ్వతేజ్, సన్నీపై చర్యలు తీసుకోవాలని ఆమె తల్లిదండ్రులు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసిపి విజయ్‌కుమార్ ఆదేశాలతో రంగంలోకి దిగిన సిఐ బిల్లా కోటేశ్వర్ దర్యాప్తులో ఇద్దరు యువకులపై ఫోక్స్ కేసు నమోదు చేశారు. సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మత్తు పదార్థాలకు బానిసలవుతున్న యువకులు బాలికలను లోబర్చుకుని వారికి మత్తు మందు ఇస్తున్నట్లు సమాచారం. యువత మత్తుకు బానిసలు కావద్దని, ఇదే గ్రామంలో పోలీసులు ఇటీవల అవగాహన కల్పించారు. మత్తు పధార్థాలను అరికట్టి యువతను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## కార్యకర్తల అభిప్రాయం మేరకే డిసిసి అధ్యక్షుడి నియామకం

ఎఐసిసి పరిశీలకుడు మన్నె శ్రీనివాస్



ప్రజాపక్షం/గంగాధర:కార్యకర్తల అభిప్రాయం మేరకే జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుని నియామకం జరుగుతుందని ఎఐసిసి అబ్జర్వర్ మన్య శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గంగాధర మండలం మధురానగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో చొప్పదండి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా డిసిసి అధ్యక్షుడి నియామకంపై కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యకర్తల నుంచి సేకరించిన అబిప్రాయాలను అధిష్టానానికే పంపిస్తామని, కార్యకర్తల అభీష్టం మేరకే డిసిసి అధ్యక్షుడు నియాకమం జరుగుతుందని ఆయన తెలిపారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఇక్కడ పిసిసి అబ్జర్వర్లు ఆత్రం సుగుణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి, కరీంనగర్ ,సిరిసిల్ల బిసి సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, కూస రవీందర్, చొప్పదండి, రామడుగు, గంగాధర, బోయినిపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడుఇప్పశ్రీనివాస్‌రెడ్డి, ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలున్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాపక్షం/కొత్తపల్లి:రేషన్ బియ్యం కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున వ్యక్తిని కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని దుబ్బపల్లి గ్రా మానికి చెందిన కర్రె గంగారాం గత కొంతకాలంగా రేషన్ బియ్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సిఐ నిరంజన్‌రెడ్డి ఆద్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో గంగారం వద్ద నుంచి 300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. గంగారాంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. రేషన్ బియ్యం పట్టుకున్న సిఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ నరేష్‌లను సిపి గౌష్ ఆలం, ఎసిపి విజయ్‌కుమార్‌లు అభినందించారు.

## డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం / కరీంనగర్ :యువత విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల నిర్మూలన కు పకడ్బందీగా చర్య లు తీసుకోవాలని డ్రగ్స్ రహి త జిల్లాగా తీర్చి దిద్దాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్, ఎక్సైజ్ శాఖ, శిశు సంక్షేమ శాఖ, వైద్య తదితర శాఖల అధికారులతో జిల్లా స్థాయి నార్కో కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క లెక్టర్ మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిమాణాల పై పాఠశాలలు, కళాశాలల్లో, బహిరంగ ప్రదేశాల్లో అవగాహన కల్పించాల ని సూచించారు. పోలీస్, ఎక్సైజ్, విద్యాశాఖ అధికారులు కలిసి రోడ్ల ప క్కన పాఠశాలలు, పాన్ షాపులలో తనిఖీలు చేయాలని పేర్కొన్నారు. కరీంనగర్ సిపి గౌస్ ఆలం మాట్లాడుతూ మత్తు పదార్థాల నిర్మూలనకు నిత్యం గస్తీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ హస్టళ్లు, ఆర్టీసి కా ర్గో, ప్రయివేట్ పార్సిల్ సంస్థలతో పాటు ఆన్‌లైన్ సంస్థలకు సంబంధించిన గోదాములను తనిఖీ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్ బాబు, డిడబ్ల్యుఓ సరస్వతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణా నిర్మూలించడం మన అందరి బాధ్యత: డిఇఒ



ప్రజాపక్షం / కరీంనగర్:మానవ అక్రమ రవాణా నిర్మూలించడం అందరి బాధ్యత అని డిఈవో మొండయ్య అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి సంస్థ ఆధ్వర్యంలో వాణినికేతన్ కిడ్స్ కేర్ హాల్ కరీంనగర్ నందు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ నిర్వహించారు. ఈ సందర్బంగా డిఈవో మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచం వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది సమాజంలో ఉన్న చాలా సమస్యలకు ఆర్థిక కారణాలతో పాటు సామాజిక కారణాలు దోహదం చేస్తాయని, మన చుట్టుపక్కల ఉండే ఇలాంటి వాళ్లను ట్రాఫికర్స్ టార్గెట్ చేసి, మాయమాటలు, ఉద్యోగం సినిమా అవకాశం అంటూ పట్టణాలకు తీసుకెళ్లి వ్యభిచారం గృహాలలో అమ్ముతున్నారని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మొం డయ్య,ఎఎంఒ అశోక్ రెడ్డి, ప్రజ్వల కో ఆర్డినేటర్‌అంబర్ సింగ్, సిబ్బంది కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

# క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి

*రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

* మంథనిలో నిర్వహించిన 'సంఘటన్ శ్రీజన్' కార్యక్రమానికి హాజరైన ఎఐసిసి పరిశీలకుడు డాక్టర్ జయ్ కుమార్





ప్రజాపక్షం/ముత్తారం/మంథని : క్షేత్రస్థాయిలో పార్టీ బలో పేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.మంగళవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని శివ కిరణ్ గార్డెన్స్ లో నిర్వహించిన పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఎంపికలో భాగంగా సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకులు డాక్టర్ జయ్ కుమార్, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,రామగుండం నియోజకవర్గ శాసన సభ్యులు పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రోటోకాల్ చైర్మన్ హర్కర వేణుగోపాల్ రావు లు ముఖ్య అతిదులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కార్యకర్తల అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని జిల్లా పార్టీ అధ్యక్షులు నియామకం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు తమ అభిప్రాయాలను అబ్జర్వర్లకు స్వేచ్ఛగా తెలపవచ్చని కార్యకర్తలకు నాయకులకు ఆయన సూచించారు. మంథని,రామగుండం,పెద్దపల్లి నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆర్ అండ్ బి, రెవెన్యూ అధికారులతో మంత్రి రివ్యూ సమావేశం**

మంథని పట్టణంలోని మంథని గోదావరి బ్రిడ్జి పనులను, శ్రీపాద రింగ్ రోడ్డు పనులను సంబంధించి ఆర్ అండ్ బి, రెవెన్యూ అధికారులను, కంపెనీ ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు క్యాంప్ కార్యాలయంలో రివ్యూ తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి అధికారులతో రివ్యూ తీసుకోవడం జరిగింది.గోదావరి బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని,శ్రీపాద రింగ్ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి వేగవంతం చేయాలని అధికారులను, బ్రిడ్జ్, రోడ్డు కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. 4 కోట్ల 50 లక్షలతో మంజూరైన ఆర్ అండ్ బి అతిథిగృహానికి స్థల సేకరణ చేయాలని, వెంటనే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.మంథని మున్సిపాలిటీలో 10 కోట్ల తో మంజూరైన అన్ని కులాలకు సంబంధించిన కమ్యూనిటీ హాల్స్‌కు స్థలం లేని వాటికి వెంటనే ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి వారికి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పనులు చేసుకోవడానికి అందజేయాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు.మంథనిలో హమాలీ సంఘం మరియు ఆటో నడుపుకుని ఆటో కార్మికులకు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి వారికి ఇంటి నిర్మాణం చేసుకునే విధంగా ఖాళీ స్థలాలను గుర్తించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బిఇఇ, రె వెన్యూ డివిజన్ అధికారి, ఎమ్మార్వో,జెఇ, కంపెనీ ప్రతినిధులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి శ్రీధర్ బాబును ఘనంగా సన్మానించిన రజక సంఘం నేతలు**

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మంథని రజక సేవా సంఘం నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు.మంథని రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ. 20 లక్షలను మంత్రి శ్రీధర్ బాబు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబును శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పోత రాజు సమ్మయ్య, సదానందం,పైడాకుల నాగరా జు ,పోతరాజు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టుల అభివృద్ధి పనులు పూర్తికి చర్యలు

నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పోరేషన్ పెండింగ్ ప్రాజెక్టుల అభివృద్ధి పనులను డిసెంబర్ 31లోగా పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో స్మార్ట్‌సిటీ పెండింగ్ ప్రాజెక్టుల అభివృద్ధి పనులు, వీధి దీపాల నిర్వహణ వాటి సమస్యలు, ఫ్లడ్ ప్రపోజల్స్, 15 ఫైనాన్స్ అభివృద్ధి పనులు, నల్ల పన్నుల వసూళ్లు, నూతన అభివృద్ధి పనుల టెండర్ ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పలు అభివృద్ధి పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకుని సలహాలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో ప్రారంభించి ప్రస్తుతం పనులు కొనసాగుతున్న డిజిటల్ లైబ్రరీ భవనం, బాలసదన్ భవనం, ఐసిసిసి భవనం అభివృద్ధి పనులతో పాటు ఎస్‌విపి భవనం ఆధునీకరణ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అక్టోబర్ మాసంలో ఎస్‌విపి భవనం ఆధునీకరణ పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా టవర్ సర్కిల్ రెనవేషన్ అభివృద్ధి పనులను ప్రారంభం చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. మంచినీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా నీటి శుద్దీకరణ కేంద్రంలో చేపట్టిన మేజర్ మరమ్మత్తు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 14,34 ఎంఎల్‌డి సంపు మీడియా రీప్లేస్‌మెంట్ మరమ్మత్తు పనులతో పాటు 10 ఎంఎల్ డి వాష్ వాటర్ సంపు నిర్మాణం పనులను పూర్తి చేసి నీరు వృధా కాకుండా అరికట్టాలని అన్నారు. నీరు వృధా కాకుండా అరికట్టాలన్నారు. విలీన గ్రామాల డివిజన్‌తో సహా నగరవ్యాప్తంగా మంచినీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ చర్యలను ముందస్తుగానే చేపట్టాలన్నారు. విలీన గ్రామాల డివిజన్లలో ఓపెన్ వెల్స్ వాటర్ సోర్స్‌ను గుర్తించి వేసవికాలం త్రాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో లైట్లు వెలగని చోట రీ ప్లేస్ చేసి నగరవ్యాప్తంగా వీధి దీపాల సమస్యలను పూర్తిస్తాయిలో పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈలు సంజీవ్‌కుమార్, యాదగిరి, డీఈలు లచ్చిరెడ్డి, ఓంప్రకాష్, అయూబ్ ఖాన్, దేవేందర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఏఈలు పాల్గొన్నారు.

## ఆర్గానిక్ వ్యవసాయంతో అందరికీ ఆరోగ్యం




ప్రజాపక్షం/ సిద్దిపేట : ఆహారం అందరికి అవసరం..వ్యవసాయ యూనివర్సిటీ వారి పరిశోధనలనుప్రజలకు ఉపయోగించేందుకు కృషిచేస్తున్న విద్యార్థులను జిల్లా కలెక్టర్ హైమావతి అభినందించారు. విశాలదృకృథంతో అనేక ప్రయోజనాల కో సం రైతులు పండిస్తున్నారన్నారు. దేశంలో 150 కోట్ల జనాభా ఉన్న ఆహారాన్ని అందించగలుగుతున్నామని,మంగళవారం సిద్దిపేట రూరల్ మండల ం తోర్నాల గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తె లంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం తెలంగా ణ రైతు విజ్ఞాన కేంద్రం,వ్యవసాయ పరిశోధన కే ంద్రం వద్ద రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హైమావతి ముఖ్య అ తిథిగా హాజరై మాట్లాడారు. తాను 20 ఏండ్లు వ చ్చేవరకు వ్యవసాయం చేశానని, అన్ని పంటలు పండించే ప్రక్రియ గురించి పూర్తిగా అవగాహన ఉందన్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త వంగడాలను, కొత్త పద్దతులను వరి,పత్తి, ఇ తర్రా పంటలను ఆయా పద్దతులను అలవర్చుకొని రసాయనాలను వాడకుండ విద్యార్థులకు తెలియజేసే రకరకాలైన పద్దతులను రైతులు అలవర్చుకోవాలన్నారు.ఆనారోగ్యానికి కారణం రసాయన ఎరువులు వాడటం మూలంగా నేల, నీరు కలుషితం అవుతుందన్నారు. ఈ కలుషితం అయిన నేల నుండి ఆహారాన్ని,నీటిని తాగుతున్నాం, గాలిని పీలుస్తున్నట్లు తెలిపారు. గతంలో లేని రోగాలు, ఆరోగ్య సమస్యలు ఇప్పుడు వస్తున్నాయన్నారు. ఆర్గానిక్ పద్దతిలో వ్యవసాయం సాగుచేసి అందరం ఆరోగ్యంగా ఉందామన్నారు. ఇది ఒక్కరోజుతో అయ్యే పనికాదని, మెల్లమెల్లగా మంచి ఆహారాన్ని అందించి అందరికి జీవనాన్ని అందించటం కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. అంతకు ముందు వ్యవసాయ ప్రదర్శన స్టాళ్లను కలెక్టర్ తిలకించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన అధిపతి సంతోష్,ఎడిఎ పద్మ. సునితదేవి, వంగ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించకపోవటంపై ఆగ్రహించిన కలెక్టర్



ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ హైమావతి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆలు గడ్డ,టమాట కూర, పచ్చి పులుసు మాత్రమే వండాలని కామన్ డైట్‌లో మెనులో మిక్స్ విజిటెబుల్ కర్రీ, సాంబారు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పచ్చి పులు సు పెట్టి పిల్లల అనారోగ్యానికి కారకులవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల కు తక్కువ మోతాదులో వండించటంపై ఆ గ్రహం వ్యక్తం చేశారు.కూరనుమళ్లీ వండాలని పిల్లలకు సరిపోదని సిబ్బందిని ఆదేశించారు. కామన్ డైట్ పాటించకుండ నిర్లక్ష్యంగా విధులు నిర్వహించటంపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కామన్ డైట్ పాటించకుండ విద్యార్థులకు సరిపడా ఆహారం పెట్టనందుకు ప్రధానోపాధ్యాయులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిఇఒ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్‌ద్వారా ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్యం ఎంతో ముఖ్యమని.అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో మధ్నాహ్న భోజన ప్రక్రియను పరిశీలించారు.

## శాతవాహన బ్రీడింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఇద్దరు కూలీల ఘర్షణ

మొదటి అంతస్తు నుంచి తోసేయడంతో యువకుడు మృతి*ఘటనాస్థలాన్ని పరిశీలించిన సిఐ



ప్రజాపక్షం/చిగురుమామిడి:కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్నముల్కనూరు గ్రామ శివారులో శాతవాహన బ్రీడింగ్, హెచ్ఆర్ఎస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణంలో భాగంగా పక్క రాష్ట్రాలకు చెందిన ఇద్దరు కూలీలు ఘర్షణపడిన ఘటనలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. చిగురుమామిడి ఇంచార్జి ఎస్ఐ స్వాతి తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమ బెంగాల్‌కు చెందిన దాసో సోరెన్(33), ముస్లిం ఖాన్(35) అనే ఇద్దరు యువకులు రాత్రి పదిన్న గంటల సమయంలో మొదటి అంతస్తులో డబ్బుల గురించి గొడవపడుతూ ఇద్దరు ఘర్షణ పడుతుండగా దాసో సోరెన్‌ను ముస్లిం ఖాన్ అనే యువకుడు కిందికి తోసేసాడు. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్లు ఎస్ఐ స్వాతి తెలిపారు. సూపర్‌వైజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. సమాచారం తెలుసుకున్న తిమ్మాపూర్ సిఐ గడ్డం సదన్ కుమార్ హుటాహుటిన కంపెనీ వద్దకు చేరుకుని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ కంపెనీలో గతంలో సైతం మరొకరు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఇక్కడ పనిచేస్తున్న పక్క రాష్ట్రాలకు చెందిన కూలీలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోగా వారికి మద్యం అలవాటు చేసి వారితో రాత్రింబవళ్లు పని చేయించుకుంటున్నారని అక్కడి స్థానికులు చెబుతున్నారు. కూలీలకు కంపెనీ యాజమాన్యం అరకొర వసతులు కల్పించడంలో యాజమాన్య నిర్లక్ష్య వైఖరి వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చిన్న ముల్కనూర్, రామంచ గ్రామస్తులు చెబుతున్నారు. కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించి గొడవలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు చెబుతున్నారు.

# చెరువుకు చేరని చేప

ఆందోళనలో మత్స్యకారులు



ప్రజాపక్షం/అక్కన్నపేట: మత్స్యకారుల జీవనోపాధి కోస ం రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను వదులుతున్నది.ఈ ఏడాది చేప పిల్లల సరఫరా కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచిన నేపథ్యంలో అవీ ఎటూ తేలలేదు.దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత చేప పిల్లల కోసం మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు.

**సిద్దిపేటలో 'ఆలస్యంగా టెండర్లు'...**

ఈ ఏడాది మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆలస్యంగా నిర్ణయం తీసుకుంది.చేప పిల్లలను సరఫరా చేసేందుకు ఉన్నతాధికారులు గత నెలలో రాష్ట్రస్థాయిలో టెండర్లు పిలిచారు.గుత్తేదారులు టెండర్లలో పా ల్గొనకపోవడంతో రెండోసారి ప్రతీ జిల్లా నుంచి టెండర్లను పిలిచారు.కానీ ఆ జిల్లాలో వచ్చిన టెండర్లు నాణ్యత ప్రమాణాలు పాటించలేని కారణంగా టెండర్లు రద్దు చేశారని మత్స్యశాఖఅధికారులు వెల్లడిస్తున్నారు. ఈ కారణంగా చెరువుల్లో పోసేందుకు ఉచిత చేపపిల్లల కోసం మత్స్యకారులు ఎదురు చూడాల్సి వస్తోంది.రెండు నెలలు భారీ వర్షాలు కురియడంతో గత నెల మొదటి వారంలోనే జిల్లాలోని 80 శాతం చెరువులు,కుంటలు జలాశయాలు నిండా యి. మిగతా వాటిలో కూడా చేప పిల్లలు పోసుకునేందుకు పు ష్కలంగా నీరు చేరింది.కానీ మత్స్యశాఖ అధికారులు చేప పిల్లల పంపిణీ ఎప్పుడు చేస్తారనే విషయమై నేటికీ స్పష్టత లేకపోవడంతోమత్స్యకారులుఆందోళనవ్యక్తం చేస్తున్నారు.

**50 వేల మందికి ఉపాధి...**

సిద్దిపేట జిల్లాలో 1715 చెరువులు,కుంటలు,రిజర్వాయర్లు ఉన్నాయి.వీటిలో పోసేందుకు సుమారు 10 కోట్ల చేప పిల్లలు అవసరమవుతాయని అంచనా.జిల్లాలో 379 సొసైటీలు ఉండగా వాటిలో 24 వేల 601 మంది సభ్యులు ఉన్నారు.చెరువులపై ప్రత్యక్షంగా,పరోక్షంగా ఆధారపడి సుమారు 50 వేల మంది మత్స్యకారులు జీవనోపాధి పొం దుతున్నారు.ఇప్పటికే చెరువులు, కుం టలు,భారీ జలాశయాలు నిండుకుండలా ఉన్నా వాటిలో వేసేందుకు ఉచి త చేపపిల్లల సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం తీరుతో మత్స్యకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**అలంకారప్రాయంగా మత్స్యశాఖ, నిధులు కేటాయించాలి:పొన్నబోయినశ్రీనివాస్,హుస్నాబాద్ మత్స్యకారుడు**

గత ప్రభుత్వం సమీకృత మత్స్యఅభివృద్ధి పథకంతో పాటు కేంద్ర ప్ర భుత్వ ప్రధానమంత్రి మత్స్య సంపద యో జన పథకం క్రి ంద పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేసిం ది. పథకాల అమలులో నిధుల లేమి..అక్రమాల పరంపర మ త్స్యశాఖను వెంటాడుతోంది.ఇప్పటికైనా నిధుల కేటాయి ంపులో మత్స్యశాఖతో పాటు రాష్ట్ర మత్స్యకార సహకార స ంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ఏ మేరకు చేయూతనిస్తుందో చూడాలి మరీ...

## 17న రాజన్న కోడెల పంపిణీ: కలెక్టర్



ప్రజా పక్షం/ వేములవాడ : వేములవాడ రాజన్న ఆలయానికి భక్తులు సమర్పించిన కోడెలను ఈ నెల 17న వేములవాడ తిప్పాపూర్ గోశాలలో కోడెలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. హరిత ఒక ప్రకటన లో తెలిపారు. తిప్పాపూర్ గోశాలలోని 200 కోడెల జతలను శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉ మ్మడి కరీంనగర్ జిల్లా రైతులు అర్హులని స్పష్టం చేశారు. కోడెల కోసం అ ర్హత కలిగిన రైతులు జిల్లా వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్ బుక్ ఆధార్ కార్డ్ మొదలగు సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ వెబ్సైట్ https:/ /raja nna sircilla. tela nga na.gov.in/ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. కోడెలు పంపిణీ చేసే రోజున రైతులు ఆన్లైన్లో నమోదు చేసిన ఆయా సర్టిఫికెట్లు పత్రాలు వెంట తీసుకురావాలని తెలిపారు. అర్హులైన రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నామని స్పష్టం చేశారు. గురువారం ఉదయం వరకూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకుని కోడెలు తీసుకు వెళ్లని వారు పత్రాలతో రావాలని కలెక్టర్ తెలిపారు. జియో ట్యాగింగ్ ఉన్న కోడెలు, వెబ్సైట్ లో రైతుల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చునిస్పష్టం చేశారు. కోడెలను పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని సూచించారు.

# రీల్



## 'ఐయామ్ ది గాయ్' పాట విడుదల

విష్ణు విశాల్ స్టూడియోస్, శుభ్ర, ఆర్యన్ రమేష్‌లతో కలిసి నిర్మించిన 'ఆర్యన్' అనే గ్రిప్పింగ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌తో వస్తున్నారు. ఈ చిత్రానికి ప్రవీణ్ కె దర్శకత్వం వహించారు. 'ఐయామ్ ది గాయ్' అనే సాంగ్ రిలీజ్ చేశారు. జిబ్రాన్ స్వరపరిచిన ఈ పాటనకు సామ్రాట్ సాహిత్యం అందించారు. జిబ్రాన్, శ్రీకాంత్ హరిహరన్ పాడారు. ఆర్యన్ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. హీరో నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో శ్రేష్ట్ మూవీస్ ద్వారా విడుదల చేయనున్నారు. అనేక బ్లాక్ బస్టర్లను అందించిన ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ బ్యానర్ మద్దతుతో ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. శ్రేష్ట్ మూవీస్ గతంలో విక్రమ్, అమరన్, థగ్ లైఫ్ వంటి చిత్రాలను విడుదల చేశారు. సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో విష్ణు విశాల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు.

## సందీప్ కిషన్ హీరోగా 'సూపర్ సుబ్బు' సిరీస్



సందీప్ కిషన్ హీరోగా రూపొందిన కొత్త సిరీస్ 'సూపర్ సుబ్బు'. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్ నెట్ ఫ్లిక్స్ 2026లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ 'సూపర్ సుబ్బు' ఆలోచన ఒక అబ్జర్వేషన్ నుంచి పుట్టింది. సుబ్రహ్మణ్యం అనే పాత్ర ద్వారా అవగాహన ఎలా కలిగిస్తారో చూపించాలనుకున్నాం అన్నారు. నటి మిథిలా పాల్కర్ మాట్లాడుతూ సూపర్ సుబ్బు కామెడీ, భావోద్వేగాలు, కుటుంబ బంధాలు అన్నీ కలగలసిన కథ. సుబ్బు అనే దురదృష్టపు యువకుడు చిన్న పట్టణ వాస్తవాలతో, కఠినమైన తండ్రితో ఎలా పోరాడతాడో ఈ సిరీస్ చెబుతుంది అన్నారు. హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ ఇప్పుడు మనం ఒక అందమైన కథా కాలంలో ఉన్నాం. కథలు మరింత ధైర్యంగా, భావోద్వేగంగా, మన జీవితాల్లో భాగంగా అనిపించేలా మారాయి. 'సూపర్ సుబ్బు' కథ విన్న వెంటనే ఇది చెప్పదగ్గ నిజమైన కథ అని నమ్మాను. ప్రేక్షకులు ఈ కథను ప్రేమిస్తారని అనిపించింది. పాత్రల ఉత్సాహం, రచనలోని హాస్యం.. ఇవన్నీ సిరీస్ మొత్తాన్ని చిరునవ్వుతో నింపుతాయి. ఈ సిరీస్‌కు రాజీవ్ చిలకా, నిర్మాతగా వ్యవహరించారు.



## 'మిత్ర మండలి' నచ్చకపోతే.. నా సినిమాలు చూడకండి

### ప్రీ రిలీజ్ వేడుకలో ప్రియదర్శి

బివి వర్క్స్ బ్యానర్ మీద బన్నీ వాస్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వరక్స్ మీద కళ్యాణ్ మంతెన, భాను ప్రతాప, డా. విజేందర్ రెడ్డి తీగల నిర్మించిన చిత్రం 'మిత్ర మండలి'. ఈ మూవీలో ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమాకు విజయేందర్ దర్శకత్వం వహించారు. బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, సత్య, విష్ణు ఓయి, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా, విటివి గణేష్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని 16న విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో శ్రీ విష్ణు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా శ్రీ విష్ణు 'తిప్పరామీసం' టైంలో విజయ్ ఏడీగా పని చేశారు. 'మిత్ర మండలి' పెద్ద హిట్ అవుతుంది. విజయ్ కోసం ఫ్రెండ్స్ అందరూ ఇలా వచ్చి సపోర్ట్ చేయడం ఆనందంగా ఉంది. రాగ్ మయూర్, విష్ణు, ప్రసాద్ ఇలా అందరూ నాకు ఇష్టం. ప్రియదర్శి ఎప్పుడూ ఎనర్జీగానే ఉంటాడు. ఆయన మంచి కథల్ని ఎంచుకుంటూ ఉంటాడు. కాబట్టే నేడు (15) ప్రీమియర్లు వేస్తున్నారు. ఈ మూవీని మైండ్‌తో కాకుండా, మనసుతో చూడండి. అందరినీ నవ్విస్తుంది. నేను ఈ చిత్రాన్ని చూశాను. చాలా సీక్వెన్స్‌లు అదిరిపోయాయి. 'మిత్ర మండలి' ఫుల్లుగా ఎంటర్టైన్ చేసి థియేటర్ నుంచి బయటకు పంపించేస్తుంది' అని అన్నారు. ప్రియదర్శి మాట్లాడుతూ ఈ చిత్రం మీకు నచ్చకపోతే.. నెక్స్ట్ వచ్చే నా ఏ సినిమాని కూడా చూడకండి. 'మిత్ర మండలి'తో దీపావళిని మేం మీ కోసం ముందుగానే తీసుకు వస్తున్నాం. 16న ఫ్రెండ్స్, ఫ్యామిలీతో వెళ్లి మా చిత్రాన్ని చూడండి' అని అన్నారు. బన్నీ వాస్ మాట్లాడుతూ ప్రియదర్శి నాకు వ్యక్తిగతంగా చాలా ఇష్టమైన వ్యక్తి. 'మిత్ర మండలి' చిత్రం చాలా బాగా వచ్చింది. దీపావళికి ఫ్యామిలీని నవ్వించే క్లీన్ ఎంటర్టైనర్. అందరినీ హాయిగా నవ్వించే మా సినిమాను 16న రిలీజ్ చేస్తున్నాం. అందరూ వచ్చి మా మూవీని చూసి ఎంజాయ్ చేయండి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ విజయేందర్ , నిర్మాత భాను ప్రతాప, నిర్మాత డా.విజేందర్ రెడ్డి తీగల, సంగీత దర్శకుడు ధృవన్, దర్శకులు అనుదీప్ కేవీ, కళ్యాణ్ శంకర్, వివేక్ ఆత్రేయ, ఆదిత్య హాసన్ పాల్గొన్నారు.

## మా మధ్య విభేదాలు లేవు

### 'కే -ర్యాంప్' నిర్మాతలు రాజేశ్ దండ, శివ బొమ్మకు

సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కే ర్యాంప్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేశ్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'కెర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు రాజేశ్ దండ, శివ బొమ్మకు మీడియాతో 'చిట్ చాట్' నిర్వహించారు. రాజేష్ మాట్లాడుతూ కిరణ్ అబ్బవరంతో ఒక సినిమా చేయాలి. రూల్స్ రంజన్ తర్వాత మా కాంబోలో ఒక సినిమా చేయాలని నిర్ణయించాం. దర్శకుడు జైన్స్ నాని కిరణ్‌తో ఏడాదిన్నరగా ట్రావెల్ చేస్తున్నారు.



ఆయన చెప్పిన కథ నచ్చి నా దగ్గరకు పంపించారు. కేరళలో షూటింగ్ చేయడం వల్ల సినిమాకు కొత్త లుక్ వచ్చింది. ప్రొడ్యూసర్స్ అంతా స్నేహితులమే. మా మధ్య విబేధాలు లేవు. చేతన్ భరద్వాజ్ ది బెస్ట్ మ్యూజిక్ ఇచ్చారు. మా బ్యానర్‌లో వచ్చిన చిత్రాల్లో ఇంటర్వెల్ సర్‌ప్రైజ్ చేస్తుంది. శివ బొమ్మకు నా స్నేహితుడు. ఈ చిత్రంతో నాతో పాటు ప్రొడక్షన్‌లో భాగమయ్యారు. నా మీద నమ్మకంతో కథ కూడా వినకుండా పార్టనర్‌గా చేసేందుకు ముందుకొచ్చారు. మా కాంబినేషన్‌లో ఇకపై మరిన్ని మూవీస్ చేయబోతున్నాం. ప్రొడ్యూసర్ శివ బొమ్మకు మాట్లాడుతూ దీపావళి పండక్కి మీ అందరి ముందుకు 'కే ర్యాంప్' సినిమాతో వస్తుండటం సంతోషంగా ఉంది. ఈ కథ విన్నప్పుడు చాలా ఎంటర్‌టైనింగ్‌గా అనిపించింది. ఈ కథను ఎంతో మెచ్యూర్డ్‌గా తెరకెక్కించారు మా డైరెక్టర్ నాని. ప్రొడ్యూసర్ రాజేశ్ తో కలిసి కంఫర్ట్‌గా ఈ మూవీకి ప్రొడక్షన్ చేశాం. కుమార్ పాత్రలో హీరో కిరణ్ అబ్బవరం ఎనర్జిటిక్‌గా పర్ ఫార్మ్ చేశారు. ఆయనను ఈ సినిమాలో కొత్తగా చూస్తారు. సినిమా కంప్లీట్‌గా ఎంటర్ టైన్ చేస్తుంది. ప్రొడక్షన్ టైమ్‌లోనే ఈ సినిమా తప్పకుండా సక్సెస్ అవుతుందనే నమ్మకం కలిగింది. మ్యూజిక్, ఎడిటింగ్, డీవోపీ..ఇలా మా టీమ్ లోని వాళ్లంతా సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లారు. హీరోయిన్ క్యారెక్టర్ సర్‌ప్రైజ్ చేస్తుంది. నరేష్, వెన్నెల కిషోర్ పాత్రలను ప్రేక్షకులు గుర్తుపెట్టుకుంటారు అని అన్నారు.

## మీసాల పిల్లా పాట విడుదల




మెగాస్టార్ చిరంజీవి హీరోగా, నాయన తార హీరోయిన్‌గా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మనం శంకర వరప్రసాద్ గారు సినిమా నుంచి మీసాల పిల్లా అనే పాటను ఆవిష్కరించారు. భార్య భర్తల మధ్య జరిగే చిన్న చిన్న గొడవలు నేపథ్యంలో ఈ పాటను చిరంజీవి, నయనతార పై చిత్రీకరించారు. భాస్కర పట్ల రచించిన ఈ పాటను ప్రముఖ గాయకుడు ఉదిత్ నారాయణ, శ్వేత మోహన్ కలిసి ఆలపించారు. పోలంకి విజయ్ ఈ పాటకు నృత్య దర్శకత్వం వహించారు. వచ్చే యేడాది సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. చిరంజీవి సరసన క్యాథరిన్ తెరిసా కీలక పాత్ర పోషిస్తోంది. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## కొన్ని సీన్స్ సవాల్‌గా అనిపించాయ్

### 'చిట్‌చాట్'లో మమిత బైజు



'ప్రేమలు' సినిమా విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటిస్తున్నారు. ఈ నెల 17న తెలుగు, తమిళ, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మమిత బైజు మీడియాతో చిట్ చాట్ చేశారు. ప్రేమలు రిలీజ్ తర్వాత మేకర్స్ నన్ను సంప్రదించారు. ఆ తర్వాత డైరెక్టర్‌తో మీటింగ్ జరిగింది. కీర్తి తొలి సారిగా నన్ను సంప్రదించినప్పుడు, కథను చెప్పిన తీరు నాకు బాగా నచ్చింది. కాన్సెప్ట్ కూడా చాలా ఆసక్తికరంగా అనిపించింది.ఆ కథలో నా పాత్రకు చాలా ప్రాధాన్యత వుంది. కురల్ పాత్రలో చాలా డిఫరెంట్‌గా వుంటుంది. ఇప్పటివరకూ అలాంటి పాత్ర చేయలేదు. కురల్ చాలా హానెస్ట్ క్యారెక్టర్. ఆమె తన భావోద్వేగాల పట్ల నిబద్ధతగా ఉంటుంది, చుట్టూ ఉన్న వారందరితో స్నేహంగా వుంటుంది. ఆమె చాలా సూటిగా మాట్లాడుతుంది. ఆ పాత్ర చేయడం నాకు మంచి అనుభవానిచ్చింది. ఈ సినిమాలో కొన్ని ఎమోషనల్ సీన్స్ నాకు సవాలుగా అనిపించాయి. ఆ సీన్స్ కోసం నేను రాత్రంతా డైలాగ్స్ ప్రాక్టీస్ చేశాను. షూట్ సమయంలో వాటి గురించి ఆందోళన లేకుండా సీన్ మీద ఫోకస్ చేశా. నేను ఎప్పుడూ షూట్‌కు ముందు బాగా ప్రిపేర్ అయి ఉండాలని చూసుకుంటాను. అందుకే ఇది నాకు ఒకేసారి సవాలుగా, ఉత్సాహంగా అనిపించింది. ప్రదీప్ రంగనాథ్ తో నటించడం మంచి ఎక్స్ పీరియన్స్. ఆయన మల్టీ ట్యాలెంటెడ్ సెట్స్‌లో చాలా హెల్ప్ ఫుల్‌గా వుంటారు. శరత్ కుమార్ లాంటి సినియర్ యాక్టర్స్‌తో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. డైరెక్టర్ కీర్తి ఈ సినిమాని చాలా అద్భుతంగా తీశారు. ఇందులో వుండే ఎమోషన్స్ ఫన్ చాలా యూనిక్‌గా వుంటాయి. సాయి అభ్యంకర్ మ్యూజిక్ ఈ సినిమాకి బిగ్ ఎసెట్. పాటలు మనసుని ఆకట్టుకుంటాయి. నేపధ్య సంగీతం కూడా అద్భుతంగా వుంటుంది. మైత్రీ మూవీ మేకర్స్‌తో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్ పీరియన్స్. చాలా పాషనేట్ ప్రొడ్యూసర్స్. సినిమాని చాలా గ్రాండ్‌గా తీశారు. తప్పకుండా ఈ సినిమా అందరినీ అలరిస్తుంది.

## న్యాయం జరుగుతుంది

(మొదటి పేజీ తరువాయి)

విచారణకు రావచ్చునని ఆయన వివరించారు. ఢిల్లీలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల జీఓపై పూర్తి వివరాలతో హైకోర్టులో వాదించినప్పటికీ, జీఓ 9పై స్టే విధిస్తూ, పాత విధానంలో ఎన్నికలకు వెళ్లాలని ఆదేశాలు ఇచ్చిందని, హైకోర్టు తీర్పు బాధాకరమన్నారు. అయినప్పటికీ బిసి రిజర్వేషన్లపై వెనక్కి తగ్గకుండా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వితో ప్రత్యేకంగా సమావేశం అయ్యానని తెలిపారు. బిసి రిజర్వేషన్లపై రాష్ట్ర అసెంబ్లీలో రెండు చట్టాలు చేసినప్పుడు అన్ని పార్టీలు ఏకమై మద్దతు పలికాయని, బిజెపి, బిఆర్ఎస్‌లు ఇప్పుడు మాట మార్చి వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు. ఓబిసిల జీవితాలు బాగుపడాలని చిత్తశుద్ధితో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలకు అడుగడుగునా బిజెపి, బిఆర్ఎస్‌లు వ్యతిరేకిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఢిల్లీకి తీసుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

సైతం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే విషయంలో మద్దతు ఇచ్చి, ఇప్పుడు గవర్నర్ వద్ద పెండింగ్‌లో పెట్టించి అడ్డుకుంటున్నారని ఆయన విమర్శించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కోసం సిపిఐ పోరాడుతుందని, హైకోర్టు కేసులో ఇంప్లీడ్ అయ్యిందని సాంబశివరావు తెలిపారు. వెనుకబడిన తరగతుల (బిసి) కు 42 శాతం రిజర్వేషన్‌పై కాలయాపన చేస్తున్న బిజెపి ద్వంద వైఖరి పట్ల ఈ నెల 15వ తేదీన బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో తలపెట్టిన జిల్లా, మండల కేంద్రాలలో రాస్తారోకో, నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. బిసి సంఘాల జెఎసి ఈ నెల 18న ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపునకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని అన్నారు. ఈ బంద్‌లో సిపిఐ కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.









## ధరలు పైపైకి

(మొదటి పేజీ తరువాయి)

ధర రూ.1,30,830కి ఎగబాకింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,21,150గా ఉంది. ఇక హైదరాబాద్‌లో కిలో వెండి ఒక్కరోజులోనే రూ.3వేలు పెరిగి రూ.1,86,200కి చేరింది. 2025లో బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 50 శాతానికి పైగానే ధరలు పెరిగాయి. 2022తో పోలిస్తే మొత్తం పెరుగుదల 140 శాతానికి చేరుకుంది. ఈ నెల 18న ధనత్రయోదశి వస్తున్నది. ఆ రోజున బంగారం, వెండి కొనుగోళ్లు శుభప్రదమని దేశంలోని మెజారిటీ ప్రజల విశ్వాసం. అయితే మార్కెట్‌లో ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా.. అప్పటికల్లా రేట్లు ఇంకా పెరిగిపోవచ్చన్న అంచనాలైతే ఉన్నాయి. ఇదే జరిగితే 24 క్యారెట్ గోల్ 10 గ్రాములు రూ.1,50,000 దాటిపోవచ్చన్న అభిప్రాయాలైతే బలంగా వినిపిస్తున్నాయి.

### అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ రేట్లు

ఇంటర్నేషనల్ మార్కెట్‌లో సోమవారం ఔన్స్ బంగారం ధర 3,900 డాలర్లు దాటింది. యుఎస్‌లో స్పాట్ గోల్డ్ ధర ఆల్‌టైమ్ రికార్డ్ హై 3,924.39 డాలర్లకు పెరిగి, తరువాత 3,922 డాలర్ల వద్ద స్థిరపడింది. మొత్తంగా చూసుకుంటే, గత కొన్ని నెలలో బంగారం ధర 50 శాతం మేర పెరిగింది. అంతేకాదు ఇకపై కూడా పసిడి ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఔన్స్ బంగారం ధర ప్రస్తుత స్థాయి నుంచి ఏకంగా 4,800 డాలర్లకు పెరిగే అవకాశం ఉందంటున్నారు. అంటే బంగారం ధర 26 శాతానికిపైగా పెరిగే ఛాన్స్ ఉందని బ్రోకరేజ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి.


















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com